ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 29.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 309 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

నాలుగో టీ20లో భారత్ ఓటమి 12

గద్దెపైకి చేరుకున్న సారలమ్మ

కొండాయి గూండెం నుంచి గోవిందరాజు

పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజు

పులకించిన మేడారం

మహాజాతరలో తొలి ఘట్టం

మేడారంలో అశేష జనవాహిని జయజయ ధ్వానాల మధ్య సారలమ్మను గద్దెలవద్దకు తీసుకువస్తున్న పూజారులు

- సారలమ్మకు మంత్రులు సీతక్క, పొంగులేటి స్వాగతం
- నేడు సాయంత్రం సమ్మక్క తల్లి ఆగమనం
- తల్లి రాకతో పతాకస్థాయికి జాతర

ప్రతిపక్షం ప్రతినిధి, మేడారం

జనవరి 28: మేడారం జనవనం అయ్యింది. మహాజాతరలో తొలి ఘట్టం ఘనంగా ఆవిష్కృతమైంది. జంపన్నవాగులో భక్తజన ప్రవాహంగా మారింది. మేడారం పసుపువర్ణమై మెరిసింది. కుంకుమ పరిమళంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మేడారం

...:: మిగతా 2లో

ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ దుర్మరణం

- బారామతి వద్ద కూలిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం విమానం పైలట్లు, భద్రతా సిబ్బంది సహా ఐదుగురి మృతి
- ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఘటన
- స్థానిక సంస్థల ఎన్నికల సభలకు వెళ్తుండగా విషాదం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

బారామతి, జనవరి 28: మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న చిన్న విమానం బారామతి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్తో పాటు పైలట్లు, భద్రతా సిబ్బంది సహా మొత్తం ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన నాలుగు బహిరంగ సభల్లో పాల్గొనేందుకు అజిత్ పవార్ బుధవారం ఉదయం ముంబై నుంచి బారామతికి బయలుదేరారు. ఉదయం 8 గంటలకు ముంబై నుంచి టేకాఫ్ తీసుకున్న విమానం, గంట తర్వాత బారామతి ఎయిర్ పోర్టులో ల్యాండ్ అవుతుండగా ప్రమాదానికి గురైంది. విమానంలో ప్రయాణిస్తున్న ఐదుగురూ అక్కడికక్కడే మృతి చెందినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వర్గాలు ధ్రువీకరించాయి. ప్రమాద స్థలంలో

...:: మిగతా 2లో

జాతీయ భద్రత కోసం ఐక్యంగా నిలబడాలి

గాంధీ, నెహ్రూ, వాజ్‌పేయి స్ఫూర్తిగా ఐక్యవాణి వినిపించాలి

ఎంపీలకు రాష్ట్రపతి పిలుపు.. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 28: వికసిత్ భారత్, స్వదేశీ ప్రచారంతోపాటు జాతీయ భద్రత కోసం పార్లమెంట్ సభ్యులంతా ఐక్యంగా నిలబడాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఈ అంశాలన్నీ రాజకీయ విభేదాలకు అతీతమైనవని ఆమె స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగాన్ని ప్రభుత్వం మరింత పెంచుతూనే ఉంటుందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సాయుధ దళాల పరాక్రమాన్ని యావత్ ప్రపంచం చూసిందని, ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయని ఆమె అన్నారు. తన ప్రసంగంలో గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, పటేల్, జయప్రకాష్ నారాయణ్, లోహియా, పండిట్ దీన్‌దయాళ్, వాజ్‌పేయిలను ప్రస్తావిస్తూ ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమని, కాని కొన్ని అంశాలు విభేదాలకు అతీతమన్న విశ్వాసాన్ని

...:: మిగతా 2లో

ఎక్సైజ్ శాఖలో మరో భారీ కుంభకోణం

- మైక్రో బ్రూవరీల కేటాయింపులో అవకతవకలు
- 25 టెండర్లను నేతలు, మంత్రులకు కేటాయించేందుకు ముందే నిర్ణయం
- ఒక్కో బ్రూవరీకి అనధికారికంగా రూ.1.80 కోట్ల మేర వసూలు
- ముఖ్యనేతకు అత్యంత సమీపంగా ఉండే వ్యక్తి కీలక పాత్ర
- మాజీ మంత్రి, బీఆర్ఎస్‌నేత హరీష్ రావు

...:: 5లో

ప్రజలను పట్టించుకునే తీరిక కాంగ్రెస్‌కు లేదు

- అందుకే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారు
- మున్సిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 28: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో విఫలం అయిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన విజయం సాధించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రజల గురించి పట్టించుకునే తీరిక, ఉద్దేశ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అందుకే ఇచ్చిన అన్నీ హామీలను తుంగలో తొక్కిందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తన అనుచరులతో కలిసి బీజేపీకి రాజీనామా

...:: మిగతా 2లో

ఉపాధి హామీ కొత్త చట్టం వెనక్కి తీసుకునే వరకూ

కాంగ్రెస్‌దేశవ్యాప్త ఉద్యమం

- ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్
- నిధుల కోతలతో రాష్ట్రాలపై భారం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం బ్యూరో

కరీంనగర్, జనవరి 28: ఉపాధి హామీ పథకానికి సంబంధించిన కొత్త చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడుతుందని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. పంజాబ్‌లో రైతు వ్యతిరేక చట్టాలపై జరిగిన ఉద్యమాన్ని ఉదాహరణగా పేర్కొంటూ, ఉపాధి హామీ కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదని ఆమె హెచ్చరించారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ముంజంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతల మార్గదర్శకత్వంలో దేశవ్యాప్త

...:: మిగతా 2లో

30న విచారణకు రండి

- ఎమ్మెల్యే దానంకు స్పీకర్ నోటీసులు
- పార్టీ ఫిరాయింపుల కేసులో బిగ్ ట్విస్ట్
- నేను బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు: దానం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 28: తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం నోటీసులు ఇచ్చారు. ఈనెల 30న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అదే విధంగా దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ వేసిన బీఆర్ఎస్

...:: మిగతా 2లో

రన్‌వే కనిపించక పోవడంతోనే..

ఎయిర్‌పోర్ట్‌లో విజిబులిటీ చాలా తక్కువగా ఉండటంతో.. 'రన్‌వే కనిపిస్తుందా? లేదా??' అని పైలట్లను బారామతి ఏటీసీ అధికారులు అడిగారు. ఏటీసీ ప్రశ్నకు.. కనిపించడంలేదని పైలట్లు సమాధానమిచ్చారు.

11

ప్రమాదమే.. కుట్ర లేదు!

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణంపై ఎన్సీపీ ఎస్పీ అధినేత శరద్ పవార్ స్పందించారు. విమాన ప్రమాదంలో ఎలాంటి కుట్ర లేదని అన్నారు. అజిత్ పవార్ ఈ ప్రమాదంలో మరణించారంటూ భావోద్వేగానికి గురయ్యారు.

11

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై దూకుడు ప్రదర్శిస్తున్నారు. తాజాగా మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. మరిన్ని యుద్ధనౌకలు ఆ దేశం వైపు వెళ్తున్నాయని పేర్కొన్నారు. వీటిని ఉపయోగించే అవసరం రావొద్దని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు.

11

ఈయూ డీల్‌లో భారత్ పైచేయి

భారత్- ఐరోపా సమాఖ్యల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం భారత్‌కే ఎక్కువ అనుకూలంగా ఉందని అన్నారు.

11

రాష్ట్రీయం

ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ దుర్మరణం

విమానం శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మంటలు, దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ హఠాత్పరిణామంతో మహారాష్ట్ర రాజకీయ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి.

బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో

అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్‌రావ్ పవార్ సీనియర్ రాజకీయ నాయకుడు, మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్కు సోదరుడు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన అజిత వార్ 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. అనంతరం బాబాయి శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి, రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి ఏడు సార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు.

సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి దిగ్భ్రాంతి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకమైన నేతగా గుర్తింపు తెచ్చుకున్న అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు భట్టి విక్రమార్క అన్నారు. విమాన ప్రమాదంలో అజిత్ పవార్ తో పాటు ప్రాణాలు కోల్పోయిన మరో ఐదుమంది ఆత్మలు శాంతించాలని ఆయన భగవంతున్ని సీఎం ప్రార్థించారు. అజిత్ పవర్ కుటుంబ సభ్యులకు మట్టి విక్రమార్క తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారు: కిషన్‌రెడ్డి

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎంతో ఖ్యాతి గడించారని కీర్తించారు. అజిత్ పవార్ తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి, రాజకీయాల్లో రాణిస్తూ.. డిప్యూటీ సీఎం స్థాయికి అజిత్ పవార్ ఎదిగారని కీర్తించారు. మహారాష్ట్రకు సుదీర్ఘకాలం డిప్యూటీ సీఎంగా పని చేశారని కొనియాడారు. మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంపై పట్టు సాధించి.. తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతిపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించారని తెలిసి చాలా బాధపడుతున్నానని అన్నారు. పవార్ లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మహారాష్ట్రకు ఇది కోలుకోలేని నష్టం. రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. పవార్ కుటుంబానికి, ఆయన మద్దతుదారులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను

-రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి దిగ్భ్రాంతి కలిగించింది. అట్టడుగు స్థానం నుంచి రాజకీయ నేతగా ఎదిగిన ఆయన ప్రజానాయకుడిగా మహారాష్ట్ర ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతారు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా

- ప్రధాని నరేంద్ర మోదీ

అజిత్ పవార్ మృతి వార్త వినగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. మేము ఎప్పుడు కలిసినా, మహారాష్ట్ర ప్రజల సంక్షేమానికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించుకునేవాళ్లం. ఆయన మరణం ఎన్డీఏ కుటుంబానికి తీవ్ర నష్టం. ఈ కష్టసమయంలో మేమంతా పవార్ కుటుంబానికి అండగా ఉంటాం.

- హోంమంత్రి అమిత్ షా

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ విమాన ప్రమాదంలో ఆకస్మిక మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. వారి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నా. అజిత్ పవార్ మరణం మహారాష్ట్ర రాజకీయాలకు తీరనిలోటు. మహారాష్ట్ర రాజకీయాల్లో విశేష అనుభవం ఉన్న నేత అజిత్ పవార్. ఈ విషాద సమయంలో పవార్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి.

– మంత్రి పొన్నం ప్రభాకర్

జాతీయ భద్రత కోసం ఐక్యంగా నిలబడాలి

మొదటిపేజీ తరువాయి

వారు చాటిచెప్పారని రాష్ట్రపతి అన్నారు. వికసిత్ భారత్, దేశ భద్రత, ఆత్మనిర్భరత, స్వదేశీ ప్రచారం, జాతీయ సమైక్యత కోసం కృషి, స్వచ్ఛత వంటి అంశాలు దేశానికి సంబంధించినవని, వీటి విషయంలో పార్లమెంట్ సభ్యులందరూ ఐక్యంగా నిలబడాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకు యూజీసీ జారీచేసిన కొత్త నిబంధనలపై కొన్ని వర్గాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ దళితులు, వెనుకబడిన వర్గాలు, అణగారిన వర్గాలు, గిరిజన వర్గాలు సహా అందరి కోసం ప్రభుత్వం పూర్తి స్పృహతో పనిచేస్తున్నదని ముర్ము తెలిపారు. వికసిత్ భారత్, వీబీజీ రామ్ జీ పథకం గురించి రాష్ట్రపతి ప్రస్తావించినపుడు విపక్ష సభ్యుల నుంచి పెద్ద పెట్టున నిరసనలు వ్యక్తమయ్యాయి. వీబీజీ రామ్ జీ పథకం గురించి ఆమె మాట్లాడుతున్న సమయంలో దాన్ని ఉపసంహరించుకోవాలంటూ విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. యూరోపియన్ యూనియన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ తయారీ, సేవా రంగాలకు ఉత్సాహాన్ని ఇవ్వడంతోపాటు దేశ యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని రాష్ట్రపతి తెలిపారు.

30న విచారణకు రండి

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డికిసైతం స్పీకర్ నోటీసులు జారీ చేశారు. 30వ తేదీన వారు కూడా విచారణకు రావాలని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపు కేసులో మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు ఫిర్యాదులు అందగా.. వారిలో అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్, ప్రకాశ్ గౌడ్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గుర్తించారు. అయితే, దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ లకు సంబంధించి స్పీకర్ ఇంకా విచారణ జరపలేదు. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఫామ్ పై ఎంపీగా పోటీ చేశారు. దీంతో ఆయన పార్టీ ఫిరాయించారనడానికి బలమైన ఆధారాలున్నాయి. ఈ నేపథ్యంలో దానం విషయంలో స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారని ఆసక్తికరంగా మారింది. మరోవైపు.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విషయంలో చేస్తున్న జాప్యంపై ఈనెల 19న స్పీకర్ కు సుప్రీంకోర్టు ధిక్కర నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ కు స్పీకర్ నోటీసులు ఇవ్వడం ఆసక్తికరంగా మారింది.

నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు ఎమ్మెల్యే దానం నాగేందర్

బీఆర్ఎస్ పార్టీ అనర్హత పిటిషన్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టివేయాలని స్పీకర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు ఎటువంటి సమాచారం లేదని పేర్కొన్నారు. తాను 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లానని, వ్యక్తిగత హోదాలో మాత్రమే వెళ్లినట్లు తెలిపారు. మీడియా కథనాల ఆధారంగా పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోందని వెల్లడించారు. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదని పేర్కొన్నారు. అనర్హత పిటిషన్ తర్వాతి పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దని కోరారు. కాగా, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ నెల 30న దానం నాగేందర్ అనర్హత పిటిషన్ పై విచారణ చేసేందుకు షెడ్యూల్ ఇచ్చిన నేపథ్యంలో ఆయన అఫిడవిట్ దాఖలు చేశారు. అలాగే దానంకు స్పీకర్‌నుంచి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ అయ్యాయి.



'స్త్రీ శక్తి'లో ఉచిత బస్సు ప్రయాణం స్త్రీలకు, ట్రాన్స్‌జెండర్లకు ఎంతో మేలు చేస్తోంది. వారి జీవితాల్లో ఇదో గొప్ప మార్పు. ఇప్పటివరకు వారు 40 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేశారు. మహిళా ప్రయాణికులు 40% నుంచి 63.4%కి పెరిగారు. డిమాండ్‌కు అనుగుణంగా 1,413 అదనపు ట్రిప్పులు, 64,647 అదనపు కిలోమీటర్లు ఆపరేట్ చేస్తున్నాం. సబ్సిడీగా ఆర్టీసీకి ₹1,388 కోట్లు ఇచ్చాం.

- ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

మున్సి 'పోల్'లోనూ అత్యధిక స్థానాలు గెలుస్తాం

- **రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకుపోతాం**
- **ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాల అమలు**
- **పొత్తుల అంశంలో పీసీసీ అధ్యక్షుడిదే నిర్ణయం**
- **మా కేబినెట్ ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తుంది**
- **రాష్ట్ర భవిష్యత్తు మా అందరి లక్ష్యం**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

ప్రతిపక్షం, మధిర, జనవరి 28: 'సీఎం రేవంత్ రెడ్డి దేశంలో లేరు కాబట్టి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నాకు కొన్ని సూచనలు చేశారు. మంత్రులు వారి సమస్యలు తెలియజేశారు, ఆ విషయాలను ముఖ్యమంత్రికి నేను వివరించాను. ప్రజాభవన్లో మంత్రుల భేటీపై కొందరు పిచ్చి భ్రమల్లో ఉండి పిచ్చి రాతలు రాస్తున్నారు. మంత్రులు డిప్యూటీ సీఎంను కలవకపోతే రాసేవారితో, చూపించే వారితో కలుస్తారా?' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. సింగరేణి టెండర్ల అంశంలో పూర్తి ఆధారాలతో స్పష్టత ఇచ్చాను, ఇంకా అందులోనే తిరుగుతాను అంటే వాళ్ల కర్మ అని అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో స్థానాలు గెలుచుకొని రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకుపోతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన మధిర నియోజకవర్గం కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మున్సిపాలిటీల ఎన్నికలకు తెరలేచిన నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, పట్టణ ఇన్చార్జులు అంతా సమిష్టిగా ఆలోచన చేసి కాంగ్రెస్ పార్టీ గెలవడానికి అవకాశం ఉన్న అభ్యర్థులు, కాంగ్రెస్ భావజాలం తెలిసిన, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లగలిగే వారిని గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఎమ్మెల్యే లందరూ ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకొని మున్సిపాలిటీలోని పార్టీ ఇన్చార్జిలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ కేబినెట్ ప్రజా ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నగరాల అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తుందని ప్రధానంగా ఆరోగ్యం, విద్య పైన దృష్టికేంద్రీకరించి ముందుకు వెళుతుందని తెలిపారు. తెలంగాణ పునాది, భవిష్యత్తు అంతా విద్య పైనే ఆధారపడి ఉందని కేబినెట్ మొత్తం భావిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఒక్కసారి కూడా నిర్వహించని గ్రూప్ వన్ పరీక్ష ను ప్రజా ప్రభుత్వం నిర్వహించడమే కాదు ఫలితాలు సైతం వెల్లడించి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. అదేవిధంగా గ్రూప్ 2 సైతం పరీక్ష నిర్వహించి ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ ను ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున నిర్మిస్తున్నామని తెలిపారు. నగరాల్లో మౌలిక సదుపాయాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందని భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసిందని తెలిపారు. రేర్, క్యూర్ ఫ్యూర్ సమగ్ర విధానంతో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం గ్లోబల్ సమ్మిట్ లో 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని తెలిపారు. కోర్ అర్బన్ రీజనల్ ఎకానమీలో సేవల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఫ్యూర్ వేరీ అర్బన్ రీజినల్ ఎకానమీలో అన్ని మున్సిపాలిటీలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రేర్ రూరల్ అగ్రికల్చర్ ఎకానమీలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం, రైతులు ఉత్పత్తి చేసిన వస్తువులకు విలువలను జోడించడం ఈ విధానం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులకు సంబంధించిన అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

పులకించిన మేడారం

మొదటిపేజీ తరువాయి

మహా జాతరలో అద్వితీయ ఘట్ట ఆవిష్కృతం అయింది. లక్షలాది భక్త జనం నీరాజనాల నడుమ సారలమ్మ గద్దెపై కొలువుదీరింది. మేడారం పులకించింది. కన్నెపల్లి నుంచి డప్పుల దరువులు, శివసత్తుల పూనకాలు, లక్షలాది భక్తుల నీరాజనాల నడుమ సారలమ్మను గిరిజన పూజారులు గద్దె పైకి తీసుకువచ్చారు. కొండాయి నుంచి గోవిందరాజును, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును భక్తుల జయజయ ధ్వానాల మధ్య మేడారంలోని గద్దెలపైకి తీసుకువచ్చి ప్రతిష్ఠించడంతో జాతర మొదలైంది. నేడు సాయంత్రం చిలకలగుట్ట నుంచి కుంకుమ భరిణె రూపంలో సమ్మక్క తల్లి గద్దెపైకి చేరుకోవడంతో జాతర పతాకస్థాయికి చేరుకుంటుంది. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు తరలివస్తున్నారు. 'సల్లంగ సూడు తల్లీ' అంటూ వేడుకుంటున్నారు. అమ్మలకు చీర, సారెతో పాటు నిలువెత్తు 'బంగారం' సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. జనవరి 31 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలకు దాదాపు మూడు కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ.. నిరంతరం భద్రతా పర్యవేక్షణకు చర్యలు చేపట్టింది. సారలమ్మ గద్దె పైకి ప్రవేశించనుడడంతో అధికారులు దర్శనాలను నిలిపివేశారు. గద్దెల వద్ద ఉన్న భక్తులను బయటికి పంపేశారు. మేడారం మహాజాతర సందర్భంగా కలెక్టర్ ములుగు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సెలవు ప్రకటించారు.

సారలమ్మకు స్వాగతం

సారలమ్మకు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ములుగు జిల్లా కలెక్టర్, ఎస్పీలు సాదర స్వాగతం పలికారు. సారలమ్మ రాక నేపథ్యంలో భద్రతా బలగాలు మూడంచెల పటిష్ఠ బందోబస్తును కల్పించాయి. అంతకు ముందు కన్నెపల్లి గ్రామస్థులైన ఆడపడుచులు సారలమ్మ ఆలయాన్ని ఆదివాసీ సంప్రదాయాల ముగ్గులతో చూడ ముచ్చటగా అలంకరించారు. మరో అద్భుత ఘట్టం గురువారం సాయంత్రం సమ్మక్క తల్లి మేడారంలోని గద్దెపైకి చేరుకోవడంతో ఆవిష్కృతం కానుంది. శుక్రవారం వనదేవతలు అందరూ గద్దెలపై నుంచి భక్తులకు దర్శమిస్తారు.

అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి: మంత్రి సీతక్క

మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు తరలవస్తున్న లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, మేడారం జాతరకు వచ్చే భక్తుల కోసం క్యూలైన్లను సక్రమంగా నిర్వహిస్తున్నామని, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భక్తులకు నీడ కల్పించే విధంగా విస్తృతంగా షెడ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. తాగునీరు, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండేళ్ల వనవాసం పూర్తి చేసుకుని తల్లులు జనవాసంలోకి ప్రవేశించే ఈ క్షణం భక్తులందరికీ అపూర్వమైన అనుభూతి అని అన్నారు. ఇది తల్లులను దర్శించుకునే అరుదైన, గొప్ప అవకాశం. భక్తులందరూ కుటుంబ సమేతంగా భక్తి, శ్రద్ధతో పాటు బాధ్యతతో తల్లులను దర్శించుకోవాలి అని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

నేడు కేంద్ర మంత్రి జుయల్ ఓరం రాక

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం సమ్మక్క సారలక్క జాతరలో నేడు గురువారం పాల్గొని పూజలు నిర్వహించనున్నారు. ఇటీవల హైదరాబాద్ లోని కన్హా శాంతి వనంలో జరిగిన గిరిజన గ్రామీణ వైద్య సహకారుల సదస్సులో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేంద్ర మంత్రిని కలిసి సమ్మక్క సారలక్క జాతర ఆహ్వాన పత్రికను రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించారు. అలాగే, ఈ జాతర ప్రత్యేకతను వివరించడంతో పాటు జాతర ప్రాశస్త్యం చెప్పడంతో కేంద్ర మంత్రి తప్పకుండ జాతరలో పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి ఈ జాతరకు హాజరవుతున్నారు. మంత్రి అడ్లూరి, కేంద్ర మంత్రిని ఆహ్వానం పలికి కేంద్ర మంత్రిని వెంటబెట్టుకొని సమ్మక్క సారలక్క దేవస్థానాన్ని చేరుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

మీడియా ప్రతినిధులకు టీ షర్టుల పంపిణీ

సమక్క సారలమ్మ జాతర ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వద్ద ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ లో బుధవారం జాతరను ప్రెస్ కవరేజ్ చేస్తున్న వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులకు, మీడియా ప్రతినిధులకు మంత్రి సీతక్క టీ షర్టులను పంపిణీ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తుల కొంగు బంగారంమైన సమక్క సారలమ్మ జాతర కు భక్తుల రాక విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. ములుగు జిల్లాలో నిర్వహించే జాతర లో ప్రస్తుత సంవత్సరం అనేక మార్పులు చేసినప్పటికీ ఎక్కడ కూడా ఆదివాసుల అస్తిత్వం, ఆత్మగౌరవం, పూజ విధానం లో మార్పు లేకుండా ఏర్పాట్లు చేశామని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర తీసుకొచ్చే విధానం పూజ వ్యవహారాలలో ఎటువంటి మార్పు రాలేదని అన్నారు. 4 రోజులు జరిగే సమక్క సారలమ్మ జాతరకు ప్రస్తుత సంవత్సరం 40 రోజుల సరిపడా ఏర్పాట్లు చేశామని అన్నారు. సమక్క సారలమ్మ జాతరకు ఇప్పటి వరకు 20 లక్షల భక్తులు వచ్చారని అంచనా వేశామని అన్నారు. సమక్క సారలమ్మ జాతర కవర్ చేసే అదృష్టం పాత్రికేయులకు కలిగిందని, జాతర యొక్క ఔన్నత్యం గొప్పతనాన్ని బయట ప్రపంచానికి మీడియా చాటి చెప్పాలని మంత్రి తెలిపారు. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతర సమయానికి మీడియా కు సైతం పెద్ద హాల్, మెరుగైన వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రజలను పట్టించుకునే
తీరిక కాంగ్రెస్‌కు లేదు

మొదటిపేజీ తరువాయి

చేసి బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెప్పి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజకు బీఆర్ఎస్ వెంట నిలబడతారని కేటీఆర్ అశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో అందరు కలిసి సమిష్టిగా ఎన్నికల్లో పోరాడాలని పిలుపునిచ్చారు. కేవలం మున్సిపల్ ఎన్నికలు మాత్రమే కాకుండా రానున్న ప్రతి ఎన్నికల్లోనూ గులాబీ జెండాకు, కారు గుర్తుకు మద్దతు ఇచ్చి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్, 12 ఏండ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయకుండా టైంపాస్ చేస్తున్నాయని, అందుకే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. తెలివిలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకావడం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అందుకే గత ప్రభుత్వం పై అడ్డగోలు విమర్శలు చేస్తూ పరిపాలనను వదిలిపెట్టారని అన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి వాటి అమలును పూర్తిగా విస్మరించారని, హామీల అమలును ప్రశ్నిస్తే బెదిరింపులు, కేసులు, అబద్ధాలకు దిగుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పూర్తిగా అబద్ధాల మీద పరిపాలన చేయడం అలవాటు చేసుకున్నారని విమర్శించారు. కేవలం పరిపాలన చేతగాక అప్పుల పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అప్పుల విషయంలో కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్, కాగ్ ఏజెన్సీలు నామమాత్రపు అప్పు మాత్రమే ఉందని చెబుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అప్పుల సంఖ్య పెంచి తప్పుడు లెక్కలు చూపుతోందని కేటీఆర్ ఆరోపించారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ప్రతి పైసా అప్పును సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించిందని గుర్తు చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు, విద్యాలయాలు, ఆసుపత్రులు నిర్మించామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల్లో తెచ్చిన రెండున్నర లక్షల కోట్ల రూపాయల అప్పుతో ఒక్క టంటే ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టారా అని ప్రశ్నించారు. ఆ అప్పును ఎక్కడ ఖర్చు పెట్టారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం ఒక్క ప్రాజెక్టైనా నిర్మించారా? సంక్షేమంపై ఖర్చు చేశారా? అని నిలదీశారు. తిరిగి పార్టీలోకి వచ్చిన ఆరూరి రమేష్‌కు కేటీఆర్ హృదయపూర్వక స్వాగతం పలికారు. రెండు సంవత్సరాల్లో బీజేపీ-కాంగ్రెస్ వైఫల్యాలను చూసిన తర్వాత ప్రజలంతా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఆరూరి రమేష్ గతంలో వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశారని, దాదాపు లక్ష ఓట్ల మెజార్టీతో గెలిచిన ఆయన 16 ఓట్ల తేడాతో ఓడిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని సమిష్టిగా ముందుకు వెళ్లి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించాలని ఆరూరి రమేష్‌ను కోరారు.

..దేశవ్యాప్త ఉద్యమం

మొదటిపేజీ తరువాయి

ఉద్యమాన్ని చేపడతామని, ఈ పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చి కార్మికులకు హక్కులు కల్పించామని, రైతులకు కనీస మద్దతు ధర ఉన్నట్లే ఉపాధి కార్మికులకు పనిదినాల హామీ ఇచ్చామని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ రాష్ట్రాలపై భారాన్ని మోపుతోందని తీవ్రంగా విమర్శించారు. రూ.100 ఖర్చుకు కేంద్రం రూ.60 మాత్రమే ఇస్తూ మిగిలిన రూ.40 రాష్ట్రాలే భరించాలనే ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, బీజేపీ ధనవంతుల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ పథకంలో మార్పులు తేవాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయడం కాంగ్రెస్ సాధించిన విజయమని ఆయన గుర్తు చేశారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు హనుమంతరావు, ఓబీసీ రాష్ట్ర చైర్మన్ జూలూరి ధనలక్ష్మి, రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజ్‌మెంట్

- 100 కోట్లతో అత్యాధునిక పరికరాలు
- రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం
- క్షేత్రస్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 28 :- ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ (డిజాస్టర్ మేనేజ్మెంట్) విభాగాన్ని బలోపేతం చేసి దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా వంద కోట్ల రూపాయిలతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా, ఐసీసీసీ విభాగాలతో సమావేశం నిర్వహించి ఎలాంటి పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక ఫైర్ & సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ-విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వరదల సమయంలో వాగుల్లో వంకల్లో, చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్‌లిఫ్ట్ మెకానిజం తయారు చేసుకోవాలని, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి 70 నుంచి 80 కిలోల బరువును ఎత్తే డ్రోన్లను కొనుగోలు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మాట్లాడడానికి వీలుగా సిమ్ ఆధారిత వీహెచ్ఎఫ్ రేడియో సిస్టమ్స్ అందుబాటులోకి తేవాలని సూచించారు. అలాగే అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. 77 హైస్పీడ్ బోట్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసీసీసీ డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రి ఆరా

మేడారం మహాజాతరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మేడారం జాతరలో అత్యంత పవిత్రమైన మొదటి ఘట్టం బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో సచివాలయం నుండి హై ఫ్రీక్వెన్సీ వాకీటాకీతో మేడారంలో ట్రాఫిక్ విధులను పర్యవేక్షిస్తున్న సిబ్బందితో మంత్రి మాట్లాడారు. తొలిరోజు కావడంతో భక్తుల సంఖ్య, సారలమ్మ వార్ల రాక ఏర్పాట్లు, సౌకర్యాల కల్పన, జాతరలో నెలకొన్న పరిస్థితులు గురించి మంత్రి ఆరాతీశారు. ప్రజాప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఫైర్ సేఫ్టీపై హైడ్రా నజర్

- తనిఖీలకు హైడ్రా కమిషనర్ ఆదేశం
- సంబంధిత శాఖలతో సమావేశం
- నింబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేయడానికి సిద్ధం
- 9000113667 నంబరుకు ఫిర్యాదు చేయాలంటూ విన్నపం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: ఫైర్ సేఫ్టీపై హైడ్రా దృష్టి పెట్టింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటోంది. వ్యాపార సముదాయాల నుంచి నివాస ప్రాంతాల వరకూ ఫైర్ సేఫ్టీలో ఎక్కడా అలసత్వాన్ని ఉపేక్షంచరాదని హైడ్రా నిర్ణయించింది. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకునేందుకు నడుం బిగించింది. జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం సమావేశమయ్యారు. ఫైర్ సేఫ్టీ కార్యాచరణ వివరించారు. వ్యాపార సముదాయాలు, ఫర్నీచర్, వస్త్ర దుకాణాలు ఇలా అన్ని చోట్లా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ పాటించకపోతే.. ఆయా షాపులను సీజ్ చేయాలని నిర్ణయించారు. వెనువెంటనే విద్యుత్ సరఫరా బంద్ చేయాలని.., ఫైర్ సేఫ్టీ లేని వ్యాపార సముదాయంగా.., షాపుగా పేర్కొంటూ నోటీసులు అతికి పెట్టాలని అధికారులకు సూచించారు. నగర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. అగ్ని ప్రమాదానికి ఆస్కారం ఉన్న పరిస్థితులుంటే వెంటనే హైడ్రా కంట్రోల్ రూం నంబరు 9000113667 కు ఫోను చేసి సమాచారమివ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నగర ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

తెలంగాణ కోసం ప్రజలు ప్రాణత్యాగాలు చేస్తే

బీఆర్ఎస్ నేతలు అమెరికాలో కంపెనీలు పెట్టారు

- కవితను చేర్చుకునే అవసరం కాంగ్రెస్‌కు లేదు
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారు
- మధు యాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 28 : తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన సమయంలో బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు, కవితలు అమెరికాలో కంపెనీలు స్థాపించుకున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. గాంధీ భవన్‌లో బుధవారం మీడియా ప్రతినిధులలో నిర్వహించిన 'చిట్ చాట్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2010 లోనే బీఆర్ఎస్ నేతలు విదేశాల్లో కంపెనీలు పెట్టారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చాక కూడా కవిత భారీగా సంపాదించిందని, అప్పుడే జిల్లాకు ఒక పీఏను నియమించుకున్న స్థాయిలో ఆమె వ్యవహారం సాగిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు పూర్తిగా బలహీనపడ్డాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొందరు పోలీస్ అధికారులు కార్యకర్తలుగా పనిచేసి అక్రమ సంపాదనకు పాల్పడ్డారని ఆరోపించారు. 'ఫ్రెండ్లీ పోలీస్' అంటే డ్రగ్స్ పెడ్లర్లకు ఫ్రెండ్లీ పోలీస్‌గా మారారని ఎద్దేవా చేశారు. కొంతమంది పోలీస్ అధికారులు వార్తల్లో నిలవాలనే ఉద్దేశంతో అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, అర్ధరాత్రి అరెస్టులతో హైలైట్ కావాలని చూస్తున్నారని విమర్శించారు. లా అండ్ ఆర్డర్‌కు బదులుగా ల్యాండ్ సెటిల్‌మెంట్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఎవరిని అరెస్టు చేసినా తప్పనిసరిగా నిబంధనల ప్రకారమే జరగాలని స్పష్టం చేశారు. నగర పోలీస్ కమిషనర్ అమాయకులపై ప్రతాపం చూపుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రతి కేసు, ప్రతి విచారణ చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలనే ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. అయినా కొందరు అధికారులు అర్ధరాత్రి అరెస్టులతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. టీఆర్ఎస్ హయాంలో పనిచేసినట్లే ఇప్పుడూ వ్యవహరిస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. ప్రభుత్వం మారిందని, పాలకులు మారారని, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారనే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. నైనీలో టెండర్ల కేటాయింపే జరగలేదని, బొగ్గు తీయనే లేదని, అలాంటి పరిస్థితుల్లో స్కాం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. గతంలో 2జీ స్కాం అంటూ ప్రచారం చేసిన బీజేపీ, 11 ఏళ్ల పాలనలో ఒక్క కేసునైనా నిరూపించిందా? అని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఖాతాల్లో ఒక్క రూపాయి పడిందని ఎక్కడైనా నిరూపించారా? అని సవాల్ విసిరారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి సీనియర్ నేతలపై వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో సమన్వయ లోపం కనిపిస్తోందని, ప్రభుత్వం-పార్టీ మధ్య సమన్వయం కోసం వెంటనే సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. అభివృద్ధి పేరుతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు పార్టీని బ్లాక్‌మెయిల్ చేయాలనుకుంటే కుదరదని హెచ్చరించారు. పాత కాంగ్రెస్ నాయకులతో కలిసి పనిచేయాలని సూచించారు. దానం నాగేందర్ అంశం పూర్తిగా స్పీకర్ పరిధిలో ఉందని, స్పీకర్ నిర్ణయంపై కోర్టులు అంగీకరించవచ్చు, తిరస్కరించవచ్చు అని అన్నారు. లిక్కర్ స్కాంలో ఇరుక్కున్న కవితను కాంగ్రెస్‌లో చేర్చుకునే అవసరం కాంగ్రెస్‌కు లేదని స్పష్టం చేశారు. కవిత బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడే ఆ పార్టీని మట్టికరిపించామని, ఇప్పుడు ఆమెను తీసుకునే ప్రశ్నే లేదన్నారు. కవిత మూడు వేల కోట్లతో రాజభవంతి తరహా భవనం కట్టుకుందని ఆరోపించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని, కేసీఆర్ ఎన్నిసార్లు ఆహ్వానించినా ఆయన ప్రతిపక్షంగానే పోరాడారని గుర్తు చేశారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఆటో యూనియన్ల నాయకులతో సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. ఆటో యూనియన్ల నాయకులతో బుధవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సమావేశం అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న రూ. 12 వేలు వెంటనే ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో ఇతర జిల్లాల ఆటో డ్రైవర్లకు ఇబ్బంది కలిగించటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అన్ని ఆటో సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు. అవసరమైతే కార్మిక శాఖ మంత్రి ని కలుస్తామన్నారు. చట్టబద్ధమైన అనుమతులు ఉన్నప్పటికీ జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లను అడ్డుకోవటం సరికాదన్నారు. కార్మికుల భద్రతతో పాటు వారి ఉపాధి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లపై జరుగుతున్న దాడులు, వేధింపులు తక్షణమే అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సంబంధిత పోలీస్, రవాణా శాఖ అధికారులతో మాట్లాడి జిల్లాల ఆటో డ్రైవర్లకు పూర్తి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కార్మికుల పక్షాన తెలంగాణ జాగృతి ఎప్పుడూ నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ఆటో జాగృతి అధ్యక్షుడు ఎంఎ సలీమ్, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ఐ ఎన్ టీయూసీ జనరల్ సెక్రెటరీ మల్లేశం గౌడ్, టీ ఏడీఎస్ ప్రెసిడెంట్ సత్తిరెడ్డి, టీఎన్టీయూసీ స్టేట్ ప్రెసిడెంట్ యాదగిరి, జీయూ టీఎస్ అధ్యక్షులు శ్రీనివాస్, బీఆర్టీయూ అధ్యక్షుడు పరశురాముడు, తెలంగాణ జాగృతి నాయకులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై

జాగృతి అభ్యర్థుల పోటీ

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర చైర్మన్ జావెద్ లతీఫ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై తెలంగాణ జాగృతి ఔత్సాహిక అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ నేతలు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జావెద్ లతీఫ్, ఉపాధ్యక్షులు కె. బుచ్చిరెడ్డి వెల్లడించారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో తెలంగాణ జాగృతి-ఫార్వర్డ్ బ్లాక్ నేతల మధ్య కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో మాత్రమే కాకుండా భవిష్యత్‌లో కూడా కలిసి పనిచేయాలని ఇరు పార్టీల నేతలు నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర చైర్మన్ జావెద్ లతీఫ్‌తో పాటు కన్వీనర్ జోజిరెడ్డి, ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు ఆర్వీఆర్ ప్రసాద్, తేజ్ దీప్ రెడ్డి, కొండ దయానంద్, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, ఫైనాన్స్ సెక్రటరీ కె. నరేందర్, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బీరన్న, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, ఐవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిత్య, జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఈబీసీ కమిషన్ ను ఏర్పాటు చేయండి

- జానారెడ్డిని కలిసిన జాతీయ ఈబీసీ జేఏసీ నేతలు
- ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానని హామీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: ఈబీసీ జేఏసీ జాతీయ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి నేతృత్వంలో 18 అగ్రకులాల నిరుపేదల సంఘాల ప్రతినిధులు బుధవారం ఉదయం బంజారాహిల్స్ లోని మాజీమంత్రి కుందూరు జానారెడ్డి నివాసంలో కలిసి ఆయనను ఈబీసీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. మొత్తం జనాభాలో 25శాతం మంది అగ్రకులాలవారు ఉన్నారని, వారిలో అత్యధికులు నిరుపేదలు అని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అమలు చేస్తున్న అన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అగ్రకులాల నిరుపేదలకు అమలయ్యేలా చూడాలని కోరారు. అగ్రకులాల నిరుపేదలపై దాడులు జరిగితే, దూషణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ల లాగానే ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఈబీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ తాను ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. అగ్రకులాల నిరుపేదల సమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందిస్తానని జానారెడ్డి తెలిపారు. ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న జానారెడ్డిని ఈబీసీ నాయకులు పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఈబీసీ జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి, కమ్మసంఘాల సమాఖ్య అధ్యక్షులు బొడ్డు రవిశంకర్ రావు, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పన్యాల మాధవరెడ్డి, వెలమ సంఘం నాయకులు భగవంతరావ్, సిక్కు సేవాసమితి నాయకులు సర్దార్ రాజేందర్ సింగ్, కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ నాయకులు ఉన్నం సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఓలం యాదగిరి, బ్రాహ్మణ సంఘం నాయకులు లక్ష్మణాచార్యులు, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు బొబ్బిలి దామోదర్ రెడ్డి, పురోహిత సంఘం అధ్యక్షులు రమేష్ ఆచార్యులు, మహిళా సంఘం అధ్యక్షురాలు నూకల పద్మారెడ్డి, మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబా, మహిళా నాయకులు సింగిరెడ్డి లతారెడ్డి, స్వాతిరెడ్డి, దివ్యారెడ్డి, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో దారుణం

- ప్రేమ పెళ్లికి నిరాకరించారని తల్లిదండ్రుల హత్య
- మత్తు ఇంజక్షన్ ఇచ్చి చంపేసిన కుమార్తె

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: వికారాబాద్ జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. మంచి చదువులు చదివించి తనకు ఇష్టమైన కొలువులో చేర్పిస్తే ఆ వృత్తిని అడ్డుపెట్టుకుని ఏకంగా తల్లిదండ్రులనే హతమార్చింది ఓ కుమార్తె. ప్రేమను కాదన్నందుకు కక్ష కట్టింది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారానికి చెందిన దశరథ్, లక్ష్మీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె సురేఖ సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. ఈ క్రమంలో ఓ యువకుడిని ప్రేమించింది. ఈ విషయం ఇంట్లో తెలిసి తల్లిదండ్రులు కాస్త మందలించారు. వారికున్న ఇతరత్రా కారణాలతో పెళ్లికి వద్దని నిరాకరించారు. ఆ అబ్బాయితో మాట్లాడొద్దని పదేపదే మందలించడంతో సురేఖ కన్నవారిపైనే తీవ్రమైన కక్షపెంచుకుంది. వారి అడ్డు తొలగించుకుంటే తప్ప ప్రియుడిని పెళ్లి చేసుకుని ఆనందంగా గడపలేనని భావించింది. తల్లిదండ్రులను చంపేందుకు పకడ్బందీగా పథకం వేసింది. సురేఖ తాను పని చేస్తున్న ఆస్పత్రి నుంచి అత్యంత ప్రమాదకరమైన మత్తు మందు ఇంజక్షన్‌ను యాచారంలోని ఇంటికి తీసుకొచ్చింది. తల్లిదండ్రుల అనారోగ్య సమస్యలను ఆసరాగా చేసుకుని జబ్బులు త్వరగా నయమవ్వడానికి ఇంజక్షన్ ఇస్తానని నమ్మబలికింది. కుమార్తె నర్సు అయినందున నిజమేనని నమ్మిన వారు ఇంజక్షన్ చేయించుకోవడానికి ముందుకొచ్చారు. తొలుత తల్లికి అధిక మోతాదులో మత్తుమందు ఇవ్వడంతో ఆమె క్షణాల్లో స్పృహ కోల్పోయి చనిపోయింది. తండ్రి దశరథ్ వచ్చి తల్లి గురించి అడగ్గా అమ్మ నిద్రపోతోందని అబద్ధం చెప్పింది. ఆ తర్వాత తండ్రికి కూడా కీళ్ల నొప్పులు తగ్గడానికి ఇంజక్షన్ చేస్తానని చెప్పి మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో ఆయన కూడా ప్రాణాలు విడిచారు. తల్లిదండ్రులను హత్య చేసిన అనంతరం తనకు ఏమీ తెలియనట్లు తెల్లవారుజామున తన అన్న అశోక్‌కు ఫోన్‌చేసి అమ్మానాన్న చనిపోయారని ఏడుస్తూ నాటకమాడింది. తమ గ్రామంలో అందరూ వారు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారని తొలుత భావించారు. కానీ, ఘటనా స్థలానికి చేరుకున్న వికారాబాద్ పోలీసులు ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా, అక్కడ వాడి పారేసిన ఇంజక్షన్లు కనిపించాయి. దశరథ్, లక్ష్మి మృతి అనుమానాస్పదంగా ఉండడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. సురేఖను విచారించగా, ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పింది. తన వృత్తి గురించి, ఇంజక్షన్ల గురించి పోలీసులు లోతుగా ప్రశ్నించడంతో సురేఖ అసలు నిజాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం ఆమెను రిమాండ్‌కు తరలించారు.

"



రాజకీయాల్లో నిజాయతీకి మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇది నాకు వ్యక్తిగతంగా తెలుసు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ ముక్కుసూటిగా ఉంటారు. హామీలు ఇచ్చి మోసం చేయడం ఆయన శైలి కాదు. దీని వల్ల తను ఎంత మూల్యం చెల్లించుకున్నారో ఊహించుకోవచ్చు.

- ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే

ఓపెన్ వాయిస్

భారత్ 'బిగ్ డీల్'.. అమెరికా కడుపుమంట

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. తన ఏడాది పాలనలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ కాలం వెల్లదీశాడు. మిత్రులు, శత్రువు అనే తేడా లేకుండా 5 నుంచి 200 శాతం వరకు టారిఫ్‌లు విధించారు. దీంతో ప్రపంచంలో చాలా దేశాలు ఈ టారిఫ్‌ల కారణంగా ఇబ్బంది పడుతున్నాయి. చాలా మంది ఉపాధి కోల్పోయారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో చాలా కంపెనీలు ఉత్పత్తి తగ్గించాయి. ఉద్యోగులను తగ్గించాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, సౌత్ ఆఫ్రికాతోపాటు అనేక చిన్న దేశాలతోవాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా అమెరికాకు సన్నిహితంగా ఉండే యురోపియన్ యూనియన్‌ను మోదీ తన బుట్టలో వేసుకున్నాడు. అమెరికా అధ్యక్షుడిమాటను లెక్క చేయకుండా ఈయూ భారత్‌తో అతిపెద్ద వాణిజ్య ఒప్పందానికి సిద్ధమైంది. భారత్ -యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌ఏటీ) ద్వారా లక్షలాది మందికి పెద్ద అవకాశాలు లభిస్తాయని నరేంద్ర డీప్రకటించారు. ఇది అంతర్జాతీయ వ్యాపారంలో మూడింట ఒక భాగాన్ని కలిగి ఉంటుందని వివరించారు. ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ) నాల్గవ సంప్రదింపు ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో ఇంధన రంగంలో డిమాండ్ ఊపందుకుంటోందని, ఈ ఒప్పందం ద్వారా పెద్ద స్థాయి పెట్టుబడులు ఆకర్షిస్తామని చెప్పారు.వాస్తవానికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఎప్పుడో జరగాల్సింది. కానీ అమెరికా కోసం మన దేశ రైతులను పణంగా పెట్టేందుకు మోదీ అంగీకరించడం లేదు. అనేక అంశాల్లో ఏకాభిప్రాయం రావడం లేదు. దీంతో వాణిజ్య చర్చలు నెలల తరబడి సాగుతున్నాయి. దీంతో భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం తగ్గించేందు మోదీ ఒక అడుగు ముందుకు వేసి ప్రపంచ దేశాలతో చర్చలు ప్రారంభించారు. ఒప్పందాలూ చేసుకుంటున్నారు. భారత్ - ఈయూ ఒప్పందం కూడా ఇందులో భాగమే. అయితే దీనిని చూసి ఇపుడు అమెరికా కుళ్లుకుంటోంది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్, తమ దేశం రష్యా-ఉక్రెయిన్ సంఘర్షణను అరికట్టేందుకు ఎక్కువ రాజీలు చేసుకున్నామని, భారత్‌పై చమురు దిగుమతులకు అదనపు పన్నులు విధించామని గుర్తు చేశారు. అయినా ఈయూతో భారత్ సులభంగా ఒప్పందం కుదుర్చుకుందని విమర్శించారు. తమ సహకారానికి తగిన గుర్తింపు లభించలేదని ఆక్షేపించారు.ఈ ఒప్పందం ఈయూ- భారత్‌కు యూరప్ మార్కెట్లలో సులభ ప్రవేశం అందిస్తూ, ఎక్స్‌పోర్ట్‌లను పెంచుతుంది. ఇంధన, ఆటో, టెక్ రంగాల్లో పెట్టుబడులు పెరిగి, ఆర్థిక వేగాన్ని పెంచవచ్చు.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
29.01.2026

అయితే, అమెరికా విమర్శలు భవిష్యత్ వాణిజ్య ఒప్పందాల్లో టెన్షన్లను సృష్టించవచ్చు. రష్యా చమురు విషయంలో భారత్ స్వతంత్ర విధానం కొనసాగితే, యూఎస్‌తో సంబంధాలు బలపడే అవకాశం ఉంది. మరో వైపు యూరప్‌లో తయారైన కార్లు (జెర్మన్, ఇటాలియన్ మోడల్స్) ధరలు 20-30% వరకు దిగవచ్చు. ఆలివ్ ఆయిల్, కివీ పండ్లు వంటి ఆహార పదార్థాలు, విస్కీ, వోడ్కా, బీర్, వైన్ లాంటి పానీయాలు, సిద్ధాంగా ప్రాసెస్ చేసిన ఫుడ్ ఐటెమ్స్, పండ్ల రసాలు అందరికీ చౌక అవుతాయి. ఇలాంటి మార్పు ద్వారా మధ్యతరగతి కుటుంబాల ఖర్చులు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.భారత్ ఎగుమతి చేసే వస్తువుల్లో 90 శాతానికిపైగా యూరోపియన్ మార్కెట్లలో సుంకాలు ఉండవు. టెక్స్‌టైల్స్ రంగం (కాటన్ గార్మెంట్స్, సారీలు, హ్యాండ్‌లూమ్) పెద్దగా ప్రయోజనం పొందుతుంది, ఇటలీ, ఫ్రాన్స్ మార్కెట్లలో డిమాండ్ పెరుగుతుంది. కెమికల్స్ (ఫార్మా ఇంటర్మీడియేట్స్, పెస్ట్‌సైడ్స్) రంగం జర్మనీ, బెల్జియం వర్క్‌షాప్‌లకు సులభ ప్రవేశం పొందుతుంది. ఆభరణాలు (గోల్డ్, డైమండ్ జ్యువెలరీ) స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో ఎగుమతులు దాదాపు రెట్టింపు అవుతాయని అంచనా. ఇవి లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఎంఎస్ఎంఈలకు బూస్ట్ ఇస్తాయి. మొత్తం వాణిజ్యం వృద్ధి చెంది, జీడీపీ 1 నుంచి 2 శాతం వృద్ధికి దోహదపడవచ్చు.ఈ ఒప్పందం రెండు ప్రాంతాల మధ్య పరస్పర పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. మొత్తంగా, ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా మార్చి, మధ్య తరగతి ఆదాయాలను పెంచుతుంది. ట్రంప్ వైఖరి వల్ల భారత్‌తోపాటు యూరప్ దేశాలు సైతం విసిగిపోయాయి. అమెరికా పొరుగు ఉన్న కెనడాకు సైతం అగ్రరాజ్యం తీరు ఏమాత్రం నచ్చడం లేదు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా నిలబెడతామని టారిఫ్ వార్ మొదలు పెట్టిన ట్రంప్..ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే సమయంలో అమెరికా తీరుతో విసిగిపోయిన దేశాలు.. బహుళ ధ్రువ ప్రపంచం దిశగా వేగంగా అడుగులేస్తున్నాయి. ఇందులో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది.

మెరుగైన విద్యా విధానాలతోనే ఉత్తమ ఫలితాలు

దేశ భవిష్యత్తును రూపొందించడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్య ముఖ్య భూమిక పోషిస్తుంది. నైపుణ్యంతో కూడిన చదువుల ద్వారానే మానవాభివృద్ధి తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. అందుకే దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రభుత్వాలు చదువుకు అధిక ప్రాధాన్యం ఇచ్చి,అందరూ విద్యను అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నాయి. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ఆయా దేశాల ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం.

సుధాకర్.ఏ.వి
9000674747

మనిషి జీవితంలో విద్య ముఖ్యపాత్ర పోషిస్తుంది. నేటి బాలల భవిష్యత్తును నిర్ణయించేది పాఠశాల విద్యే. అందుకే అక్షరాస్యతను పెంచడం కోసం ప్రభుత్వాలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాయి.అయినా ఆశించిన ఫలితాలు రావట్లేదనే చెప్పాలి.ఈ నేపథ్యంలో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది.దీంతో కేంద్ర ప్రభుత్వం దీనిపై ఓ నిర్ణయం తీసుకొని నూతన విద్యా విధానం2020ని సిద్ధం చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 10+2+3గా ఉన్న విద్యా వ్యవస్థ ఇప్పుడు 5+3+3+4గా ఉండనుంది. ఈ నూతన విద్యా విధానంపై మరింత చర్చ జరగాల్సి ఉన్నా.. కరోనా, లాక్డౌన్ తదనంతర పరిణామాలతో ఈ విషయం కాస్త అటకెక్కింది. మనదేశంలో పాఠశాల విద్యను ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ఇతర దేశాల్లో విద్యా వ్యవస్థ ఎలా ఉంది? విద్యార్థులు ఎలా చదువుకుంటున్నారు? అను విషయాలను గమనించుటకు ఉపాధ్యాయులను ఎంపిక చేసి స్టడీ టూర్ పేరుతో ఐదు రోజులపాటు జపాన్,ఫిన్లాండ్, సింగపూర్,వియత్నాం పంపనున్నారు. వివిధ దేశాల్లో అమలుపరుస్తున్న విద్యా విధానాలను పరిశీలించి వాటిలో ఉత్తమ విధానాలను ఆచరణలో పెట్టడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది.

వియత్నాం: ఈ దేశంలో విద్యా విధానం 543 (ప్రాథమికమాధ్యమికఉన్నత) నిర్మాణంతో 12 సంవత్సరాల సాధారణ విద్యను అందిస్తుంది, ఇందులో ప్రాథమిక విద్య తప్పనిసరి. ఉన్నత విద్యా ప్రమాణాల కోసం ఈ వ్యవస్థ పరీక్షలపై ఎక్కువగా దృష్టి పెడుతుంది. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, డిజిటల్ నైపుణ్యాలు మరియు సృజనాత్మకతకు ప్రాధాన్యతనిస్తూ సంస్కరణలను చేపడుతోంది.

జపాన్: జపాన్.. ఆధునిక దేశం. అత్యధిక అక్షరాస్యత ఉన్న దేశాల్లో ముందు వరుసలో ఉంటుంది. అక్కడ పదేళ్ల వరకు విద్యార్థులకు చిన్న చిన్న టెస్టులు తప్ప.. వార్షిక పరీక్షలు నిర్వహించరు. చిన్నతనంలోనే పాఠాలతోపాటు ఎదుటివాళ్లతో ఎలా ప్రవర్తించాలి? స్వీయ నియంత్రణలో ఉండటం ఎలా? కొన్ని విషయాల్లో కఠినంగా వ్యవహరించడం ఎలా? వంటి విషయాలను నేర్పిస్తారు. అక్కడి పాఠశాలల్లో విద్యార్థుల కోసం కాపలాదారులు, సంరక్షకులు, ఆయాలను నియమించరు. విద్యార్థులే బృందాలుగా ఏర్పడి పాఠశాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకుంటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసే భోజనం చేస్తారు. దీంతో వారి మధ్య బంధం మరింత బలపడుతుంది. వారానికి ఐదు రోజులే పనిదినాలు. పాఠశాల ముగిసిన తర్వాత, వారాంతంలోనూ విద్యార్థులు ప్రైవేట్ శిక్షణ తరగతులకు హాజరవుతుంటారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమయ్యే పాఠాలతోపాటు జపనీస్ కాలీగ్రఫీ, సాహిత్యాన్ని తప్పక బోధిస్తారు. రెండు లేదా మూడు సెమిస్టర్లతో, 6+3+3 విధానంలో పాఠశాల విద్య నడుస్తుంది.

ఫిన్లాండ్: ఫిన్లాండ్లో ప్రత్యేకమైన పాఠశాల విద్యా విధానం ఉంది. ఆరేళ్ల వరకు పిల్లల్ని పాఠశాలలో చేర్చుకోరు. ఒకవేళ తల్లిదండ్రులు తక్కువ వయసున్నప్పుడే చదువు నేర్పించాలనుకుంటే ఖరీదైన చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ అండ్ కేర్ ప్రోగ్రామ్లో చేర్చాల్సిందే. ఆరేళ్ల వరకు ఆడుతూ పాడుతూ చదువు కొనసాగిస్తారు. 7-9 ఏళ్ల మధ్య ఉన్న విద్యార్థులకు ఏడాదికి 190 రోజుల పనిదినాల చొప్పున అందరికీ ఒకే విధమైన విద్యను బోధిస్తారు. ఇక్కడ జాతీయ స్థాయిలో పరీక్షలు ఉండవు. పాఠశాలలే పరీక్షలు నిర్వహిస్తాయి.

సింగపూర్: సింగపూర్ అత్యధిక అక్షరాస్యత ఉన్న చిన్న దేశం. ఇక్కడ పాఠశాల విద్య మూడు భాగాలు. తొలి ఆరేళ్లు ప్రైమరీ, నాలుగేళ్లు సెకండరీ, ఆ తర్వాత మూడేళ్లు పోస్ట్‌సెకండరీ విద్యను అభ్యసించాల్సి ఉంటుంది. ప్రైమరీ విద్యలో నాలుగేళ్లు పూర్తికాగానే పాఠశాలలే సొంతంగా పరీక్ష నిర్వహిస్తాయి. వీటిలో విద్యార్థులు ఏ సబ్జెక్టులో రాణించగలుతున్నారో గుర్తించి, ఆ తర్వాత రెండేళ్ల చదువును కొనసాగిస్తారు.

ఫ్రాన్స్: ఇతర దేశాలతో పోలిస్తే అతి తక్కువ పాఠశాల పని దినాలు ఉన్న దేశం ఫ్రాన్స్. ఇక్కడి పాఠశాలలు వారంలో నాలుగున్నర రోజులే పనిచేస్తాయి. శని, ఆదివారాలు సెలవు. బుధవారం రోజున పాఠశాలలు ఒంటిపూట నడుస్తాయి. ఇక విద్యార్థుల భోజన సమయం గంటన్నర నుంచి రెండు గంటల వరకు ఉంటుంది. పెద్దగా ప్రతిభ కనబరచలేని విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతి ఏర్పాటు చేసి, వారిపై మరింత శ్రద్ధ పెడతారు. 15 ఏళ్ల వయసులో మనవద్ద పదో తరగతి పరీక్షలాగే అక్కడ బాకుల్యూరేట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.

జర్మనీ: జర్మనీ పాఠశాల విద్య కాస్త భిన్నం. ఇక్కడ విద్యార్థులు 1 నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటారు. ఆ తర్వాత వారి ప్రతిభను బట్టి హష్స్కూల్, రియల్ స్కూల్, జిమ్నాసియమ్ అనే మూడు వేర్వేరు పాఠశాలల్లో చేర్చుతారు. ఏ పాఠశాలలో చదివినా.. కనీసం తొమ్మిదేళ్ల విద్యను పూర్తి చేసుకోవాల్సిందే. వీటితోపాటు పార్ట్‌టైం పాఠశాలల్ని నిర్వహిస్తారు. ఇక్కడ చదువు పూర్తి చేసుకున్నవారు నేరుగా ఉద్యోగాల్లో చేరవచ్చు. జర్మనీ విద్యార్థులపై హోంవర్క్, ఇతర ఎక్స్ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ అంటూ అధిక భారం పడుతుంటుంది. వీటికోసం పాఠశాల యాజమాన్యాలు పని వేళలను మరింత పొడిగిస్తూ ఉంటాయి.

దక్షిణ కొరియా: ప్రపంచంలో అత్యుత్తమ విద్యావ్యవస్థ ఉన్న దేశాల్లో దక్షిణ కొరియాకు మంచి స్థానముంది. ఇక్కడి పాఠశాల విద్యార్థులు నూటికి 99శాతం ఉత్తీర్ణత సాధిస్తుంటారు. యూనివర్సిటీల్లో సీటు సంపాదించడం కోసం పాఠశాల స్థాయిలోనే బాగా కష్టపడి చదువుతుంటారు. ఈ దేశంలోని పాఠశాలల పని వేళలు అధికంగా ఉంటాయి. ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాల కొనసాగుతోంది. బాగా చదువుకోవాలనుకునే విద్యార్థులు కొన్నిసార్లు రాత్రి 10-11గంటల వరకు లైబ్రరీలో కూర్చొని చదువుకుంటారు. మరికొందరు లైబ్రరీలో చదువు పూర్తయ్యాక రాత్రిపూట నిర్వహించే ప్రత్యేక పాఠశాలల్లో చేరి, అర్ధరాత్రి దాటి గంటల వరకూ చదువుకోవడం విశేషం. జపాన్లాగే ఇక్కడ కూడా 6+3+3 విద్యావిధానం ఉంటుంది.

చైనా: భారీ జనాభా గల చైనాలో పాఠశాల విద్య మూడు భాగాలుగా ఉంటుంది. ప్రీస్కూల్ విద్య మూడేళ్లు, ప్రైమరీ విద్య ఆరేళ్లు సెకండరీ విద్య ఆరేళ్లు ఉంటుంది. సెకండరీ విద్యలో మళ్లీ రెండు విభాగాలుంటాయి. మూడేళ్ల జూనియర్ విద్య, మూడేళ్ల సీనియర్ విద్య. జూనియర్ విద్య పూర్తయ్యాక విద్యార్థులు ఒక ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. దీంట్లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత సీనియర్ విద్య చదవడమో లేదా వొకేషనల్ కోర్సులో చేరడమో విద్యార్థులే నిర్ణయించుకుంటారు. సీనియర్ విద్యను ఎంపిక చేసుకుంటే అది పూర్తయ్యాక జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష రాసి యూనివర్సిటీల్లో సీటు దక్కించుకోవాలి. అదే వొకేషనల్ కోర్సులో చేరితే 24 ఏళ్ల శిక్షణ అనంతరం ఉద్యోగాల్లో చేరవచ్చు.

కెనడా: అత్యధికమంది విద్యావంతులు యూనివర్సిటీ నుంచి బయటికొచ్చి ఉద్యోగాలు సంపాదించే దేశాల్లో కెనడా మొదటిస్థానంలో ఉంటుంది. ఇక్కడ విద్యార్థులు చిన్నతనం నుంచే బాగా చదువుకోవడానికి అలవాటు పడతారు. ఎందుకంటే కెనడాలో ఎక్కువ మంది ఇతర దేశాల నుంచి వలస వచ్చిన వాళ్లే ఉంటారు. వారు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల నిమిత్తం కెనడాకు వచ్చి స్థిరపడతారు. వారిలాగే వారి పిల్లలు కూడా బాగా చదువుకోవాలన్న ఉద్దేశంతో చిన్నతనం నుంచే విద్యపై శ్రద్ధ పెడతారు. నిజానికి కెనడాకు ఒక విద్యా వ్యవస్థ అంటూ ఏమీ లేదు. ప్రాంతాలే స్థానికంగా విద్యావిధానాన్ని రూపొందించుకుంటాయి.

లండన్: లండన్ విద్యా విధానం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా పరిగణించబడుతుంది. ఆచరణాత్మక అభ్యాసం, పరిశోధన,విమర్శనాత్మక ఆలోచనకు ప్రాధాన్యత ఇస్తూ, అంతర్జాతీయంగా ఆమోదించబడిన క్వాలిఫికేషన్ లను అందిస్తుంది.ప్రారంభ సంవత్సరాలు జననం నుండి 5 సంవత్సరాల వరకు (తప్పనిసరి కాదు) ప్రాథమిక విద్య 511 సంవత్సరాల వయస్సు.మాధ్యమిక విద్య 1116 సంవత్సరాల వయస్సు (ఇది తప్పనిసరి, తదుపరి విద్య 1618 సంవత్సరాలు ఉన్నత విద్య విశ్వవిద్యాలయ డిగ్రీలు, పీజీ, పిహెచ్‌డి ఉంటుంది.

(రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ)

విద్యా మాఫియాకు సర్కారు ఊడిగం

వెంక గారి భూమయ్య
98489863

తెలంగాణ విద్యా రంగం నేడు కార్పొరేట్ విద్యా రాబందుల కబంధహస్తాల్లో చిక్కుకొని విలవిలలాడుతోంది. విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే, పాలకులు మాత్రం కేవలం ప్రసంగాలకే పరిమితమవుతున్నారు. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ వైకల్యాన్ని బట్టబయలు చేయడమే కాకుండా, ప్రభుత్వ అసమర్థతను కళ్లకు కట్టాయి. "నాకు విద్యాశాఖ మంత్రిగా ఛాన్స్ వస్తే కార్పొరేట్ స్కూల్స్ అన్నింటినీ మూసేయిస్తా" అని ఆయన అనడం వినడానికి బాగానే ఉన్నా, అది ముమ్మాటికీ బాధ్యతల నుండి పలాయనం చిత్తగించడమే. ఒక కేబినెట్ మంత్రిగా ఉండి, వ్యవస్థలో దారుణాలు జరుగుతున్నాయని తెలిసి కూడా "శాఖ మారితేనే మారుస్తా" అనడం ప్రజలను వెర్రి వెంగళప్పలను చేయడమే అవుతుంది. ప్రభుత్వం అనేది ఒక సమిష్టి బాధ్యత. సమస్య తెలిసినప్పుడు క్యాబినెట్‌లో గట్టిగా నిలదీయలేని మంత్రి, కేవలం పబ్లిసిటీ కోసం ఇలాంటి ప్రకటనలు చేయడం ఆయన రాజకీయ అసహాయతను లేదా పదవీ కాంక్షను సూచిస్తోంది.

ర్యాంకుల ఫ్యాక్టరీలు.. మృత్యు కుహరాలు

రాష్ట్రంలో నారాయణ, శ్రీచైతన్య వంటి విద్యా వ్యాపార సామ్రాజ్యాలు విద్యార్థుల రక్తాన్ని ఫీజుల రూపంలో జుర్రుకుంటున్నాయన్నది బహిరంగ రహస్యం. మంత్రి గారు అన్నట్లుగా 'బట్టీ' పద్ధతి అనేది విద్యార్థుల మేధస్సును గొంతు నులిమి చంపేసే ఒక నెమ్మదైన విషప్రయోగం. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, పశువుల పాకల వంటి గదుల్లో విద్యార్థులను బంధించి, కేవలం ర్యాంకుల కోసం వారిని ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తుంటే సర్కారు ఎందుకు నిద్రపోతోంది? ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఫ్యాన్లకు ఉరితాళ్లతో వేలాడుతున్నా, అవే సంస్థలకు ప్రభుత్వం ఏటా అనుమతులు ఎలా మంజూరు చేస్తోంది? ఒకవైపు ఆ సంస్థల యజమానులను 'దొంగల'తో పోల్చిన మంత్రి, అదే సమయంలో ప్రభుత్వం వారికి ఎందుకు వత్తాసు పలుకుతుందో సమాధానం చెప్పాలి.

మేధావుల వెట్టిచాకిరీ.. ప్రభుత్వ వైఫల్యం

పీహెచ్‌డీలు చేసిన మేధావులు కూడా ఉద్యోగాలు లేక ఈ నరకకూపాల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారంటే, అది ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో మరియు విద్యా రంగంలో ఉపాధిని కల్పించడంలో ఎంతగా విఫలమైందో చాటి చెబుతోంది. ప్రభుత్వం తన పరిధిలోని లెక్చరర్ పోస్టులను భర్తీ చేయకుండా, ఉన్నత విద్యావంతులను

కార్పొరేట్ రాబందుల చేతికి చిక్కేలా చేస్తోంది. ఒకవైపు ప్రభుత్వం "మన ఊరు మన బడి" వంటి పథకాలతో గొప్పలు చెప్పుకుంటూనే, మరోవైపు కార్పొరేట్ సంస్థల ఫీజుల దోపిడీని అదుపు చేయడానికి కనీసం ఒక్క జీవో (G.O.) కూడా జారీ చేయలేక చేతులెత్తేస్తోంది. మంత్రి తన సొంత నిధులతో ఒక మోడల్ స్కూల్ కట్టినంత మాత్రాన రాష్ట్రంలోని లక్షలాది మంది పేద విద్యార్థుల సమస్య తీరిపోదు. అది కేవలం ఒక వ్యక్తిగత ఇమేజ్ కోసం చేసే ప్రయత్నం తప్ప, విధానపరమైన మార్పును తీసుకురాదు.

అపవిత్ర పొత్తు.. పాలనాపరమైన గందరగోళం

కార్పొరేట్ సంస్థలకు మరియు ప్రభుత్వానికి మధ్య ఉన్న 'అపవిత్ర పొత్తు' (Unholy Alliance) వల్లనే ఇలాంటి గందరగోళ ప్రకటనలు బయటకు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో విరాళాలు ఇచ్చే కార్పొరేట్ శక్తుల మెడలు వంచే ధైర్యం పాలకులకు లేనందువల్లే, ఇలాంటి మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రభుత్వమే స్వయంగా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ, ప్రజల ముందు నీతులు వల్లించడం అత్యంత సిగ్గుచేటు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ప్రభుత్వంలోని అంతర్గత విభేదాలను కూడా బయటపెడుతున్నాయి. విద్యాశాఖ మంత్రిగా ఉన్న వ్యక్తి సమర్థుడు కాదని కోమటిరెడ్డి భావిస్తున్నారా? లేక ముఖ్యమంత్రి నాయకత్వంలో విద్యా వ్యవస్థ బాగుపడదని ఆయనకు నమ్మకం పోయిందా?

బాధ్యతాయుతమైన పలాయనం.. విద్యా వైకల్యం

అసలు విద్యాశాఖ మంత్రి బాధ్యతలు తీసుకోవడమే సమస్యకు పరిష్కారం అనుకుంటే, ప్రస్తుత కేబినెట్‌లో విద్యాశాఖ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మంత్రి పరోక్షంగా ఒప్పుకున్నట్లే కదా! ఒక పక్క ప్రభుత్వ కాలేజీల్లో కనీసం ల్యాబ్ సౌకర్యాలు లేక, టాయిలెట్లు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతుంటే, వాటిని బాగు చేయడం చేతకాని పాలకులు కార్పొరేట్ స్కూళ్లను మూసేస్తామని చెప్పడం కేవలం రాజకీయ విన్యాసం మాత్రమే. మూసివేత అనేది ఒక ప్రత్యామ్నాయం కాదు, అది కేవలం అసమర్థతను కప్పిపుచ్చుకునే సాకు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా ప్రైవేట్ సంస్థలను తిట్టడం అంటే.. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే. ఈ ప్రకటనల వెనుక ఉన్న అసలు ఉద్దేశం విద్యా రంగం మీద ప్రేమ కాదు, ప్రజల దృష్టిని మళ్ళించే ఎత్తుగడ మాత్రమే అని అర్థమవుతోంది.

ప్రజల కళ్లలో దుమ్ము తుడిచే ప్రయత్నం

ఈ అస్పష్టత వల్ల అటు తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్ల ఫీజులు భరించలేక, ఇటు ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం లేక రెంటికీ చెడ్డ రేవడిలా మారుతున్నారు. ప్రభుత్వం తన ద్వంద్వ వైఖరిని వీడితే తప్ప ఈ విద్యా వైకల్యం నుంచి రాష్ట్రానికి విముక్తి లభించదు. ఒకవైపు కార్పొరేట్ మాఫియాను తిడుతూనే, మరోవైపు వారికి సకల సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వానికే చెల్లింది. ఈ రాజకీయ నాటకాలకు స్వస్తి పలికి, విద్యార్థుల ప్రాణాలకు విలువిచ్చేలా స్పష్టమైన విద్యా విధానాన్ని అమలు చేయాలి. లేదంటే, రాబోయే రోజుల్లో ఈ గందరగోళం విద్యా వ్యవస్థను పూర్తిగా అగాధంలోకి నెట్టడం ఖాయం. మంత్రి వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు రహస్యం ప్రజలకు తెలుసు, అది ఆవేదన కాదు.. కేవలం తన రాజకీయ ఉనికిని చాటుకునే ప్రయత్నం మాత్రమే.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మనిషికి తప్పని 'ఈఎంఐ' బాధలు

గణేష్. పి
9573284156

మనిషి జీవితం పూర్వమే బాగుండేదేమో టెక్నాలజీ పెరుగుతుందని సంతోషపడాలో లేక, మనుషుల పతనం మొదలైందని బాధపడాలో అర్థం కావడం లేదు. పూర్వం ఒక వస్తువుని కొనాలంటే డబ్బు ఉంటే కొనేవాళ్ళు లేదంటే వస్తువు మార్పిడి చేసుకునే వారు, ఆ రోజుల్లో మనుషులు ఒక ప్రశాంతమైన జీవితాన్ని గడిపేవారు. కానీ ప్రస్తుతం ఏదైనా ఒక వస్తువుని కొని ఆ వస్తువుకి ప్రతి నెల ఈఎంఐ అంటూ తల పట్టుకుంటున్నారు. దానికి తోడు సోషల్ మీడియాలో కనిపించే ప్రతిదీ చేయాలనుకుంటారు అందులో ఎంత నిజం ఎంత అబద్ధం ఉందో గమనించలేని పరిస్థితిలో ఉన్నాం. మనం బ్రతకాలి అంటే కొన్ని వస్తువుల మీద ఆధారపడి ఉంటాం. ఆ వస్తువులు మనకు అవసరం ఉండొచ్చు అవసరం ఉండకపోవచ్చు, కొన్ని మనం బ్రతకడానికి కొనుకుంటాం మరికొన్ని మన స్థాయిని చూపించుకోడానికి కొంటుంటాం. దాన్నీ చూపించే క్రమంలో మనిషి సగం జీవితం ఈఎంఐ లోనే బ్రతుకుతున్నారు.

దీనికి ప్రధాన కారణాలు:

మారుతున్న కాలంతో పాటు ఈ సమాజంలో సోషల్ మీడియా కూడా పెరుగుతూ వచ్చింది. ఫోన్ చేతిలో ఉన్న ప్రతి ఒక్కరూ తన సెల్ ఫోన్లో ఏదో ఒక వీడియో చూసి ప్రభావితం అవుతూ ఉంటారు. అందులో జీవితాన్ని మార్చుకునే వారు కొందరు ఉంటే, మరి కొంత మంది లగ్జరీ జీవితాన్ని గడపాలని ఉంటారు. ఒకప్పుడు మన చేతిలో డబ్బు ఉంటేనే ఒక వస్తువుని కొనడానికి ఆశక్తి చూపించే వారు. ఇప్పుడు కాలం మారిపోయింది కథ చేతిలో డబ్బు ఉన్న లేకపోయినా ఈఎంఐ ల ద్వారా మనిషికి ఇష్టమైన వస్తువుని కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. ఈ ఈఎంఐ ల వల్ల మనిషి తన జీవితంలో సగం ప్రశాంతత కోల్పోతుంటాడు.

పక్కవారితో పోలిక :

యుక్త వయసు గల వారు ఇలాంటి వాటికి చాలా త్వరగా ఆకర్షించబడతారు. మన చుట్టు ఉన్నవారు ఒక వస్తువు కొంటే ఆ వస్తువు మనకు కొనాలి అనిపిస్తుంది. యువకులు తన స్నేహితులు ఏది కొనుకున్నా ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆ వస్తువుని కొనుకోవాలి అనుకుంటారు ఆ వస్తువు విలువ గురించి, ఇంట్లో స్థితి గతుల గురించి, ఆలోచించరు. ఎలాగో మనకి ఈఎంఐ ద్వారా తీసుకునే అవకాశం ఉంది కాబట్టి ఎంతో కొంత డబ్బు కట్టి ఆ వస్తువుని కొనుకుంటారు. ఈ ఈఎంఐ లోనైనా 50 శాతం లేదా 60 శాతం కూడా నగదు చేతికి ఇవ్వకుండా 10 శాతం 20 శాతం నగదు కట్టి మిగతా మొత్తం ఈఎంఐ లోనే. నగదు చెల్లించడం వల్ల వడ్డీ రేట్లు ఎక్కువ అవుతుంది. ఒక 60, 70 శాతం నగదు చెల్లించడం ద్వారా వడ్డీ రేట్ల నుంచి కొంత తప్పించుకోవచ్చు. ఈ సమాజంలో చాలా మంది వ్యక్తులు ఎదుటి వారికి ఉంది నాకు లేదు అనే భావనతోనే ఎంత విలువ చేసే వస్తువునైనా ఈఎంఐ ల ద్వారా సులభంగా కొంటున్నారు.

నియంత్రించే విషయాలు:

మనిషికి చూసిన వస్తువుని కొనాలనిపించడం సర్వసాధారణం ఒక వస్తువుని కొనేముందు వారం రోజులు దాని గురించి ఆలోచించండి ఈ వారం రోజులు ఆ వస్తువుని కొనాలి అనిపిస్తే అప్పుడు కొనండి ఈ వారం రోజులు ఆలోచించడం వల్ల మీకు ఆ వస్తువుని కొనాలని ఆశ సచిపోవచ్చు. యుక్త వయసులో ఉన్న వారికి వీటి పై అవగాహన లేక లోన్ లు తీసుకోవడం,ఈఎంఐ ద్వారా తనకి నచ్చిన వస్తువుని తీసుకొని ఈఎంఐ ని కట్టలేక తరువాతకి ఇబ్బంది పడుతుంటారు.మన స్థాయికి మించి, మన సంపాదనను మించి, వస్తువులు కొనేముందు ఒక్కసారి ఆలోచించండి. మనం ఒక వస్తువుని కొన్నప్పుడు మనం కట్టే ఈఎంఐ మన సంపాదన కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి మనకు వచ్చే సంపాదనలో పూర్తిగా ఈఎంఐ కట్టుకుంటూ పోతే తర్వాత జీవితాన్ని కొనసాగించలేము. ఒక వస్తువుని ఈఎంఐ ల ద్వారా కొనేముందు, ఈఎంఐల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉంటే, ఈఎంఐ ల కోసం అప్పుల బాధ నుంచి తప్పించుకున్నావారు అవుతారు.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు గుండాల, భద్రాద్రి కొత్తగూడెం)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచాలి

- సీఎస్ రామకృష్ణారావు ఆదేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 28 : ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలలో బోధనలో నాణ్యతా ప్రమాణాలు మరింతగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల స్థాయి వరకు ప్రతి విద్యా సంస్థలోను మెరుగైన బోధన సాగాలని, విద్యా బోధనలలో నాణ్యత ప్రమాణాలు పెంచే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని సీఎస్ ఆదేశించారు. విద్యాశాఖ పై సంబంధిత ఉన్నతాధికారులతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, డిజిటల్ విద్య, ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీల్లో పనితీరు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో బోధన చేసి రిటైర్డ్ అయిన మంచి అనుభవం కలిగిన ప్రొఫెసర్లు, లెక్చరర్లు, టీచర్లతో విద్యార్థులకు తరుచుగా ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థులకు బోధన చేయిస్తే విద్యార్థులలో సృజనాత్మకత, మోటివేషన్, మంచి ఆలోచనలు పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. తద్వారా విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించి ప్రణాళికలు ఏర్పరచుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. అదే విధంగా కేజీబీవీ, వివిధ సంక్షేమ వసతి గృహాలలో ఒక వసతి గృహాన్ని ఎంపిక చేసుకొని అందులో సోలార్ మోడల్ తరహా కిచెన్, స్టోరేజ్ రూమ్స్, మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, ఇంటర్నెట్ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి దానిని ఒక మోడల్ హాస్టల్ గా రూపొందించాలని సీఎస్ అధికారులకు సూచించారు. దానిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్ లో మిగితా వసతి గృహాలలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలల స్థాయిలో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని, బీఈడీ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం క్రింద ప్రభుత్వ పాఠశాలలో బోధన చేయించాలని, విద్యార్థులలో ఆసక్తి, నైపుణ్యాలు పెంచే విధంగా అనుభవం కలిగిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, మార్గదర్శకులతో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా , పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన నార్నూర్ ఏఈ డిస్మిస్

- అవినీతికి పాల్పడితే కటకటాలే
- బ్లాక్ లిస్టులో వారి వివరాలు
- హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి, లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల అవుట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గం శ్రీకాంత్ ను ఉద్యోగంలో నుంచి తొలగించామని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతం తెలిపారు. క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, భవిష్యత్తులో ఎక్కడా ఉద్యోగం రాకుండా వివరాలను బ్లాక్ లిస్టులో పెడుతున్నట్లు ప్రకటించారు. శ్రీకాంత్ గత ఏడాది మే నెల నుంచి విధులను నిర్వహిస్తూ మంగళవారం నాడు నార్నూర్ లో ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి లంచం డిమాండ్ చేసి, రెడ్ హ్యాండెడ్ గా దొరికారు. బిల్లుల విడుదల నిమిత్తం ఇండ్ల ఫోటోలు అప్ లోడ్ చేయడానికి అధికారులెవరైనా నిరాకరిస్తే, ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా లబ్ధిదారులే స్వయంగా పోటోలను అప్ లోడ్ చేసుకోవచ్చని ఎండి సూచించారు. పేదలకు శాశ్వతమైన లబ్ధి చేకూర్చే బృహత్తరమైన సంక్షేమ కార్యక్రమంలో అవినీతికి పాల్పడుతూ, లంచాలను డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎండీ గౌతం స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో ఇరుక్కున్న వారు జైలుకు వెళ్లడమే కాకుండా, తదుపరి వారికి ఎక్కడా ఉద్యోగాలు లభించవని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో వివిధ రకాల విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ సిబ్బంది అయినా, డిప్యూటేషన్ పై వచ్చిన వారైనా, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అయినా, అవినీతికి పాల్పడితే కేసులు ఎదుర్కోవాల్సిందే అని హెచ్చరించారు. ఈ అంశంలో ప్రజలకు ఏమైనా ఫిర్యాదులుంటే 1800 599 5991 కాల్ సెంటర్ కు ఫోన్ చేయాలని కోరారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం

- యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి పిలుపు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: రాబోయే మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయాలని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఇందిరా భవన్‌లో ఆయన ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం నో అబ్జెక్షన్ బుక్ పై బ్రోచర్‌ను విడుదల చేసిన అనంతరం శివచరణ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పాత్ర, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఓటు చోరీకి వ్యతిరేకంగా పోరాటం, జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు మార్చేలా మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ప్రజలను చైతన్యపరచడం వంటి అంశాలపై చర్చించారు. దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న మద్దతు, 'విత్ ఐవైసి' యాప్ వినియోగంపై కూడా దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కో-ఇన్‌చార్జులు రోష్ని జైస్వాల్, కేఆర్ భవ్యతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీని గెలిపించండి':వెలిచాల

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 28: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని తద్వారా రెండవ డివిజన్ ను కరీంనగర్ నియోజకవర్గం లోనే అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. 2 వ డివిజన్ తీగలగుట్టపల్లి సరస్వతి నగర్ లో కొలగాని అనిల్ ఆధ్వర్యంలో బస్తిబాటకు రాజేందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో రాజేందర్ రావు మాట్లాడుతూ నాడు ఎమ్మెల్యేగా పనిచేసిన మా తండ్రి జగపతి రావు కరీంనగర్ ను కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కరీంనగర్ ప్రజలు తాగునీరు తాగుతున్నారంటే జగపతిరావు చేసిన కృషి వల్లేనని పేర్కొన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి ఆశీర్వదించాలని రాజేందర్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిళలు డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేసిన సీపీ గౌస్ ఆలం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 28: హుజురాబాద్ మరియు జమ్మికుంట మున్సిపాలిటీల్లో త్వరలో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం నేడు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు మరియు కౌంటింగ్ కేంద్రాలను ఆయన వ్యక్తిగతంగా పరిశీలించారు. హుజురాబాద్, జమ్మికుంట పురపాలక సంఘ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి, అక్కడ కల్పించిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌లు & కౌంటింగ్ కేంద్రాలు: హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జమ్మికుంట డిగ్రీ మరియు పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేయబోయే కౌంటింగ్ కేంద్రాలను, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లను సిపి గారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా సూచనలు: ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని, బందోబస్తు విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సూచించారు. ఈ పర్యటనలో సిపితో పాటు ఏసీపీ మాధవి, జమ్మికుంట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, హుజురాబాద్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో మరో భారీ కుంభకోణం

- మైక్రో బ్రూవరీల కేటాయింపులో అవకతవకలు
- 25 టెండర్లను నేతలు, మంత్రులకు కేటాయించేందుకు ముందే నిర్ణయం
- ఒక్కో బ్రూవరీకి అనధికారికంగా రూ.1.80 కోట్ల మేర వసూలు
- ముఖ్యనేతకు అత్యంత సమీపంగా ఉండే వ్యక్తి కీలక పాత్ర
- మాజీ మంత్రి, బీఆర్ఎస్‌నేత హరీష్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 28: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. సింగరేణిలో ఇంకా బయటపెట్టాల్సిన కుంభకోణాలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, ఈసారి ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న అవినీతి వ్యవహారాన్ని ప్రజల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్లో చిట్ చాట్లో మాట్లాడారు. ఎక్సైజ్ శాఖలో మైక్రో బ్రూవరీల కేటాయింపుల విషయంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపించారు. మొత్తం 110 దరఖాస్తులు రాగా, వాటిలో 25 టెండర్లను ముఖ్యనేతలు, మంత్రులకు కేటాయించేందుకు ముందే నిర్ణయించుకున్నారని చెప్పారు. ఇందులో 21 టెండర్లు ముఖ్యనేత కోటా కింద, మిగిలిన నాలుగు మంత్రి కోటా కింద ఇచ్చేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. ముఖ్యనేతకు అత్యంత సమీపంగా ఉండే వ్యక్తి ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నాడని, ఒక్కో బ్రూవరీకి అనధికారికంగా రూ.1.80 కోట్ల మేర వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో రూ.1.50 కోట్లు ముఖ్యనేతకు, మిగిలిన రూ.30 లక్షలు ఆ వ్యక్తికి వెళ్లేలా ఒప్పందాలు జరిగినట్లు హరీష్ రావు ఆరోపించారు. వైన్స్ షాపుల విషయంలో లక్కీ డ్రా నిర్వహించకుండా కొందరికి నేరుగా టెండర్లు ఇచ్చారని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా లిక్కర్ సరఫరా సంస్థలకు రూ.4,500 కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టారని, 16 నెలలుగా సరఫరా కంపెనీలకు చెల్లింపులు జరగడం లేదన్నారు. దీని వల్ల బ్రీజర్ సరఫరా రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిందని తెలిపారు. బకాయిల కారణంగా మల్టీనేషనల్ కంపెనీలు సరఫరా నిలిపివేస్తామని ప్రభుత్వానికి పలు మార్లు లేఖలు రాసినప్పటికీ స్పందన లేదని, మంత్రుల మధ్య వాటాల పంచాయతీ వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. దీని వల్ల రాష్ట్ర ఆదాయానికి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇక రైతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. మెదక్ జిల్లా సింగూర్ డ్యాం కింద, సంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారని, అయితే అదే ప్రాంతాల్లోని బీరు కంపెనీలకు మాత్రం నీటి సరఫరా కొనసాగుతోందన్నారు. ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యదర్శి ఆదేశాలతో బీరు కంపెనీలకు నీళ్లు ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గీత కార్మికులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని, 850 మంది గౌడ్లు మృతి చెందినా ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5 లక్షల భీమా పథకంతో గౌడ కుటుంబాలను ఆదుకున్నామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 లక్షల భీమా ఇస్తామని చెప్పి అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం 'తాగుబోతుల తెలంగాణ'గా మారిందని, గల్లీ గల్లీకి మద్యం దుకాణాలు తెరిచారని విమర్శించారు. రెండేళ్లలో మద్యం ద్వారా రూ.10 వేల కోట్ల ఆదాయం పెంచుకున్నారని, మహిళలకు హామీ ఇచ్చిన పథకాలు అమలు చేయకపోయినా మద్యం అమ్మకాల్లో మాత్రం ముందున్నారని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

పటాన్ చెరులో మంత్రులకు ఘన స్వాగతం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 28 : పటాన్ చెరు లోని కర్ధనూర్ లో నూతనంగా నిర్మించతలపెట్టిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమానికి రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి హాజరయ్యారు. మార్గమధ్యంలో ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మంత్రులను మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ఘన స్వాగతం పలికారు. ఇద్దరికి పూల బొకేలు అందించి శాలువలు కప్పి సత్కరించారు. పటాన్ చెరు కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయడంతో పాటు కర్ధనూర్ లో స్థల కేటాయింపు చేసి భవన నిర్మాణం పనులు మొదలు పెడుతున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు సమయం రవాణా ఖర్చులు కలిసి వస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తున్నందుకు నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

జైళ్లలో సంస్కరణలు, బలోపేతంపై కేంద్రం ఫోకస్

- జైళ్ల ఆధునీకరణ, హైసెక్యూరిటీ జైళ్ల నిర్మాణం కోసం రూ.950 కోట్ల కేటాయింపు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- విశాఖపట్నంలో "జైలు అధికారుల 9వ జాతీయ సమ్మేళం'

ప్రతిపక్షం, విశాఖపట్నం, జనవరి 28: దేశవ్యాప్తంగా జైళ్ల బలోపేతంతోపాటు ఆయ జైళ్లను సంస్కరించి ఖైదీల్లో మార్పు తీసుకురావడంపై కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జైళ్ల ఆధునీకరణ ప్రాజెక్టు కింద రూ.950 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. హైసెక్యూరిటీ జైళ్లతోపాటు ఆయా జైళ్లలో భద్రతా మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలోని సాయిప్రియా రిసార్ట్స్ లో రెండ్రోజులపాటు నిర్వహించిన "జైలు అధికారుల 9వ జాతీయ సమ్మేళం' కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీపీఆర్ డీ డైరెక్టర్ అలోక్ రంజన్, ఏపీ జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్, ఉన్నతాధికారులు రవి లోకు, జితేంద్ర మీనా, తెలంగాణ జైళ్ల డీజీ సౌమ్య మిశ్రాతోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన జైళ్ల ఉన్నతాధికారులు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జైలు అధికారుల 9వ జాతీయ సమ్మేళం' దేశవ్యాప్తంగా జైలు సంస్కరణలను మరింత బలోపేతం చేసే కీలక వేదికగా నిలుస్తుందనే నమ్మకం ఉందన్నారు. ఈ సదస్సు ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పరస్పర అనుభవాలను పంచుకునే అవకాశం లభించడమే కాకుండా, ఉత్తమ ఆచరణల వినూత్న కార్యక్రమాల, విధానపరమైన అవసరాలుపై లోతైన చర్చ జరగడం ద్వారా జైలు పరిపాలన నాణ్యతను మెరుగుపర్చేందుకు అవసరమైన కార్యాచరణకు మార్గం సుగమం చేస్తోందన్నారు. పేద ఖైదీల సంరక్షణ, మోడల్ జైలు ప్రమాణాల అమలు, ఖైదీల విడుదల అనంతర పునరావాసం వంటి అంశాలపై దృష్టి సారించాలని, పేదఖైదీలకు మద్దతు పథకం, జైళ్ల ఆధునీకరణ ప్రాజెక్టు అమలులో వ్యూహాలు, మోడల్ ప్రిజన్ మాన్యువల్-2016, మోడల్ ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ చట్టం-2023 అమలులో సవాళ్లపైనే ఈ సదస్సులో చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. జైళ్లలో సంస్కరణలకు విధాన మార్గదర్శకాలు, చట్టపరమైన నిర్మాణం, లక్షిత పథకాల ద్వారా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నిరంతరం మార్గదర్శనం చేస్తోందని, పేద ఖైదీలకు మద్దతు పథకం కింద ఏటా రూ.20 కోట్లు కేటాయిస్తున్నామని, ఇప్పటివరకు 16 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో 237 మంది ఖైదీలకు ఈ పథకం ద్వారా ఉపశమనం లభించిందని తెలిపారు. జైళ్ల ఆధునీకరణ ప్రాజెక్టు కింద మొత్తం రూ.950 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. హైసెక్యూరిటీ జైళ్లు మరియు భద్రతా మౌలిక సదుపాయాల బలోపేతమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.101.45 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.

కొత్తగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 28 : ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు కృషిచేస్తానని సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని బాకారం గ్రామంలో శ్రీరామ్ రెడ్డి నగర్ కాలనీలో మందిరం వద్ద 75కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్ లోఓల్టేజ్ కారణంగా విద్యుత్ సరఫరాకు సమస్యగా ఉండేది. దీనిని పలువురు గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లడంతో సొంత నిధులు వెచ్చించి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు 120కేవి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ వెంకటేష్ గౌడ్ పై ప్రశంసల జల్లులు కురిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నాణ్యమైన విద్యుత్ ను అందించడం జరిగిందన్నారు. గ్రామంలో ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషిచేస్తునానని, అదేవిధంగా ప్రజలు సైతం సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వినతి

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 28 : మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ గొడుగు యాదయ్య గ్రామస్తులతో కలిసి నగరంలోని బషీరాబాగ్ విద్యుత్ కార్యాలయంలో డీఈకి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈకీ వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై వివరించారు. దీంతో డీఈ సానుకూలంగా స్పందించి మొయినాబాద్ ఏఈకి ఫోన్ చేసి కేతిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా ప్రజాబాట కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకుని తనకు నివేధిక అందించాలని చెప్పినట్లు సర్పంచ్ గొడుగు యాదయ్య తెలిపారు. నేడు గ్రామంలో నిర్వహించే ప్రజాబాట కార్యక్రమంలో ప్రజలు అదిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

“

మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయంపై విధివిధానాలను రూపొందించాలి. సోషల్ మీడియా జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై మంత్రులతో జరిగిన మీటింగ్‌లో చర్చించాం. చిన్నారులకు సోషల్ మీడియాను నిషేధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, ఫ్రాన్స్‌లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ఫేక్ పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆఫీసర్లను ఆదేశించాం.

- ఏపీ మంత్రి నారా లోకేశ్.

ప్రాంతీయం

హుస్నాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- 20కి 20 వార్డుల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- పార్టీలోకి మాజీ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, కీలక నేతల చేరిక
- అభివృద్ధికి పట్టం కట్టండి: మంత్రులు తుమ్మల, పొన్నం పిలుపు

-ప్రతిపక్షం,హుస్నాబాద్, జనవరి 28: హుస్నాబాద్ మున్సిపాలిటీని సర్వతోముఖాభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డుల్లోనూ పార్టీ జెండా ఎగురవేయాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనితారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్నతో పాటు పలువురు ముఖ్య నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సర్వే ఆధారంగానే టికెట్లు: మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని కోరారు. అభ్యర్థుల ఎంపిక శాస్త్రీయంగా, సర్వే ఆధారంగానే ఉంటుందని, గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయిస్తాం అని తెలిపారు. హుస్నాబాద్‌ను విద్యా, వైద్య, పారిశ్రామిక రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం అని అన్నారు. పట్టణానికి నాలుగు వైపులా నాలుగు వరుసల రహదారులు, 250 పడకల ఆసుపత్రి, ఇంజనీరింగ్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల వంటి పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసా ఇచ్చారు.

పొన్నం పట్టుదలతోనే నిధుల ప్రవాహం: మంత్రి తుమ్మల

హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తన నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ కేబినెట్ సమావేశాల్లో నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, సంక్షేమ పథకాలను ఆపకుండా ముందుకు తీసుకెళ్తున్నాం అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గౌరవెల్లి భూ సేకరణ పనులను వేగవంతం చేశామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో దెబ్బలు తిన్న ఉద్యమకారుడు పొన్నం అని, అటువంటి నాయకుడికి అండగా నిలిచి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మజీ హౌస్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంక చందు, నాయకులు మంజుల రెడ్డి, చిత్తారి రవీందర్, వి వెంకటరమణ, నియోజకవర్గ స్థాయి నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జన సముద్రంగా జన జాతర

- మేడారానికి బయలుదేరిన సారలమ్మ
- కొండాయిగూడెం నుంచి మేడారం బయలుదేరిన గోవిందరాజు

ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ/ మేడారం, జనవరి 28: తొలిరోజైన బుధవారం సాయంత్రం 6 గంటలకు మేడారం పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కోలాహలం మొదలవుతుంది. కన్నెపల్లి నుంచి పూజారులు సారలమ్మను గద్దెపైకి తీసుకువస్తారు. అదే సమయంలో కొండాయి నుంచి గోవిందరాజును, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును మేడారంలోని గద్దెలపైకి తీసుకువచ్చి ప్రతిష్ఠించడంతో జాతర అంకురార్పణ జరుగుతుంది. రేపు (గురువారం) సాయంత్రం చిలకలగుట్ట నుంచి కుంకుమ భరిణె రూపంలో సమ్మక్క తల్లి గద్దెపైకి చేరుకోవడంతో జాతర తార స్థాయికి చేరుకుంటుంది. జాతర అధికారికంగా నేడు ప్రారంభమైనప్పటికీ.. గత వారం రోజులుగానే మేడారం జనసంద్రమైంది. జంపన్న వాగు వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రస్తుతం మేడారం పరిసర ప్రాంతాల్లో ఇసుక వేస్తే రాలనంత జనం కనిపిస్తున్నారు. భారీగా వాహనాలు తరలివస్తుండటంతో బుధవారం వేకువజామునే సుమారు 4 కి.మీ. మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీనితో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

వేగంగా విస్తరిస్తున్న మనువాద భావజాలం

- వచ్చే నెల 12న దేశవ్యాప్త సమ్మెకు మద్దతు
- ఐద్వా ప్రధాన కార్యదర్శి కొనినిక్ ఘోష్ బోస్
- ముగిసిన ఐద్వా జాతీయ మహాసభలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 28 : దేశంలో మనువాద భావజాలం వేగంగా విస్తరిస్తూ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని, ఫలితంగా మహిళలపై దాడులు, అణచివేత రోజురోజుకీ పెరుగుతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నూతన ప్రధాన కార్యదర్శి కనిక ఘోష్ బోస్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక చట్టాలు, నరేగా చట్టాన్ని నిర్వీర్యం చేయడం, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఐద్వా సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ సమ్మెలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని మల్లు స్వరాజ్యం వేదికగా (ఆర్టీసీ కళ్యాణ మండపం ఆడిటోరియం) జరిగిన 14వ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మహాసభలు ముగిసిన సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేసిన తన తొలి ప్రసంగంలో, కార్పొరేట్ మీడియా ఆర్ఎస్ఎస్ ప్రభావంలోకి వెళ్తోందని, ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ అదే భావజాలాన్ని కలిగిన వారిని ప్రవేశపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం అనేది సర్వమత సమ్మేళనమని, భిన్నత్వంలో ఏకత్వమే దేశ బలమని కొనినిక్ ఘోష్‌బోస్ తెలిపారు. హిందూ-ముస్లిం-క్రిస్టియన్ అనే పేర్లతో ప్రజలను విభజించి పాలించే విధానంతో బీజేపీ ముందుకెళ్తోందని విమర్శించారు. రాజకీయ, ఆర్థిక, మతపరమైన అంశాల్లో మహిళలపై జరుగుతున్న అణచివేత తీవ్రతపై ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, దేశంలో నిరుద్యోగం తీవ్రమవుతుండగా ప్రజల హక్కులపై దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో రాజకీయ జోక్యం పెరుగుతోందని, రోహిత్ వేముల, ఉమర్ ఖాలిద్ తదితరులపై జరిగిన ఘటనలను ప్రస్తావించారు. ఈ పరిస్థితుల్లో లౌకికత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా పోరాటాలను మరింత తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందని ఆమె నొక్కిచెప్పారు.

'మహిళలకు హక్కులిస్తే తీసుకుంటాం, లేదంటే లాక్కుంటాం..'

'మహిళలకు హక్కులిస్తే తీసుకుంటాం, లేదంటే లాక్కుంటాం..' మధ్యలో వదిలే ప్రసక్తే లేదని, చివరి వరకు పోరాడుతామని కనిక ఘోష్ బోస్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఐద్వా 14వ జాతీయ మహాసభల్లో కనిక ఘోష్ బోస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పీకే. శ్రీమతి, జాతీయ కోశాధికారి తపసి ప్రహరాజ్, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఉపాధ్యక్షులు మరియం ధావ్‌లే, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిలతో కలిసి ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. మనువాద భావజాలాన్ని తీవ్రంగా హెచ్చరిస్తూ, మహిళల హక్కుల సాధన కోసం ఏ పరిస్థితుల్లోనైనా పోరాటం కొనసాగుతుందని కనిక ఘోష్ బోస్ తెలిపారు. అన్ని రకాల హింసల్లో మహిళలే ప్రధాన బాధితులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలకు పెను ప్రమాదం: మరియం ధావ్ లే

బీజేపీ ప్రభుత్వం చట్టాల్లో మనువాద భావజాలంతో తీవ్రమైన మార్పులు చేస్తోందని, ఇవి మహిళలకు తీవ్రమైన ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు మరియం ధావ్ లే హెచ్చరించారు. మహిళలు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే హక్కును కూడా హరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళల సమస్యలపై నిరంతర పోరాటం: మల్లు లక్ష్మి

మహిళల సమస్యలపై ఐద్వా నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి స్పష్టం చేశారు. ఐద్వా 14వ జాతీయ మహాసభలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జాతీయ కమిటీ, రాష్ట్ర కమిటీ తరపున ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీ, బహిరంగ సభ, మహాసభల ఏర్పాట్ల వరకు అనేక మంది కీలకంగా సహకరించారని పేర్కొన్నారు

మన పిల్లల భవిష్యత్ కోసం పోరాడాలి: ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి

భవిష్యత్ తరాలకు మెరుగైన జీవితం అందించాలంటే నేటి మహిళలు పోరాట మార్గంలో నడవాల్సిన అవసరం ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ అధ్యక్షురాలుపీకే శ్రీమతి టీచర్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఐద్వా 14వ జాతీయ మహాసభలో ఆమె జాతీయ అధ్యక్షురాలిగా తిరిగి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, మన పూర్వీకులు సాగించిన పోరాటాల ఫలితంగానే నేడు కొంత మెరుగైన జీవితం సాధ్యమైందని అన్నారు. అదే విధంగా, మన పిల్లలకు ఇంకా మెరుగైన భవిష్యత్ అందించాలంటే మహిళలు తమ హక్కుల కోసం గట్టిగా గళం విప్పాలని ఆమె స్పష్టం చేశారు. ఐద్వా స్థాపన నుంచే అనేక ప్రజా పోరాటాలను ముందుండి నడిపించిందని పేర్కొన్న శ్రీమతి, అంకితభావం, ఐక్యతతో సాగిన ఉద్యమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు.

'ప్రతిపక్షం' ప్రజల పక్షాల నిలవాలి

- బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వంగల దయానంద్

ప్రతిపక్షం, మంచిర్యాల జనవరి 28: ప్రతిపక్షం దినపత్రిక ప్రతి అక్షరం ప్రజల పక్షాన నిలవాలని బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వంగల దయానంద్ పేర్కొన్నారు బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రతిపక్షం దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు సమాజంలో ఉన్న రుగ్మతలను తొలగిస్తూ బడుగు బలహీన వర్గాల పక్షాన నిలవాలని కోరారు నిజాలను నిగ్గుతెలియ విధంగా వార్తలు ప్రచురించాలని ఆయన అన్నారు ప్రతిపక్షం దినపత్రిక ఎల్లవేళలా ప్రజల అభిమానాన్ని చూరకథనాలు రాసే వ్యక్తులు వేదాలు ఆలోచించకుండా సమాజానికి ఉపయోగపడే వార్తలను రాయలన్నారు ప్రతిపక్షం దినపత్రి ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ బీసీ సంఘం సీనియర్ నాయకులు గజల్ వెంకటయ్య తెలంగాణ గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు నిన్నెలా నరసయ్య బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు రామగిరి రాజన్న చారి అశోక్ అంకం సతీష్‌రాస మల్ల రాజేశ్వరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు

న్యూజిలాండ్‌తో నాలుగో టీ20లో కావాలనే ఆరుగురు బ్యాటర్లు, ఐదుగురు పర్ఫెక్ట్ బౌలర్లతో బరిలోకి దిగాం. మమ్మల్ని మేము ఛాలెంజ్ చేసుకున్నాం. ఫస్ట్ బ్యాటింగ్ చేసినప్పుడు బాగా ఆడుతున్నాం. ఛేజింగ్‌లో 2, 3 వికెట్లు త్వరగా పడితే ఎలా ఆడతారో చూడాలనుకున్నాం. నెక్స్ట్ మ్యాచులోనూ ఛేజింగ్ చేసే అవకాశం రావాలని కోరుకుంటున్నా. దూబేకి తోడుగా ఇంకో బ్యాటర్ ఉండుంటే ఫలితం వేరేలా ఉండేది.

- ఇండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్

దుబ్బాకలో తొలిరోజు 18 నామినేషన్లు దాఖలు

- మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 28: దుబ్బాక మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తొలి రోజు 18 నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు మున్సిపాలిటీ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 1,6,15,16,17 వార్డులలో ఇద్దరు చొప్పున పదిమంది 10,11,12,14,19 వ వార్డులలో ఓక్కొక్కర్ చొప్పున 5 మంది 18 వ వార్డులో ముగ్గురితో కలిపి మొత్తంగా 18 నామినేషన్లు దాఖలు చేసినట్లు మున్సిపాలిటీ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్ తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కి ఎన్నికల హెల్ప్ డెస్క్ లను అందుబాటులో ఉంచామన్నారు. పోటీచేసే అభ్యర్థులు పెండింగులో ఉన్న ఆస్తి పన్ను లను పూర్తి స్థాయిలో చెల్లించాలన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల భద్రత చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

స్కూల్ బస్ బోల్తా... విద్యార్థులకు గాయాలు

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 28 : బండ్లగూడ జాగీర్ లోని ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు హైదరాబాద్ నుంచి మొయినాబాద్ వెళ్తుండగా మృగవాణి పార్కు దగ్గరకు చేరుకోగానే ముందున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బస్సు బోల్తాపడింది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు, స్థానికులు గాయపడ్డ విద్యార్థులను అంబులెన్స్ లో వెంటనే షాదన్ ఆస్పత్రికి తరలించారు . ప్రమాదం కారణంగా హైదరాబాద్‌బీజాపూర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. బోల్తా పడ్డ వాహనాన్ని జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు పోలీసులు. బస్సు ప్రమాద ఘటనతో ఆస్పత్రికి చేరుకున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. బస్సు ప్రమాదానికి గల కారణాలపై ఆరాదీస్తున్నారు

భార్యను హత్య చేసిన భర్త రిమాండ్

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, జనవరి 28: సిద్దిపేట అనుమానంతో భార్యను కత్తితో గొంతు కోసి హత్య చేసి, అడ్డొచ్చిన కూతురిపై హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలో నివాసం ఉంటున్న దున్నపోతుల ఎల్లయ్య (40) ఇంట్లో నిద్ర పోతున్న తన భార్య శ్రీలతను అనుమానంతో ఈ నెల 18న తెల్లవారుజామున కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. పక్క గదిలో ఉన్న తన కూతురు హర్షితను తలపై రోకలితో దాడి చేసి, కత్తితో మెడపై కోసి చంపడానికి ప్రయత్నించాడు. తర్వాత నిందితుడైనా ఎల్లయ్య సైతం గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 యేండ్ల జైలు శిక్ష

ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 28: గురువన్నపేటకు చెందిన ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో పోక్సో కేసు నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల జరిమానాను సిద్దిపేట 1st అడిషనల్ డిస్టిక్ & సెషన్స్ జడ్జి జయప్రసాద్ విధించారు. బుధవారం సిద్దిపేట 1st అడిషనల్ డిస్టిక్ & సెషన్స్ జడ్జి జయప్రసాద్ ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తునిపై నేరం రుజువైన నందున పై నేరస్తుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల జరిమానా విధించి అందులో నుండి రూపాయిలు 1,90,000/ బాధితురాలికి పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు విధించారు. ఈసందర్భంగా సిద్దిపేట జిల్లలోని కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటలో 29/09/2024 నిందితుడు దూదేకుల శరిఫుద్దిన్ (19) మైనర్ బాలిక ఇంట్లో ఎవరు లేని సమయం చూసి ఇంటి పక్కన ఉండే శరిఫుద్దిన్ మైనర్ బాలికపై అత్యాచారం చేశాడని బాధితురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొమురవెల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ ఎల్.రాజు కేసు నమోదు చేశారు. చేర్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ శ్రీను పరిశోధన ప్రారంభించిపై నిందితులను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్ కొరకు పంపించగా తదుపరి పరిశోధన పూర్తిచేసి నేరస్థులపై కోర్టులో చార్జిషీట్ వేశారు. ఆరోజు నుండి నేటి వరకు సిద్దిపేట 1st అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరుగగా న్యాయస్థానం బాధితురాలికి ప్రభుత్వం నుండి పది లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని సిఫార్సు చేయడం జరిగింది. పై నేరస్థునికి జైలు శిక్ష పడడానికి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యస్. ఆత్మరాములు, వై.వెంకటలింగం తన వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు అధికారి చేర్యాల సిఐ ఎల్.శ్రీను కొమురవెల్లి ఎస్ఐ ఎల్ రాజు, ప్రస్తుత ఎస్ఐ మహేష్, కోర్టు మానిటర్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే హెడ్ కానిస్టేబుల్ కిష్టయ్య, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర వహించారు. కేసు ఇన్వెస్టిగేషన్ పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు విధులు నిర్వహించే అధికారులను సిబ్బందిని అభినందించారు.

నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు అమలు

- సీపీ రష్మీ పెరుమాళ్

ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, జనవరి 28 : జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని నామినేషన్ కేంద్రాల వద్ద సీఆర్పీసీ 163 నిబంధనలు అమల్లో ఉంటాయని సీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 163 నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రతిపక్షం, దౌల్తాబాద్, జనవరి 28: ప్రమాదవశత్తు కాలుజారి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దొమ్మట గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. దొమ్మాట గ్రామానికి చెందిన బాలిగారి మల్లేశం (45) ఇటీవలే కులపోళ్ళు ఒకరు మృతి చెందడంతో కులపోళ్ళు అందరూ కలిసి దొమ్మట బొమ్మ చెరువు వద్దకు స్నానానికి వెళ్లారు.ఈ క్రమంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్నానం చేస్తున్న మల్లేశం కాలుజారి లోతు నీటిలో పడిపోవడంతో అక్కడే ఉన్నస్థానికులు గమనించి వెంటనే బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మల్లేశం మృతి చెందాడు. సమాచారం అందుకున్న దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పరిశీలించి మృతున్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. మృతుడి కూతురు , కొడుకు, భార్య, కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా ఉన్నాయి.

నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలించిన ఏఎస్పీ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 28 :-

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా మెదక్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తును జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రానికి అభ్యర్థితో పాటు ఒకరు లేదా ఇద్దరు ప్రతిపాదకులు మాత్రమే అనుమతించబడతారని తెలిపారు. అభ్యర్థులు మరియు వారి అనుచరులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను దూరంగా పార్క్ చేయాలని, గుంపులుగా రావడం, నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, మెటల్ డిటెక్టర్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.జిల్లాలో శాంతియుత, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ గారి వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఎస్ఐలు లింగం, విఠల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్స్ తుపాకులు డిపాజిట్ చేయాలి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 28:

స్థానిక సంస్థల సాధారణ (మున్సిపాలిటీ / మున్సిపల్ కార్పొరేషన్) ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు తమ ఆయుధాలను తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలని సిద్ధిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్నవారు తేదీ 31.01.2026లోపు ఆయుధాలను డిపాజిట్ చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం ఆయుధాలను తిరిగి పొందవచ్చని తెలిపారు.నిర్దేశిత గడువులోపు తుపాకులు డిపాజిట్ చేయని వారిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తగు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్న హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్ మండలాల సరిహద్దుల్లో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాటించాలని ఆమె కోరారు.

గ్రామీణ ప్రతిభకు వేదికగా క్రీడా పోటీలు

- తాసిల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో సయ్యద్ గఫూర్,ఎంఈఓ గజ్జల కనకరాజు

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 28:

గ్రామీణ ప్రతిభకు వేదిక క్రీడా పోటీలు యువతకు చక్కని అవకాశమని తాసిల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో సయ్యద్ గఫూర్, ఎంఈఓ గజ్జల కనకరాజు అన్నారు. గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన స్థానిక క్రీడాపోటీలు బుధవారం లింగరాజు పల్లి వద్ద ఎంజెపి బాలుర పాఠశాలలో ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వివిధ జట్ల క్రీడాకారులు క్రమబద్ధంగా వరుసలో నిలబడి నిర్వాహకులను, అతిథులను కలుసుకున్నారు. పోటీల ప్రారంభానికి ముందు క్రీడాకారులతో అతిథులు చేయి కలిపి అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, క్రమశిక్షణ, ఐకమత్యం, క్రీడాస్ఫూర్తే అసలైన విజయమని వారు యువతకు సూచించారు.ఈ క్రీడాపోటీల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ వంటి ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆటగాళ్ల ఉత్సాహం, ప్రేక్షకుల హర్షధ్వానాలతో మైదానం సందడిగా మారింది. ఇలాంటి పోటీలు యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ అనురాధ రమేష్, పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న, ఇన్చార్జి ఎంపీ ఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు క్రీడాకారులు, పాల్గొన్నారు

ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతర జరగాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 28 :-

తెలంగాణలోనే ప్రసిద్ధ క్షేత్రం ఏడుపాయల వరదుర్గా మాత జాతర ఎల్లలు దాటేలా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. పవిత్ర ఏడుపాయల వనదుర్గా మాత జాతరను ఘనంగా నిర్వహించాలని, జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పార్కింగ్, విద్యుత్ ,తాగునీరు బార్కెట్స్ లను ఏర్పాటు చేయాలన్నారు.జాతర పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు, చెత్త సేకరణ, బ్లీచింగ్ పౌడర్ , దోమల నివారణకు ఫాగు లాంటివి ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు.వివిధ సైన్ బోర్డులు, అంబులెన్స్, మందులు, అంటూ వ్యాధులు రాకుండా చర్యలు, కోవిడ్ 19 కు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రవాణా, బస్సులు, వాహనాలు, గజ ఈతగాళ్లు, అన్నిచోట్ల సీసీ కెమెరాలు, పోలీస్ కంట్రోల్ రూమ్, వివిధ స్టాల్స్, పకడ్బందీగా దర్శనానికి క్యూలైన్ ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక యంత్రాలు, స్వయం సహాయక మహిళల ఉత్పత్తుల కోసం ప్రత్యేక స్టాల్స్ లను ఏర్పాటు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. జాతరలో ఏ వస్తువులైన ఎక్కువ ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని, జాతరలో అమ్మే తినుబండారాలలో ఎలాంటి రంగులు కలపకుండా చూడాలని, జాతరలో 18 సంవత్సరాల వయస్సు నిండని వారికి ఎలాంటి మత్తు పదార్థాలు విక్రయించరాదన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జాతరను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఏడుపాయలకు వెళ్లి శనివారం వరకు జాతరకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 28:

జిల్లాలో జరుగుతున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026 ప్రక్రియలో భాగంగా చేర్యాల పట్టణంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని, అలాగే దుబ్బాక మున్సిపాలిటీలోని నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లాలో చేర్యాల, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపాలిటీలలో మూడు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని చెప్పారు. నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 72 వార్డులకు గాను 176 పోలింగ్ స్టేషన్లలో ఫిబ్రవరి 11న పోలింగ్, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని, నామినేషన్ అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే లోపలికి అనుమతి ఇవ్వాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

దుంపలపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంపై ఆకస్మిక తనిఖీ..

దుబ్బాక మండలం దుంపలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, సాంబారు తదితర ఆహార పదార్థాలను పరిశీలించి నాణ్యత మెరుగుపరచాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల హాజరు ప్రకారం సరుకులు కొలత మేరకు వంట చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థులకు కడుపు నిండా తినేలా సరిపడినంత భోజనం అందించాలని, ఇష్టానుసారం వడ్డిస్తే సహించేది లేదని వంట సిబ్బందిని హెచ్చరించారు. భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థులు లేవకుండా, వారి దగ్గరకే వెళ్లి వడ్డించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత గురించి అడగగా బాగుందని వారు తెలిపారు.

సీఐటీయూ యూనియన్ డైరీ ఆవిష్కరణ

ప్రతి పక్షం, దౌల్తాబాద్, జనవరి 28:

తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను దౌల్తాబాద్ సెక్షన్ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ లక్ష్మణ్, LI కిష్టయ్యగ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టీజీ ఎస్ పి డీసీ యల్ కంపెనీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామగౌని రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సీఐటీయూ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దూలం యాదగిరి గౌడ్, డివిజన్ ఉపాధ్యక్షులు నజీర్, డివిజన్ సహాయ కార్యదర్శి యాదగిరి యాదవ్, సెక్షన్ అధ్యక్షులు ఎం. పద్మనాభం పాల్గొన్నారు. అలాగే నాయకులు బుచ్చయ్య, సురేష్, కర్ణాకర్, నర్సింలు, రాజేశం (LM), శేఖర్ అప్ప (కాంట్రాక్టర్), సుభాష్, రవీందర్, అజయ్, రాకేష్, ప్రశాంత్ తదితరులు, పాల్గొన్నారు.

చిన్నరుల గుండె వ్యాధుల ఉచిత శిబిరం

- ఈ నెల 30న సత్య సాయి సంజీవని హాస్పిటలో పీడియాట్రిక్ కార్డియాక్ స్క్రీనింగ్
- ఈ శిబిరంలో అందించే అన్నివైద్య సేవలు పూర్తిగా ఉచితం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 28

సిద్దిపేట జిల్లాలోని కొండపాకలో ఉన్న శ్రీ సత్య సాయి సంజీవని చిన్నపిల్లల హృదయ సంరక్షణ మరియు పరిశోధన కేంద్రంలో ఈ నెల 30న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా పీడియాట్రిక్ కార్డియాక్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో చిన్నపిల్లల గుండె సంబంధిత వ్యాధులపై నిపుణుల ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, సలహాలు అందించబడతాయి. ఈ శిబిరంలో అందించే అన్ని వైద్య సేవలు పూర్తిగా ఉచితం. మరిన్ని వివరాలకు 80101 19000 నంబర్‌ను సంప్రదించవచ్చు. లేదా వాట్సాప్ ద్వారా 70751 37733 నంబర్‌లో సమాచారం పొందవచ్చు.

కాళేశ్వరం నీళ్లతో యాసంగి పంటకు ఊపిరి..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 28:

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా యాసంగి పంటకు నీళ్లు విడుదల కావడంతో రైతులు ఊరట పొందుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు కృషి ఫలితంగానే నేడు కాళేశ్వరం నీళ్లు పంట పొలాలకు వస్తున్నాయని బిఆర్ఎస్ నాయకులు తెలిపారు.ఇటీవల హరీష్ రావు ఇరిగేషన్ మంత్రికి లేఖ రాయడంతో అధికారులు స్పందించి యాసంగి పంటకు నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. రైతులు ప్రశ్నించేవరకు నీళ్లు విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాది రైతు ప్రభుత్వం అని చెప్పుకోవడం విడ్డూరమని విమర్శించారు. ఈ సందర్భంగా రంగనాయక సాగర్ ఏడమ కాలువ వద్ద బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు చిత్రపటాలకు చిన్నకోడూరు మండల బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, సామల మధు తదితరులు పాలాభిషేకం చేశారు.నాట్లు పూర్తయినా ఇప్పటివరకు రైతు భరోసా అందించని ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను రైతులకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కాలంతో పని లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే యాసంగి నీళ్లు వస్తున్నాయని, ఇది కెసిఆర్, హరీష్‌రావు పట్టుదలకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త శంకర్, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, వార్డ్ మెంబర్ ముత్తి మహేష్, భాను, ఏదుల రాజిరెడ్డి, సందిల కరుణాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన రణం శ్రీనివాస్ గౌడ్

ప్రతి పక్షం, దౌల్తాబాద్, జనవరి 28:

దౌల్తాబాద్ మండల పరిధిలోని మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన లాస్మయ్య బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఇటీవల తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆదరించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రణం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలు, ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని తెలిపారు. పార్టీ తరఫున బాధిత కుటుంబానికి ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్లో మందుల కొరతను వెంటనే తీర్చాలి

- ఎస్ జీపిఏటి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 28:

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వెల్నెస్ సెంటర్లో ఇటీవల వివిధ విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులోకి రావడం హర్షణీయమని, అయితే ఆ సేవలకు అనుగుణంగా అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు, ముఖ్యంగా వృద్ధాప్య దశలో ఉన్న పింఛనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ (SGPAT) సిద్దిపేట జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షులు చిల్ల నర్సింహులు, ప్రధాన కార్యదర్శి బో రెడ్డి మధుసూదన్ రెడ్డిలు ఆందోళన వ్యక్తం చేశారు.వెల్నెస్ సెంటర్‌కు వచ్చే రోగులకు వివిధ వ్యాధులకు అవసరమైన మందులు సరిపడా లేకపోవడం వల్ల వైద్య సేవల ప్రయోజనం పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైద్య సేవలకు అనుగుణంగా అన్ని రకాల అవసరమైన మందులు వెల్నెస్ సెంటర్లో అందుబాటులో ఉంచాలని కోరుతూ జిల్లా కమిటీ పక్షాన వైద్యాధికారికి మెమోరండం సమర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జోగు బిక్షపతి, రాష్ట్ర కౌన్సిలర్ జి. బన్సీలాల్‌తో పాటు జిల్లా నాయకులు నాగేందర్, భగవాన్ రెడ్డి, హనుమంత రెడ్డి, కాశీనాథ్, బాల నరసయ్య, అన్నమరెడ్డి, తిరుపతి, రవీందర్, కృష్ణమూర్తి, దయాకర్ రెడ్డి, శ్రీనివాస్, సిహెచ్. మల్లయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గపు పాలన చేస్తున్న చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర చేస్తా. 150 నియోజకవర్గాల్లో పర్యటిస్తా. చంద్రబాబు తప్పుడు పాలనను ప్రజలకు వివరిద్దాం. ప్రతి ఇంట్లో చర్చ జరిగేలా పార్టీనేతలు చొరవ చూపాలి. క్రితంసారి కొవిడ్ వల్ల పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి వచ్చింది. కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తా. ఇది నా హామీ.

- ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్

ప్రాంతీయం

దివ్యాంగుడిపై పోలీసుల అమానుష ప్రవర్తన

- దండు శంకర్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 28:

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డిపై పోలీసులు కనీస మానవత్వం లేకుండా ప్రవర్తించడం అత్యంత ఖండనీయమని దివ్యాంగుల సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా నేతలు తెలిపారు. ఈ ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడితో సమానమని సంఘం వ్యవస్థాపకులు దండు శంకర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ సమయంలో మీడియాతో మాట్లాడుతున్న సందర్భంగా "రెండు నిమిషాలు మాట్లాడుతాను" అని వాసుదేవరెడ్డి కోరినప్పటికీ పోలీసులు వినకుండా ఆయనను బలవంతంగా ఈడ్చుకెళ్లి గట్టిగా తోసివేయడంతో రోడ్డుపై పడిపోయి చేతులు, కాళ్లు, వీపుకు గాయాలయ్యాయని తెలిపారు. కిందపడిన తర్వాత కూడా కనికరం చూపకుండా పోలీసులు ఈడ్చుకెళ్లడం మరింత అమానుషమని దండు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన 2016 చట్టాన్ని పోలీసులు బహిరంగంగా ఉల్లంఘించారని అన్నారు. దివ్యాంగుల పట్ల గౌరవం, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిదేనని, అదే పోలీసు శాఖ దివ్యాంగుడిపై భౌతిక దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పుగా మారిందన్నారు. ఈ ఘటన రాజ్యాంగంలోని సమానత్వ హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ, జీవన హక్కులకు భంగం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు కట్కూరి యాదగిరి, అధ్యక్షులు చిట్టెల సంపత్, ముక్కపల్లి కనక రాజు, కస్తూరి రాజు, దుంబాల వేణు పాల్గొని బాధ్యులైన పోలీసులపై తక్షణమే కేసులు నమోదు చేసి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె

- కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలి
- ప్రజాసంఘాల జిల్లాసదస్సులోసీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 28:-

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలని,విబి జి రామ్ జి 2025,విత్తన చట్టం రద్దు కోసం దేశ వ్యాప్త ఉద్యమం చేస్తామని,మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మె మోడీ ప్రభుత్వానికి గుణపాఠం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్ లో CITU, AIAWU, AIKS, NPRD, SFI, AIDWA,వృత్తిదారుల సమన్వయ కమిటీ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12 న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం కోసం జిల్లా సదస్సు సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అయన హాజరై మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందే కార్మికులు వారి హక్కుల కోసం పోరాడి కార్మిక చట్టాలు తెచ్చుకున్నారని, అనేక త్యాగలతో ఏర్పడిన చట్టాలు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తొలగించి 4 లేబర్ కోడ్స్ రూపంలో తీసుకురావడం సిగ్గుచేటని మండిపడరు. ఇప్పటికే కేంద్రం పూర్తిగా ఆదని, అంబానీ చాకిరీ చేస్తూ దేశ సంపదను ఆపాగిస్తున్నారని అందులో భాగంగానే ఈ లేబర్ కోడ్స్ తెచ్చారని గుర్తుచేసారు. ఇప్పుడు ఉన్న పనిగంటలు మారుస్తూ 12గంటల పని చేయాలనీ కోడ్స్ చెప్తుంటే రచ్చరిక పరిపాలనగా రాబోతుందన్నారు. పరిశ్రమ కార్మికులు, రాష్ట్రవ్యాప్తరంగాలలో ఈ కోడ్స్ గత 5 ఏండ్లు నుండి అమలు చేయాలనీ చూస్తే సీఐటీయూ గా, ఇతర కార్మిక సంఘాలుగా దేశ వ్యాప్తంగా పోరాటాలు, సమ్మెలు చేయడంతో అమలు కాకుండా ఆపుతున్నారని, ఇప్పుడు రాబోయే ఫిబ్రవరి 12న సమ్మె గ్రామం నుండి ఢిల్లీ వరకు ప్రభావం చూపించాలని, కార్మికులతో పాటు రైతులకు నష్టం చేస్తూ విద్యుత్ సవరణ బిల్లు, విత్తన సవరణ బిల్లు తెస్తున్నారని, గ్రామీణ పేదలు రోజు పని చేసుకుంటూ పొట్టనింపుకుంటున్న ఉపాధి హామీ పథకాన్ని విబిజి రామ్ జీ పేరుతో పూర్తిగా తొలగించే కుట్ర చేస్తున్నారని మండిపడరు. అందుకే కార్మికులు, రైతులు, పేదలు, కూలీలు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో NPRD రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక, కార్యదర్శి బాలమణి, మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, NPRD జిల్లా కార్యదర్శి యశోద, సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, కడారి నాగరాజు, బస్వరాజు, సహాయ కార్యదర్శులు నాగేందర్ రెడ్డి, అసిఫ్, సంతోష్, NPRD జిల్లా అధ్యక్షులు ముత్యాలు,ఉపాధ్యక్షులు యాదగిరి, దుర్గ, స్వరూప, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా నాయకులు లచ్చగౌడ్లతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

మీడియా సెంటర్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 28:-

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం మెదక్ జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ను అదనపు ఎస్పీ మహేందర్, అదనపు కలెక్టర్ నగేష్ లతో కలసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లో భాగంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఆర్ ఓ బాబు రావు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే దుబ్బాక ప్రధాన కాలువకు గండి

- కాలువలు తుంగతో నిండిపోయినా పట్టించుకోరా..?
- మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

ప్రతిపక్షం,తొగుట, జనవరి 28:

ప్రజా పాలన పేర అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి విమర్శించారు. మంగళవారం రాత్రి మల్లన్నసాగర్ నుండి దుబ్బాక ప్రధాన కాలువకు నీళ్లు విడువగా కొన్ని గంటల్లోనే మండలంలోని ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్ పల్లి శివారులో కాలువకు గండి పడటంతో ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. కేసీఆర్ గారి ప్రభుత్వ హాయాంలో ఏటా కాలువలో ఉన్న తుంగను, పూడికను తొలగించి నీళ్లువిడుదల చేసేవారని, రేండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోపోవడంతో తుంగతో పాటు పూడిక నిండిపోయిందన్నారు. రాత్రి సమయంలో ఎక్కువ మోతాదులో నీళ్లు విడుదల చేయడం, తుంగ మూలంగా నీళ్లు ముందుకు వెళ్లక కాలువ మీది నుండి నీళ్లు పొర్లడంతో గండిపడటం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. కేసీఆర్ హాయాంలో మూడున్నరేళ్లలో ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు పూర్తి చేసుకొని నీటిని వదులు కోవడం జరిగిందన్నారు. ప్రజల కోసమే పనిచేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై చెరుకు శ్రీనివాస్ రెడ్డి చేసిన విమర్శలు వారికే వర్తిస్తాయన్నారు. గత రెండేళ్లుగా దుబ్బాక నియోజకవర్గంలో ఉప కాలువలు నిర్మించాలని అసెంబ్లీలో గళమెత్తడం జరిగిందని, మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెల్లడం జరిగిందన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉప కాలువలు నిర్మించాలని, ఇర్కోడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.. కేసీఆర్ హాయాంలో పంట సాగు సమయంలో రైతు బంధు పడేదని, నేడు పత్తాలేని రైతు బంధు పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గండి పడ్డ కాలువను వెంటనే పూడ్చి నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. పెద్దమాసాన్ పల్లి గ్రామానికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సర్పంచ్ పన్యాల ప్రవీణ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మా మండలంలో ప్రాజెక్టు ఉన్నప్పటికీ మా గ్రామాలకు సాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో నీటి విడుదల సరికాదని, రైతులు సకాలంలో స్పందించకపోతే పెద్ద ప్రమాదం జరిగేదన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెల్పుల స్వామి. నాయకులు నందారం వెంకటేషం గౌడ్, మధుసుధన్రెడ్డి, భాస్కర్, బోయిని రాములు, ప్రభాకర్ రెడ్డి తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

- పాల్గొన్న మండల బీజేపీ నాయకులు

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 28:

ఎంపీ రఘునందన్ రావు గారి ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మండల అధ్యక్షులు దేవుడి లావణ్య నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇందుప్రియల్, సూరంపల్లి గ్రామాల్లో సీఎం సహాయ నీది చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇందుప్రియల్ లో కాసులవాద దివ్య కు రూ.12,000, కడారి స్వామికి రూ.44,500 విలువైన చెక్కులు అందజేశారు. అలాగే సూరంపల్లిలో దాసరి పెద్ద నరసయ్య కు రూ.12,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. పేదలు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో శక్తికేంద్రం ఇంచార్జ్ గడ్డం మీ స్వామి, ఎన్ఎస్ నరసింహులు, మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బొల్లం స్వామి, బూత్ అధ్యక్షులు కుమార్, శివకుమార్ తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతోనే పేదలకు నాణ్యమైన విద్య

- ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ

ప్రతిపక్షం ప్రతినిధి ,మెదక్, జనవరి 28 :

తెలంగాణలో ప్రభుత్వ విద్యా రంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం మెదక్ పట్టణంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన 'తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ మెదక్ జిల్లా సర్వసభ్య సమావేశం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించాలని, అప్పుడే మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమవుతుందని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకు దూరంగా ఉంచి, విద్యా సంబంధం లేని పనులు అప్పగించడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కేవలం ఉపాధ్యాయుల వల్లనే కాకుండా, తల్లిదండ్రులు,ప్రజల చైతన్యం, నిరంతర పర్యవేక్షణ ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.అనంతరం ఈ సమావేశంలో కమిటీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై.అశోక్ కుమార్ రాష్ట్ర కార్యదర్శి కె. రవి చందర్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి.కొండల్ రెడ్డి లు మాట్లాడుతూ.. విద్యా రంగంలో ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న అశాస్త్రీయ ధోరణులను ఎండగట్టాలని, శాస్త్రీయ విద్యా విధానాల కోసం పోరాడాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డా. పిడి ఆనందం, జె. రాంచంద్రం, బి. ముత్యాలు, విద్యాసాగర్, రాజేందర్, హీరాలాల్, రెసిడెన్సియల్ టీచర్స్, పిడిఎస్‌యూ విద్యార్థులు, టీపీటీఎఫ్ జిల్లాకమిటి సభ్యులు, విద్యాభిమానులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా కమిటీ ఎన్నిక:

ఈ సర్వసభ్య సమావేశంలో భాగంగా మెదక్ జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యాదగిరి గౌరవ అధ్యక్షులు గా డా. పిడి ఆనందం,అసోసియేట్ అధ్యక్షులుగా సంగయ్య, ఉపాధ్యక్షులుగా రాంచంద్రం,ముత్యాలు, రాంకిషన్, భుజంగరెడ్డి, జోజప్ప, ప్రధాన కార్యదర్శిగా హీరాలాల్, అసోసియేట్ప్రధాన కార్యదర్శిగా, రాజేంద్ర ప్రసాద్ కార్యదర్శులు గా మహేష్, ఉదయ్, జీవరత్నం, విద్యా సాగర్ ఉషారాణి తదితరులు ఎన్నికయ్యారు.

పంచాక్షరి మంత్రం పరమపద సోపానం

- జాతీయ అవార్డు గ్రహీత రామరాజు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 28:

భగవంతుని సేవే మహా భాగ్యం అని ప్రతి ఒక్కరు భగవన్నామాన్ని స్మరణతోనే ముక్తి లభిస్తుందని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు అన్నారు. బుధవారం నాడు గజ్వేల్ లోని శివాలయంలో శివ మాలధారణ ధరించిన స్వాములకు భద్రాచల దేవస్థాన శ్రీరామరక్ష స్తోత్ర పారాయణ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ 41రోజుల పాటు శివదీక్ష భక్తులు కఠోరమైన దీక్ష తోపాటు శివ నామాన్ని స్మరించాలన్నారు. నమశివాయ అనే పంచాక్షరీ మంత్రాన్ని ప్రతి ఒక్కరు స్మరించి ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయం అర్చకులు మఠం శివకుమార్, మార్కండేయ దేవాలయ అర్చకులు వెనవెల్లి సతీష్, శివ భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

- హనుమకొండ చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమా కేటీఆర్?
- అవినీతి అక్రమాలకు పాల్పడిన వారు మాట్లాడటం సిగ్గుచేటు
- బీఆర్ఎస్–బీజేపీలు డిపాజిట్లు కాపాడుకోవడానికే ఆరాటం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని..

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 28

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు నిర్వహించిన మీడియా సమావేశం రాజకీయంగా తీవ్ర స్థాయిలో ద్వాజమెత్తారు. అభివృద్ధి చేయకపోవడమే కాకుండా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడుగడుగునా అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సెంట్రల్ జైలు ఎదురుగా ఉన్న కల్పత సూపర్ బజార్ సహా పలు విభాగాల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే నాయిని వెల్లడించారు. కల్పత సూపర్ మార్కెట్ ద్వారా నెలకు సుమారు రూ.1.20 లక్షల ఆదాయం వస్తుండగా, 24 నెలల్లో సుమారు రూ.28.80 లక్షల నిధులను పని చేయని వారిని చూపించి, భినామీ పేర్లతో దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ నిధులను ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ఖర్చు చేయకుండా దోచుకున్నారని మండిపడ్డారు ఎన్‌జీఓస్ కాలనీలో ఫంక్షన్లకు ప్రస్తుతం ప్రజలకు రూ.20 వేలకే సౌకర్యం కల్పిస్తున్నామని, గత పాలనలో అదే పనికి రూ.70 వేలు వసూలు చేసిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. వడ్డేపల్లి, ఎన్‌జీఓస్ కాలనీల ప్రజలు ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల పై అక్రమ నిర్మాణాలు జరిగాయని కూడా ఆరోపించారు.భద్రకాళి ఆలయానికి సంబంధించిన టెండర్ ఇంకా పూర్తికాలేదని, అయినా అవినీతి జరిగిందంటూ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 26 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేసిన ఆయన, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు డిపాజిట్లు కాపాడుకోవడానికే పరిమితమయ్యాయని వ్యాఖ్యానించారు. అల్లర్లు సృష్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలు సంఘ వ్యతిరేక చర్యలకన్నా కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. రాజకీయంగా శాశ్వత ఎమ్మెల్యేగా ఉండాలనే తాపత్రయం తనకు లేదని, ప్రజలకు జవాబుదారీగా పనిచేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఉన్న చరిత్ర, ప్రజల పట్ల ఉన్న బాధ్యతను ఇతర పార్టీలతో పోల్చలేమని అన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నాలు ఎంత జరిగినా వెనకడుగు వేయబోమని తేల్చిచెప్పారు. ఈ మీడియా సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయ శ్రీ, బ్లాక్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్, అంబేద్కర్ రాజు, అనుబంధ సంఘాల చైర్మన్లు పెరుమాండ్ల రామకృష్ణ, రాజ్ కుమార్, శ్రవణ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

“

మేడారం జాతరకు తరలివచ్చే భక్తులకు శుభాకాంక్షలు. భక్తుల కోసం ఆర్టీసీ 4 వేల బస్సులు నడుపుతోంది. అక్కా చెల్లెళ్లు ఫ్రీగా ప్రయాణించొచ్చు. బస్సులు అమ్మవారి గద్దెల ప్రాంగణం వరకు భక్తులను తీసుకెళ్తాయి. తాగునీరు, హెల్త్ క్యాంప్స్, మేడారంలో 50 ఎకరాల్లో తాత్కాలిక బస్ స్టేషన్, 9 కిలోమీటర్ల పొడవైన 50 క్యూలైన్‌లలో ఒకేసారి 20 వేల మంది ప్రయాణికులు నిలిచేలా ఏర్పాట్లు చేశాం.

- మంత్రి పొన్నం ప్రభాకర్

విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు

- కూలీల శాతాన్ని పెంచాలి : డీఆర్‌డీఓ జయదేవ్

ప్రతి పక్షం,రాయపోల్, జనవరి 28:

ఉపాధి హామీ పథక అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ హెచ్చరించారు. బుధవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా వారి జాబ్ కార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. గ్రామాల్లో నర్సరీలలో మొక్కల పెంపకానికి ఉమ్మడిగా బ్యాగ్ ఫిల్లింగ్ చేయాలని, వివిధ రకాల మొక్కలను పెంచాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కూలీల శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, కొన్ని గ్రామాల్లో కూలీల సంఖ్య తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో అందుబాటులో ఉండి ఉపాధి హామీ పథక పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో నర్సరీలతో పాటు అంతర్గత రోడ్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జయదేవ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ శివకుమార్, ఏపీఎం యాదగిరి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపటం ఎన్పీడీసీఎల్ కు గర్వకారణం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 28



అన్నారు . ఈ నెల 23 నుండి 25 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన 47వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు చెస్ పోటీల్లో తెలంగాణ ట్రాన్స్కో టీమ్ ద్వితీయ బహుమతి సాధించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ టీమ్ సభ్యులు ఎం.అనిల్ కుమార్ రెడ్డి, మేనేజర్ పి.రాజి రెడ్డి ,తమిళనాడు లో జరిగిన ఫెడరేషన్ కప్ బాల్ బ్యాడ్మింటన్ లో తృతీయ బహుమతి పొందిన జి.కిరణ్ లతో కలిసి శ్రీ నీలం జగన్నాథ్ , తెలంగాణ ట్రాన్స్కో స్పోర్ట్స్ ఆఫీసర్ బుధవారం హన్మకొండ, నక్కలగుట్టలోని విద్యుత్ భవన్లో సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి గారు మాట్లాడుతూ ద్వితీయ స్థానంలో గెలుపొందిన మొగిలి అనిల్ కుమార్ రెడ్డిని, తమిళనాడు లో జరిగిన ఫెడరేషన్ కప్ బాల్ బ్యాడ్మింటన్ లో తృతీయ బహుమతి పొందిన జి.కిరణ్ లను అభినందిస్తూ జాతీయ స్థాయిలో ప్రతిభ చూపటం ఎన్పీడీసీఎల్ కు గర్వకారణం అని అన్నారు . ఎన్పీడీసీఎల్ సంస్థ క్రీడలకు పెద్దపీట వేస్తుందని , ఉత్సహవంతులను ప్రోత్సహిస్తుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రాన్సకో స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీ నీలం జగన్నాథ్,వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ మెంబర్ ప్రేమ్ , మేనేజర్ పి.రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

- ఎన్నికల విధులను పక్కాగా నిర్వహించాలని అధికారులకు దిశా నిర్దేశం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 28 :

ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని కంటేశ్వర్ మున్సిపల్ జోన్ ఆఫీసు, టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారంలు, రిజిస్టర్లను పరిశీలించారు. అదేవిధంగా కామారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ గా కొనసాగుతున్న నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి రోజు ఆయా డివిజన్లు, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకుని, వెంటవెంటనే రోజు వారీగా టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని సూచించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు సంబంధిత మున్సిపాలిటీ పరిధిలోని ఏదైనా డివిజన్/వార్డులో ఓటరుగా నమోదై ఉండవచ్చని సూచించారు. అయితే ప్రతిపాదకులు (ప్రపోజర్స్) మాత్రం అదే డివిజన్/వార్డు కు చెందిన ఓటరు అయి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచామని, నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామని అన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఎవరు కూడా ఎలాంటి అపోహలు, సందేహాలకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులు ఉన్నారు.

సమ్మక్క సారలమ్మ కృపతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బంధంకొమ్ము లో ఘనంగా ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతర

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 28 :

సమ్మక్క సారలమ్మల కృపతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.

అమీన్పూర్ డివిజన్ పరిధిలోని బంధం కొమ్ములో గల సమ్మక్క సారలమ్మ జాతరలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనం పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం వెళ్లలేని భక్తుల కోసం బంధం కొమ్ములో స్వయం భూగ వెలసిన అమ్మవార్లకు ప్రత్యేక గద్దెలు నిర్మించి గత రెండు దశాబ్దాలుగా సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 28:

గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఐఓసీలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కోసం చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హైమావతి మరియు జిల్లా మునిసిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ క్షేత్రస్థాయిలో వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలో గల 20 వార్డులకు సంబంధించి ఐఓసీలో నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికల ప్రక్రియను స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలని గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ ను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి పిర్యాదులు చేయాలన్న 9014192463 ఫోన్ నంబర్ సంప్రదించాలని వారు తెలిపారు.

రసాయన శాస్త్రంలో ఎస్.డి.భవానీకి పీహెచ్.డీ.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 28 :

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ఎస్.డి.భవానీ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'గాడోలియనండోప్ చేయబడిన నికెల్ ఫెర్రైట్ నానోపార్టికల్స్ యొక్క లక్షణాలపై భస్మీకరణ ఉష్ణోగ్రత, కూర్పు యొక్క ప్రభావం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.పూర్ణచంద్రరావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ భవానీ అధ్యయనం, సోల్ జెల్ ఆటోదహన పద్ధతిని ఉపయోగించి జీడీడోప్డ్ నికెల్ ఫెర్రైట్ నానోపార్టికల్స్ యొక్క సంశ్లేషణ, లక్షణాలను అన్వేషించినట్టు తెలియజేశారు. వాటి నిర్మాణ, క్రియాత్మక లక్షణాలపై కాల్సినేషన్ ఉష్ణోగ్రత ప్రభావాన్ని పరిశీలించామన్నారు. ఈ పరిశోధన ఫలితాలు అధికఫ్రీక్వెన్సీ ఎలక్ట్రానిక్స్, మాగ్నెటిక్ పరికరాలు, ఈఎంఐ షీల్డింగ్, మైక్రోవేవ్ టెక్నాలజీలలో అనువర్తనాల కోసం ఈ నానో మెటీరియళ్ల సామర్థ్యాన్ని హైలైట్ చేస్తాయని తెలిపారు. డాక్టర్ భవానీ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే మా ప్రాధాన్యత

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- మూడు కోట్ల 30 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..
- 30 లక్షల రూపాయల సొంత నిధులతో షాపింగ్ కాంప్లెక్స్..

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 28 :

నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు డివిజన్ సమగ్ర అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో మూడు కోట్ల 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులకు బుధవారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న పటాన్చెరు డివిజన్, జేపీ కాలనీ డివిజన్ల పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి పారదర్శకతతో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా సిసి రోడ్లు, యూజీడిలు, పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

30 లక్షల రూపాయల సొంత నిధులతో షాపింగ్ కాంప్లెక్స్..

పటాన్చెరు డివిజన్ పరిధిలోని చోటి మసీద్ కమిటీ ఆధ్వర్యంలో గల స్థలంలో 30 లక్షల రూపాయల సొంత నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఎల్లప్పుడూ తాను ముందుంటానని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావడం జరుగుతుందని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్ కిరాయిల ద్వారా మసీదు నిర్వహణకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పట్టణ పుర ప్రముఖులు, మైనార్టీ మత పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలను కలిసిన జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 28:

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026 ప్రక్రియలో భాగంగా బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపాలిటీ ఎన్నికల సాధారణ పరిశీలకులు అయేషా మస్రత్ ఖాన్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లాలోని చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ మున్సిపాలిటీల లో జరగనున్న ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు.

విద్యారంగ అభివృద్ధికి ఇది ఒక ఆదర్శం

- విద్యార్థులకు లాప్ ట్యాప్ లు అందజేసిన అక్షయ విద్య ఫౌండేషన్ ను అభినందించిన తెలంగాణ గవర్నర్ విష్ణు దేవ్ వర్మ.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 28 :

తెలంగాణ లోక్ భవన్‌లో రిమినీ స్ట్రీట్ కంపెనీ స్పాన్సర్ చేసిన 50 ల్యాప్‌టాప్‌లను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అక్షయ విద్య ఫౌండేషన్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్షయ విద్య ఫౌండేషన్ ఫౌండర్ & వైస్ ప్రెసిడెంట్ టెంటు వర ప్రసాద్, ట్రస్టీ జనార్దన్ చైర్మన్ జై వివేక్ ఆనంద్, రిమినీ స్ట్రీట్ ఎండీ నారాయణ మూర్తి మల్లవరపు తో పాటు డోనార్స్, ప్రముఖులు పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో పటాన్ చెరు పట్టణంలోని శ్రీ సాయి గణేష్ కాలనీ వేటూ ఎక్స్పెర్ట్స్ ఫౌండర్ కొడాలి సునీల్ ఒక లక్ష రూపాయలు చెక్ గవర్నర్ చేతులు మీదగా అక్షయ విద్య ఫౌండేషన్ కి అందజేశారు ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగిస్తు విద్యార్థులకు డిజిటల్ వనరులు అందించడం వారి భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో విద్యారంగ అభివృద్ధికి ఇది ఒక ఆదర్శంగా నిలిచిందని అక్షయ విద్య ఫౌండేషన్ నిర్వాకులను అభినందించారు.

కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమస్యలపై అధికారులకు వినతిపత్రం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 28:

కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కాలనీ ప్రతినిధుల బృందం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల జరిగిన వార్డు విభజన సమావేశానికి కొనసాగింపుగా ఈ భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీని ప్రత్యేక వార్డుగా ప్రకటించాలని, భూగర్భ మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని, నీటి సరఫరా మెరుగుపరచాలని కోరారు. అలాగే ఎస్సై స్థాయి అధికారితో కూడిన పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్మశాన వాటిక, ఫంక్షన్ హాల్, బస్ స్టాప్ నిర్మాణంతో పాటు నర్సాపూర్ రోడ్ వెడల్పు చేయాలని, రాజీదారిపై ఉన్న అనవసరపు దారిని మూసివేయాలని డిమాండ్ చేశారు.కాలనీ వాసుల విన్నపాలకు అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు, కాలనీకి ప్రత్యేక గుర్తింపు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దొంతుల సురేష్, నీలం రమేష్, గద్దమీద యాదగిరి, కారం కంటి సాయి, గోషిక దత్తాత్రి, కరీం, జాంగిర్, ఆంజనేయులు, పథకం నాగరాజ్, నదీమ్, నాగరాజు, సద్దాం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలు

- ప్రభుత్వంపై భారం లేకుండా సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం.
- భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం. --- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ & సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 28 :

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను పూర్తిగా పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక సంస్కరణలు అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల కాంప్లెక్స్‌కు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ & స్టాంప్స్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతంగా, అత్యాధునిక సదుపాయాలతో, కార్పొరేట్ స్థాయి ప్రమాణాలతో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా నిర్మిస్తున్నామన్నారు. మొదటి విడతగా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోపల ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఇంటిగ్రేటెడ్ కార్యాలయములో 11 క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్ణయించామని తెలిపారు . అందులో భాగంగా నేడు సంగారెడ్డి జిల్లా కర్దనూర్‌లో శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. దీనికి సుమారు మూడు ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందన్నారు. 20వేల ఎస్ఎఫ్టీలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై భారం పడకుండా ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో రాజ్ పుష్ప ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాబోయే ఆరు నెలల్లో అధునాతన హంగులతో భవన నిర్మాణం పూర్తి చేయాలని సూచించినట్లు చెప్పారు. అలాగే కనీసం ఐదేళ్ల పాటు ఆయా భవనాల నిర్వహణ బాధ్యత కూడా నిర్మాణ సంస్థలదే ఉండేలా నిబంధనలు పొందుపరిచామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలోకొత్తగా పెళ్లి రిజిస్ట్రేషన్‌కు వచ్చే జంటలకు ,చిన్న పిల్లలతో వచ్చే తల్లులకు, దివ్యాంగులకు వయోవృద్ధులకు,పేద ప్రజలకుఅవసరమైన అన్ని అధునాతన హంగులతో ఫైవ్ స్టార్ వసతులతో, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సామాన్య ప్రజలకు అందుబాటులో తేనున్నామని తెలిపారు. భవిష్యత్తులో అన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు శంకుస్థాపనలు చేసి, పూర్తి హంగులతో భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి పటాన్‌చెరు పారిశ్రామిక హబ్‌గా మారిందని చెప్పారు. గౌరవ ముఖ్యమంత్రి గారు దావోస్ పర్యటనలో 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. దేశాన్ని ప్రపంచంలో మూడో స్థానానికి తీసుకురావాలంటే భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయీమ్, జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లు , ఆర్డీఓ, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి , రాజ పుష్ప ఇంఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి ,రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 28:

ఎస్సీ సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న ప్రీమెట్రిక్ విద్యార్థుల స్కాలర్షిప్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎస్సీ సంక్షేమ వసతి గృహాల సంక్షేమ అధికారులు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ స్కాలర్‌షిప్‌ల స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ హాస్టళ్లలో చదువుతున్న 863 మంది ప్రీమెట్రిక్ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేకపోవడం వల్ల పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఎన్ఐసి సహకారంతో ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసి, విద్యార్థులు చదువుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టళ్ల సంక్షేమ అధికారులు సమన్వయంతో బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి హమీద్, మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్సీ వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు

దేశం వికసిత్ భారత్ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. గత పదేళ్లలో భారత్ అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. నాలుగు కోట్ల పక్కా ఇళ్లు నిర్మించాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. 10 కోట్ల మందికి ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చాం.

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ప్రాంతీయం

జైలుకైనా జరిమానికైనా సిద్ధం కానీ 'మందు' మానేడం లేదు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 28:

ప్రతిరోజు పట్టణ కేంద్రాల్లో, ప్రధాన రహదారి కూడలిలో అటు ట్రాఫిక్, ఇటు పోలీస్ అధికారులు నిర్వహిస్తున్న బ్రీత్ ఎనలైజర్ డ్రంక్ అండ్ డ్రైవింగ్ పరీక్షల్లో దొరికి జైలు శిక్షకైనా జరిమానా కైనా సిద్ధపడుతున్నారు తప్ప మద్యాన్ని నియంత్రించడంలో వ్యక్తులు నిఫలమదుగుతున్నారు. వివరాల్లోకి వెళితే గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో చిక్కి జైలుకైనా జరిమానా కైనా సిద్ధపడుతున్న తీరు ప్రత్యక్ష సాక్షంగా చూడొచ్చు. ప్రతిరోజు గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి తమ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రీత్ ఎనలైజర్ టెస్టుల్లో వద్దలాదిమంది మద్యం సేవించి పోలీసులకు చిక్కిన తీరులో మాత్రం మార్పు రాకపోవడం శోచనీయం. దీనిపై పోలీస్ శాఖ వారు పలుమార్లు హెచ్చరించిన ప్రకటనలతో సూచికలు ఏర్పాటు చేసిన వాహనదారుల వ్యవహార శైలిలో మాత్రం మార్పు రాకపోవడం విచారకరం. ఆయన ప్రజలలో మార్పు వస్తుందని పోలీసు శాఖ వారు ప్రయత్నించడం అభినందనీయం.

మీనాక్షి నటరాజన్‌కు ఘన స్వాగతం

- **ఉపాధి హామీ కార్మికులతో నముఖాముఖి -**

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్ జనవరి 28:

ముంజంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం కరీంనగర్‌కు విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ఘన స్వాగతం లభించింది. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావులకు ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ వద్ద పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అగ్రనేతలకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా స్వాగతించారు. అలాగే ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బండారి రమేశ్, ఒగ్గు దామోదర్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, మామిడి అనిల్ కుమార్, కర్ర సత్యప్రసన్నారెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, జ్యోతి, కె. పద్మ, సిహెచ్. పద్మ, గూడెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొని అగ్రనేతలకు ఘన స్వాగతం పలికారు. ఉపాధి హామీ కార్మికులతో జరగనున్న ముఖాముఖి కార్యక్రమం విజయవంతం కావాలని నేతలు ఆకాంక్షించారు.

హుస్నాబాద్' మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం..

- **పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్**

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, హుస్నాబాద్

హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ హాజరైనారు. బిఆర్ఎస్,బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరిన హుస్నాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనితారెడ్డి,ఇతర ముఖ్య నేతలు మున్సిపల్ చైర్మన్ ,వైస్ చైర్మన్ లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోహెడ మండలం నారాయణపూర్ గ్రామ సర్పంచ్ హరిపుష్పలత అశోక్, బత్తులవాని గ్రామ సర్పంచ్ బత్తుల రాములు , పరివేద గ్రామం నుండి ఉప సర్పంచ్ పొన్నం బాలయ్య కోహెడ మండల బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఖాతా వినయ్ ,బీఎస్పీ కోహెడ మండల అధ్యక్షులు ఖాతా శ్రీకాంత్ , ఇతర ముఖ్య నాయకులు అందే శ్రీనివాస్ ,అందే రాజేష్, పొన్న రాజయ్య, సాయిని బాలమల్లు , సాధనవేణి బాలయ్య ఇతర బిఆర్ఎస్ ,బీజేపీ కి చెందిన వందలాది మంది కార్యకర్తలు పార్టీలో చేరారు.

మున్సిపల్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించండి

- **సిపిఎం**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 28:

ముకుందలాల్ మిశ్రా భవన్ లో సిపిఎం నగర కమిటీ సమావేశం కనకరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన నగర కార్యదర్శి గుడికందుల సత్యం మాట్లాడుతూ కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించాలని అన్నారు. ఎంపీ,కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి ఏమాత్రం ప్రయత్నం చేయలేదని కేవలం కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు 3 సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసి పాలాభిషేకం చేసుకొని చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో రోడ్లు పార్కింగ్ స్థలాలు సరిగా లేక నగరవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని ఇవన్నీ పట్టించుకోకుండా ప్రయాణికులపై చాలాన్లు వేస్తూ ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు.నగరంలోని 9,18,24,29 డివిజన్ లలో పోటీ చేస్తామని మిగతా సీపీఐ, వామపక్షాలు పోటీ చేస్తున్న చోట్ల వామపక్షాలకు మద్దతిస్తామని, వామపక్షాలు పోటీ చేయని స్థానాలలో ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నగర కమిటీ సభ్యులు విజయ్, పుల్లెలమల్లయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గాయత్రి సహిత విశ్వకర్మ దేవాలయ 10వ వార్షికోత్సవం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 28:

సిద్దిపేట పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీలో గల గాయత్రి సహిత విశ్వకర్మ దేవాలయ 10వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి విశ్వకర్మ దేవతామూర్తులకు అభిషేకం, పుష్పార్చన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం శ్రీ లక్ష్మీ గణపతి, గాయత్రి విశ్వకర్మ ఆవాహిత సర్వదేవతా హోమం, మహాపూర్ణాహుతి, శిఖరాభిషేకం, తీర్థప్రసాద వితరణ, వేదమంత్ర మహాదాశీర్వచనాలు వేదపండితులచే నిర్వహించబడ్డాయి. అనంతరం అన్నప్రసాద వితరణ జరగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు యాదగిరి చారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చారి, కోశాధికారి నర్సింహా చారి, శ్రీ విశ్వబ్రాహ్మణ పోచమ్మ సంఘం అధ్యక్షుడు మట్రోజు శ్రీనివాస్ చారి, మంజు బాలయ్య, మహీందర్, సలహాదారు స్వాముల వల్లి శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయం

- **మంత్రి శ్రీధర్ బాబు**

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్:జనవరి 28:

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయడమే తమ ఏకైక లక్ష్యమని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కరీంనగర్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ద్వారా ఇప్పటికే పలుమార్లు సర్వేలు నిర్వహించామని తెలిపారు. కార్యకర్తలందరినీ సమన్వయం చేస్తూ, గెలిచే అభ్యర్థుల ఎంపికలో పార్టీ నాయకత్వం ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్తుందని చెప్పారు.గత మున్సిపల్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఆరోపించిన ఆయన, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, అల్లూరి లక్ష్మణ్ కుమార్, తనకు ఒకటే అభిలాష ఉందని—అది కాంగ్రెస్‌ను నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయడమేనన్నారు. పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి రాష్ట్రవ్యాప్తంగా నాయకులు కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని, ఇది పార్టీ బలాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను తప్పనిసరిగా గెలిపించాలని పార్టీ మిత్రులు, కార్యకర్తలను కోరారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అధిష్ఠానానికి కార్యకర్తలే బలం: తుమ్మల నాగేశ్వరరావు *

ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తనకు సుదీర్ఘమైన రాజకీయ అనుభవం ఉందని, రాష్ట్ర రాజకీయాలపై పూర్తి అవగాహనతో పనిచేస్తున్నామని తెలిపారు. సోనియా గాంధీ ఆకాంక్షల మేరకు తెలంగాణ ప్రజల ఆశలు నెరవేర్చిన జిల్లాల్లో కరీంనగర్ జిల్లా ముందుందని అన్నారు. సీఎంసీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుచుకుని అధికారాన్ని చేపట్టిందని గుర్తుచేశారు. టీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి దెబ్బతిందని విమర్శించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 70 శాతం మంది కాంగ్రెస్ కార్యకర్తలు విజయం సాధించారని, ఇది పార్టీ బలానికి నిదర్శనమని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు నామినేటెడ్ పదవుల ద్వారా న్యాయం చేయాల్సిన బాధ్యత జిల్లా నాయకత్వంపై ఉందన్నారు. వ్యవసాయ, భౌగోళికంగా ప్రాధాన్యత కలిగిన కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ఇప్పటివరకు ఎవరూ అభ్యర్థుల పేర్లను సూచించలేదని, దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పార్టీ పరిశీలిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగానే పార్టీ నిర్ణయాలు ఉంటాయని, వారి కష్టానికి తగిన ఫలితం దక్కేలా అధిష్ఠానం కృషి చేస్తుందని తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమం లో జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే లు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో మొదలైన నామినేషన్ ప్రక్రియ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, జనవరి 28:

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియక కొనసాగనుంది. 28నుండి 30వరకు నగరపాలక సంస్థ ప్రధాన భవనం తో పాటు నూతన రెవెన్యూ భవనం లో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుంది. ప్రధాన భవనం మొదటి అంతస్తులో 1 వ డివిజన్ నుండి 12 వ డివిజన్ రిటర్నింగ్ అధికారుల రూములను కేటాయించడం జరిగింది... సంబంధిత డివిజన్ల నామినేషన్లు అక్కడే స్వీకరించడం జరుగుతుంది. 13 వ డివిజన్ నుండి 34 డివిజన్ల రిటర్నింగ్ అధికారుల రూంములను రెండో అంతస్థులో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుంది. అంతే కాకుండా నూతన రెవెన్యూ భవనం గ్రౌండ్ ఫ్లోర్ లో 35 డివిజన్ నుండి 50 డివిజన్ల రిటర్నింగ్ అధికారుల రూంలను కేటాయించడం జరిగింది... సంబంధిత రూంలలో సంబంధిత డివిజన్ల నామినేషన్లు స్వీకరించడం జరుగుతుంది. 51 వ డివిజన్ నుండి 66 వ డివిజన్ వరకు రెవెన్యూ భవనం మొదటి అంతస్తు లో రిటర్నింగ్ అధికారుల రూంలను కేటాయించడం జరిగింది... సంబంధిత రూంలలో సంబంధిత డివిజన్ల నామినేషన్లు స్వీకరించడం జరుగుతుంది

`పారదర్శకంగా నగరపాలక సంస్థ ఎన్నికలు `*

కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మొత్తం 66 డివిజన్లకు 33 ఆర్వో రూములను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. నగరపాలక సంస్థ పాత భవనంతో పాటు నూతన రెవెన్యూ భవనంలో నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఆర్వో రూంలో కంప్యూటర్, ప్రింటర్ తో పాటు అవసరమైన ఫర్నిచర్, ట్రంక్ బాక్స్ లు, సీసీ కెమెరాల ఏర్పాటు, ఆర్వో నిబంధనల మెటీరియల్, స్టేషనరీ ఇతర సామాగ్రి సిద్ధం చేసినట్లు తెలిపారు. 28 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు జరిగే నామినేషన్ ప్రక్రియలో మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున నగరపాలక సంస్థ ఆవరణలోకి ఒక వాహనాన్ని మాత్రమే అనుమతించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి తో పాటు ఇద్దరు వ్యక్తులను మాత్రమే అనుమతించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి కౌంటింగ్ ప్రక్రియ వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీస్ పకడ్బందీ మధ్య ఎన్నికల నిర్వహణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

నగర అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలి

- **మాజీమంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ జనవరి 28:

నగర అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని మాజీమంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు.కరీంనగర్ నగరంలోని ఐదవ డివిజన్ బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించి ..రాబోవు నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఐదవ డివిజన్ పార్టీ అభ్యర్థి గాదె రూప శ్రీనివాస్ లను భారీ మెజారిటీతో గెలిపించాలని డివిజన్ ప్రజలను వారు కోరారు. పార్టీ డివిజన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే గంగులకు ఐదవ డివిజన్ పార్టీ అభ్యర్థి గాదె రూప శ్రీనివాస్ లతోపాటు డివిజన్ వాసులు ఘన స్వాగతం పలికారు. మొదటగా పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన వారు. అనంతరం డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని.. రాబోవు రోజుల్లో నగరాన్ని అభివృద్ధి చేసేది కూడా బిఆర్ఎస్ పార్టీయే అన్నారు.ఈ రెండేళ్ల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నగరానికి రెండు రూపాయల కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో దుర్షేడ్,గోపాలపూర్, బొమ్మకల్ ఈ ఐదు ఆరు ఏడు డివిజన్లకు సంబంధించి మెజార్టీ ఇచ్చారని... ప్రస్తుత ఎన్నికల్లో కూడా భారీ మెజార్టీ ఇచ్చి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు.. ఐదవ డివిజన్ పార్టీ అభ్యర్థి గాదే రూప శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ నగరశాఖ అధ్యక్షులు చల్లా హరిశంకర్, మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి, కరీంనగర్ రూరల్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, డివిజన్ నాయకులు సుంకిశాల సంపత్ రావు, మాజీ కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్ రావు, నాయకులు వెంగల్ దాస్ శ్రీనివాస్, తోట కిరణ్, కాల్వ అశోక్, గోనె నరసయ్య, శ్రీకాంత్, కిరణ్ కుమార్, ఈశ్వర్, లచ్చన్న, సందీప్, అజయ్ గౌడ్, సాయి, కృష్ణ, నాగరాజు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

*** `బిఆర్ఎస్ నాయకులు తోట మధు `***

11వ డివిజన్ కు చెందిన బి ఆర్ ఎస్ నాయకులు తోట మధు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిట్టల శ్రీనివాస్, వారి సతీమణి లావణ్య తో పాటు సుమారు 20 మంది బిఆరఎస్ పార్టీలో చేరారు వీరితోపాటు 42వ డివిజన్ కు చెందిన అజయ్ పటేల్ వారి అనుచరులతో కలిసి పార్టీలో జాయిన్ చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్. ఈ కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. మీరు వెంట టిఆరఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్ , తోట మధు, మీర్ సౌకత్ అలీ,నవాజ్ హుస్సేన్, సూర్య శేఖర్, నవీన్ మీడిదొడ్డి, తదితరులు ఉన్నారు

దుబ్బాక మున్సిపాలిటీలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 28:

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు 2026 ప్రక్రియలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చేర్యాల పట్టణంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పురపాలక సంఘం , దుబ్బాక మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన నామినేషన్ ప్రక్రియను ను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ..... మునిసిపాలిటీ ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. మన జిల్లాలో చేర్యాల, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపాలిటీలో బుధవారం నుండి 3 రోజుల పాటు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆయా మున్సిపల్ సెంటర్ లో నామినేషన్ స్వీకరించడం జరుగుతుందన్నారు. 4 మున్సిపాలిటీల్లో 72 వార్డులలో 176 పోలింగ్ స్టేషన్ లలో ఫిబ్రవరి 11 వ తేదీన పోలింగ్, 13 వ తేదీన కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం సెంటర్ చుట్టు 100 మీటర్లలో 144 సెక్షన్ అమలుతో పాటు నామిని అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి పంపించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. నామిని అభ్యర్థి సెంటర్ కి వచ్చిన సమయం నుండి నామినేషన్ వేసి బయటికి వెళ్ళే సమయాన్ని నోట్ చేసుకుని మొత్తం ప్రక్రియను వీడియో తీయించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. నామినేషన్ సెంటర్ లో ఫోన్ అనుమతి లేదని అన్ని సెంటర్లలో 100 శాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని తెలిపారు.కలెక్టర్ వెంట దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, తహశీల్దార్ సంజీవ్ కుమార్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజన ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 28:

దుబ్బాక మండలం దుంపలపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న బోజన ప్రక్రియను బుధవారం జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, సాంబారు పరిశీలించారు. కూర నాణ్యత మెరుగుపరచాలని విద్యార్థులకు రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల హాజరు ప్రకారం వంట సరుకులు కొలత ప్రకారం వంట చేసేలా మానిటర్ చెయ్యాలని టీచర్లను ఆదేశించారు. విద్యార్థులకు కడుపు నిండా తినేలా సరిపడినంత అన్నం కూరలు పెట్టాలని మీ ఇష్టానుసారం పెడితే సహించేది లేదని వంట సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థులకు మరల అన్నం, కూరలను వారు కూర్చున్న వద్దకు వెళ్లి వడ్డించాలి వంట సిబ్బందిని ఆదేశించారు. భోజనం చేస్తున్నపుడు విద్యార్థులు లేవకూడదని తెలిపారు. విద్యార్థుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. భోజనం ఎలా ఉంది రోజు ఎలా పెడుతున్నారని అడగ్గా బాగానే ఉందని విద్యార్థులు కలెక్టర్ కి తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఒక్క మెతుకు కింద పడకుండా శుభ్రంగా నెమ్మదిగా తినాలని విద్యార్థులకు సూచించారు. డైనింగ్ హాల్, పాఠశాల పరిసరాలు చెత్త లేకుండా శుభ్రంగా ఉంచాలని స్కావెంజర్ ను ఆదేశించారు. విద్యార్థులకు భోజనం చదువు విషయం లో రాజీ పడవద్దని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు.అంతకుముందు ప్రాంగణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో మధ్యాహ్న బోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆహార పదార్థాలను తనికి చేసి మంచి ఆహారం అందించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. పిల్లలు చాలా ముద్దుగా ఉన్నారని బాగా తిని ఆడుకోవాలని సూచించారు.

ప్రజా సేవ కోసమే వస్తున్నా ఆశీర్వదించండి

- **14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి**

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 28 :

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల కోలాహలం మొదలైంది. ఇందులో భాగంగా బుధవారం నాడు 14వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా గుంటుకు శిరీష రాజు తన నామినేషన్‌ను దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు, వార్డు నాయకులు మరియు ప్రజలతో కలిసి స్థానిక సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఐఓసీ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీసర్‌కు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గుంటుకు శిరీష రాజు మాట్లాడుతూ గతంలో వార్డు ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించి కౌన్సిలర్‌గా గెలిపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డు అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. చేసిన అభివృద్ధిని చూసి, ప్రజా సేవ కోసం మళ్ళీ మీ ముందుకు వస్తున్నామన్నారు. వార్డు ప్రజలు మరోసారి మమ్మల్ని ఆశీర్వదించి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

"

ఇండియా-, ఈయూ మధ్య కుదిరిన డీల్‌లోని కొన్ని అంశాలు చదివాను. ఇండియాకు అనుకూలంగా కనిపిస్తోంది. యురోపియన్ మార్కెట్లో విస్తృత అవకాశాలు దక్కుతాయి. డీల్ అమల్లోకి వచ్చాక ఆ దేశానికి గొప్ప విజయంగా నిలవబోతోంది. భారత వర్కర్లు యూరప్‌కు వెళ్లేందుకు అవకాశాలు దక్కుతాయి.

- యూఎస్ ట్రేడ్ ప్రతినిధి జెమీసన్ గ్రీర్

దక్షిణాదికి బీజేపీ కోఆర్డినేటర్‌గా జీవీఎల్

బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు కీలక బాధ్యతలు అప్పగించింది భారతీయ జనతా పార్టీ.. దక్షిణాది రాష్ట్రాల్లో కేంద్ర బడ్జెట్ ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణాది రాష్ట్రాల బీజేపీ "సమన్వయకర్త" (కోఆర్డినేటర్)గా రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును కేంద్ర నాయకత్వం నియమించింది. కేంద్ర బడ్జెట్ లో దక్షిణాది రాష్ట్రాలకు జరిగిన కేటాయింపులు, వాటి వల్ల వివిధ సామాజిక వర్గాలకు కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతలను జీవీఎల్ కు బీజేపీ అప్పగించింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు ఒనగూడే ప్రయోజనాలను వివరించే కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నాయకత్వం ఆయనకు నిర్దేశించింది. అంటే, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ సమన్వయకర్తగా జీవీఎల్ నరసింహారావు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ విభాగాలను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ప్రజలకు బడ్జెట్ అంశాలను వివరించే కీలక పాత్రను ఆయన పోషించనున్నారు. ప్రత్యేకంగా తెలంగాణలో జరగనున్న పట్టణ, నగర పాలక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి జరిగిన కేటాయింపులు, వివిధ సామాజిక వర్గాలకు కలిగే లాభాలపై విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి దక్షిణాది రాష్ట్రాల వ్యాప్తంగా బడ్జెట్ పై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలకు జీవీఎల్ సారథ్యం వహించనున్నారు. పట్టణాలు, నగరాల్లోని వివిధ వర్గాలతో సమావేశాలు, చర్చా వేదికల ద్వారా బడ్జెట్‌లోని ప్రధాన అంశాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, రైతాంగానికి మద్దతు వంటి అంశాలను ప్రజలకు వివరించనున్నారు.



రన్‌వే కనిపించకపోవడంతోనే విమానం కుప్పకూలింది

బారామతిలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి ఉదయం 8.10 గంటలకు పవార్ ముంబై నుంచి విమానంలో బయల్దేరారు. 8.30 గంటల సమయంలో విమానం ల్యాండ్ చేయడానికి పైలట్లు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే క్లియరెన్స్ కోసం బారామతి ఏటీసీ అధికారులను సంప్రదించారు. అయితే, ఎయిర్‌పోర్ట్‌లో విజిబులిటీ చాలా తక్కువగా ఉండటంతో.. 'రన్‌వే కనిపిస్తుందా? లేదా??' అని పైలట్లను బారామతి ఏటీసీ అధికారులు అడిగారు. ఏటీసీ ప్రశ్నకు.. కనిపించడంలేదని పైలట్లు సమాధానమిచ్చారు. దీంతో క్లియరెన్స్ రాలేదని, ఈ క్రమంలో విమానం గాల్లో కొంతసేపు చక్కర్లు కొట్టినట్టు మంత్రి వివరించారు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో రన్‌వే కనిపిస్తుందా? అని ఏటీసీ అధికారుల ప్రశ్నకు పైలట్లు సానుకూలంగా స్పందించడంతో క్లియరెన్స్ ఇచ్చారని తెలిపారు. ఈ క్రమంలో ఉదయం 8.42 గంటల సమయంలో ల్యాండింగ్‌కు పైలట్లు ప్రయత్నించగా.. విజిబులిటీ సమస్యలతోపాటు నియంత్రణ కోల్పోవడంతో రన్‌వేకు దగ్గరగా ఉన్న ఓ బండ రాయికి ఢీకొని 8.48గంటల ప్రాంతంలో పెద్ద మంటతో విమానం కూలిపోయినట్టు సమాచారం. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే ముందు గో ఎరౌండ్ పాటించారని, ఈ సమయంలో పైలట్ల నుంచి ఆపదలో ఉన్నట్టు తెలియజేసే ఎలాంటి మేడే కాల్స్ రాలేదని డీజీసీఏ వర్గాలు తెలిపాయి.

పావురాలతో ముప్పు నిజమేనా?

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

రెండు సంవత్సరాల క్రితం ఒక వర్ధమాన నటి భర్త మరణించిన సమయంలో ఓ వార్త బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. ఆయన మరణానికి పావురాలే కారణమని వార్తా కథనాలు అప్పట్లో వెల్లువడ్డాయి. వారు నివసించే ఇంటికి సమీపంలో చాలా పావురాలు ఉంటాయని.. వాటి వ్యర్థాలు కలిసిన గాలి పీలుస్తుండటంతో ఇంట్లో అందరి లంగ్స్‌కు ఇన్ఫెక్షన్ సోకిందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇదే కాక హైదరాబాద్ సుల్తాన్‌బజార్ సమీపంలోని ఓ కబూతర్ ఖానాను (పావురాలకు దాణా వేసే ప్రాంతం) మూసేశారు. పావురాల వల్ల ఆ పరిసరాల్లోని ప్రజలకు శ్వాస సమస్యలు, అలర్జీలు రావడమే దీనికి కారణం. ఇదిలా ఉంటే నిజంగానే పక్షుల కారణంగా మనుషులకు వ్యాధులు వస్తాయా అంటే అవును అని కొన్ని అధ్యయనాలు వల్ల మనకు తెలుస్తుంది. మన దేశ చరిత్రలో భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరు చెప్పగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది తలపై గాంధీ టోపీ, ఒక చేతిలో స్వేచ్ఛగా గాలిలోకి వదిలేందుకు సిద్ధంగా ఉన్న శ్వేత పావురం, షేర్వానీలో అందంగా ఇమిడి ఉన్న ఎర్ర గులాబీ. అలాగే మన ప్రాచీన భారత చరిత్రలో కూడా పావురాలకు గొప్ప స్థానం ఉందని తెలిపే ఉదంతాలు కోకొల్లలు. కాని ఇటీవలి కాలంలో పావురాల వలన మనుషులలో హైపర్సెన్సి టివిటీ న్యుమోనైటిస్, ఇతర ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు ఎక్కువగా సంభవిస్తుండటంతో మన అందరిలో ఒక ఆందోళన వ్యక్తమవుతోంది.

శ్వాసకోశ వ్యాధులు పావురాల ద్వారా మనుషులకు ఎలా?

ఒక పావురం సంవత్సరానికి 12 కిలోల మలాన్ని ఉత్పత్తి చేయగలదు. పక్షి నిపుణుల అభిప్రాయం ప్రకారం, పావురాల విసర్జన ఆమ్ల స్వభావం కలిగి ఉండటంతో పాటు ఇవి సాల్మొనెల్లా క్రిములను కూడా వ్యాపింప చేస్తాయి. క్లామిడియోసిస్, హిస్టోప్లాస్మోసిస్, యెర్సినియోసిస్, సాల్మొనెలోసిస్, టాక్సోప్లాస్మోసిస్, క్షయ వ్యాధితో సహా ప్రాణాంతకమైన వ్యాధులను పావురాలు వ్యాపింపచేస్తాయి. వాటి మలంలో తరచుగా ఫంగల్ వ్యాధి క్రిప్టోకోకోసిస్ ఉంటుంది, ఇది ముఖ్యంగా బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ కలిగిన వ్యక్తులకు ప్రమాదకరం. పావురాలు వలన దాదాపు విశ్వవ్యాప్తంగా ఒక విరక్తి భావన వస్తుంది..

ఎలా వ్యాపిస్తుంది

పావురం రెట్టలు, ఈకలు శ్వాసకోశ వ్యాధులకు, గాలి ద్వారా సంభవించే వివిధ రకాల ఇన్ఫెక్షన్లకు ప్రధాన హేతువులు. ఫైబ్రోటిక్ ఊపిరితిత్తుల వ్యాధి, ఉదాహరణకు, హైపర్సెన్సిటివిటీ న్యుమో నైటిస్ లేదా బర్డ్ బ్రీడర్స్ ఊపిరితిత్తుల వ్యాధి పావురం రెట్టల వల్ల వస్తుంది. పావురాల రెట్టలు ఎండిపోయి దుమ్ముగా మారినప్పుడు అవి సులభంగా వాతావరణంలో కలిసిపోయి మనుషులు గాలి పీల్చినప్పుడు వారి ఊపిరితిత్తులకు చేరుకుంటాయి. అత్యధిక నష్టం మనకు ప్రధానంగా హిస్టోప్లాస్మా క్యాప్సులాటం అనే ఫంగస్ నుండి పుడుతుంది, ఇది సాధారణంగా పావురం రెట్టలలో కనిపిస్తుంది. హిస్టోప్లాస్మా క్యాప్సులాటం హిస్టోప్లాస్మోసిస్ అని పిలువబడే ఊపిరితిత్తుల సంక్రమణకు కారణమవుతుంది. ఈ ఫంగస్ యొక్క బీజాంశాలను (ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి వ్యాపిస్తాయి). పీల్చినప్పుడు, అవి ఊపిరితిత్తులకు చేరుకొని తాపజనక ప్రతిచర్యను కలిగిస్తాయి. చాలా సందర్భాలలో, హిస్టోప్లాస్మోసిస్ తేలికపాటి ఫ్లూ లాంటి లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ కొన్ని సందర్భాలలో ఎటువంటి లక్షణాలు కనిపించవు. బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థలు లేదా అధిక మోతాదులో బీజాంశాలకు గురయ్యే వ్యక్తులలో, సంక్రమణ తీవ్రమవడంతో పాటు శరీరం అంతటా వ్యాపిస్తుంది. ముఖ్యంగా దగ్గు దమ్ము (ఆస్థమా) రోగగ్రస్తులకు కూడా పావురాలు అత్యంత ప్రమాదకరంగా పరిణమి స్తాయి. పావురాల జనాభా గణనీయంగా వృద్ధి చెందుతుండటంతో సాధారణ పిచ్చుకల లాంటి ఎన్నో పక్షులు పర్యావరణంలో కనుమరుగవుతున్నాయి. పావురాలు రెట్టల వలన భవనాలు, స్మారక చిహ్నాల సౌందర్యం దెబ్బ తినడమే కాక ఆ ప్రాంతంలో పరిశుభ్రమైన గాలిపై ప్రతి కూల ప్రభావం కలిగిస్తుంది. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కలకత్తా, హైదరాబాద్, బెంగళూరు, పూణే లాంటి జన సమ్మర్ధమైన నగరాలలో పావురాల వల్ల ఊపిరితిత్తుల వ్యాధి కేసులు గణనీయంగా పెరుగుతున్నాయిఅని అధ్యయనాల వలన తెలుస్తుంది.. ఈ సమస్య నుండి గట్టెక్కడానికి పావురాల పెంపకానికి దూరంగా ఉండటం మంచిది. బర్డ్ బ్రీడర్ లేదా పావురాల పెంపకందారులు ప్రత్యక్షంగా వాటి ద్వారా గాలిలో వ్యాపించే ఏవియన్ యాంటిజెన్‌ల కారణంగా ఊపిరి తిత్తుల వ్యాధికి గురి అవుతుండగా, వాటి మలవిసర్జన కార ణంగా వాయు కాలుష్యం ఏర్పడంతో పాటు వాటి రెట్టల నుండి ఉత్పన్నమయ్యే వివిధ రకాల ఫంగస్‌ల వలన సామాన్య ప్రజలను తాము పీల్చే గాలి ద్వారా ఊపిరితిత్తుల వ్యాధులు, దగ్గు, ఆస్థమాలకు గురిచేస్తున్నాయి. సీటీ ఛాతీ(HRCT), పిఎఫ్ టి కొన్ని రోగనిరోధక పరీక్షల వంటి పరిశోధనలతో పాటు ఒక వ్యక్తి పావురాలతో సాన్నిహిత్యంగా గడిపే అవకాశాలు అతను నివాసం క్లినికల్ చరిత్ర ఆధారంగా కూడా రోగ నిర్ధారణ ఆధా రపడి ఉంటుంది . ఈ వ్యాధి నుండి రోగిని కాపాడడానికి మొదటి రోగ నిర్ధారణ చాలా ముఖ్యము, సరైన సమయంలో చికిత్స చేయకపోతే కోలుకోలేని ఊపిరితిత్తుల వ్యాధి వలన నష్టం, వివిధ శ్వాసకోశ లోపాలతో పాటు మరణానికి కూడా దారితీయవచ్చు..

పావురాల దగ్గర నివసించే వారు జాగ్రత్త..

పావురాల వంటి పక్షులు యూరికోటెలిక్ అయినందున యూరియా, అమ్మోనియాకు బదులుగా యూరిక్ యాసిడ్ రూపంలో నత్రజని వ్యర్థాలను విసర్జిస్తాయి. పక్షులకు మూత్రాశయం లేనందున, యూరిక్ యాసిడ్ వాటి మలంతో పాటు విసర్జిస్తాయి. రెట్ట ఎండిపోయాక అది కణాలుగా విడిపోయి గాలిలో కలిసి పోతాయి. అవి పావురాలకు గింజలు వేసేందుకు వెళ్లిన వారికి శ్వాస ద్వారా ఊపిరితిత్తుల్లో చేరి అలెర్జీకి, ఇన్ఫెక్షన్‌కు కారణం అవుతుంది. అది ముదిరి ఊపిరితిట్టులపై ప్రభావం చూపిస్తుంది. పావురాలకు ఆహారం ఇవ్వడం మానేయడం, అవి ఉన్న చోటికి వెళ్ల కుండా ఉండటం ఉత్తమ చికిత్స ... ఢిల్లీ, ముంబై, పూణే, బెంగళూరు మరియు హైదరాబాద్ నగరాలలో పావురాల కారణంగా ఆందోళనకరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

డా. కౌశల్ గోవర్ధన
ఎం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
7702417779
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా.ధనుంజయ హాస్పిటల్, హైదరాబాద్

పెంపుడు జంతువుల విషయంలో జాగ్రత్త

ప్రతి ఒక్కరి ఇళ్లల్లో పెంపుడు జంతు వులు ఉండడం ఈ రోజులలో సర్వసాధారణం. పెంపుడు జంతువులుగా చాలా మంది కుక్కలు, పిల్లులు, కొన్ని రకాల పక్షులను పెంచుకుంటూ ఉంటారు. అయితే ఎలాంటి వాటిని పెంచుకున్నా పర్లేదు కానీ పావురాలను పెంచుకునే విషయంలో మాత్రం ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. ఎందుకంటే పావురాలు విసర్జించే మలం ద్వారా దాదాపు 60 రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.

పక్షి శాస్త్రవేత్తలు ఏమంటున్నారు?

పక్షులకు సొంతంగా ఆహారం సమకూర్చుకునే లక్షణం ఉంటుంది. దాన్ని మనమే తగ్గిస్తున్నాము. పక్షుల కారణంగా ప్రజలు వ్యాధులకు గురవుతున్నారని, వాటికి ముందు ఆహారం అందించడం తగ్గించాలని అని పక్షి శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పక్షులకు సొంతంగా ఆహారం సమకూర్చుకునే అవకాశం ఇవ్వాలని తెలిపారు. ప్రజలు పక్షులకు ఆహారం వేయడం మానేస్తే, అవి జనావాసాలు వదిలి అడవుల్లోకి వెళుతాయని పక్షి శాస్త్రవేత్తలు చెపుతున్నారు. దీనికి జరిమానాలే కాదు అవగాహన సైతం కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పక్షుల కారణంగా మానవులకు వచ్చే రోగాలు గురించి (అవగాహన) ప్రచారం చెయ్యాలని వారు సూచిస్తున్నారు. సులభంగా దాణా అందుతుండడంతో అటవీ, గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే అర్బన్‌లో వీటి సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. పట్టణాల్లో ఉండే పావురాలు ఏటా ఆరుసార్లు సంతానాన్ని కంటాయి. వీటిని వేటాడే జంతువులు, పక్షులు చాలా తక్కువగా ఉండడంతో నియంత్రణ సహజంగా జరగడం లేదు. ఇప్పటికే పావురాలకు ఆహారం వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని మహారాష్ట్రలోని పుణే, థానే, పన్వేల్ కార్పొరేషన్లు ప్రకటించాయి. బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో కూడా ఇదే పరిస్థితి రావచ్చు.

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

లక్షణాలు

ప్రజల్లో ఇలాంటి వ్యాధిపై అవగాహన లేకపోవడం వల్ల హైపర్ సెన్సిటివిటీ న్యుమోనైటిస్, ఇతర ఊపిరితిత్తుల ఇన్ ఫెక్షన్లు ఎక్కువగా నమోదవుతున్నాయని పలువురు ఛాతీ వైద్యనిపుణుల అభిప్రాయం... సాధారణంగా పావురాలు లేదా వాటి రెట్టల వద్ద సన్నిహితంగా గడిపే వారిపై దీర్ఘకాలంలో ప్రభావం చూపుతుంది అని తెలుస్తుంది. ఈ అలెర్జీతో జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పులు, శ్వాస ఆడకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ

పావురాలు దాల్చిన చెక్క లేదా వేడి మిరియాల రసం వంటి ఘాటు వాసనలను ఇష్టపడవు మీరు పావురాలు ఉన్న కాలనీలో నివసించే వారు అయితే, గూడు కట్టుకునే ప్రాంతాలకు మనం సురక్షి తంగా చేరుకోగలిగితే, పక్షులను తరిమికొట్టడానికి మీరు ఈ పదార్థాలను పిచికారీ చేయవచ్చు, పూయవచ్చు. పావురాలు అత్యంత సాధారణంగా ద్వేషించే రంగులు తెలుపు, ఎరుపు, నీలం, లోహ రంగులు. ఈ రంగులను వాడడం ద్వారా పావురాలను దూరంగా ఉంచవచ్చు. బహుళ అంత స్తుల భవనాలు అపార్ట్మెంట్స్ ఎక్కువగా ఉండే నగర పట్టణ ప్రాంతాలలోని బాల్కనీలలో పావురాలు సాధారణంగా వస్తుంటాయి. పక్షులను బెదరగొట్టే ప్రత్యేక ధ్వనుల ఏర్పాటు, మిరుమిట్లు గొలిపే ప్రతిబింబాలు, ప్లాస్టిక్ గుడ్లగూబ లేదా రబ్బరు పాము లాంటి వాటిని వుపయోగించి పక్షి ప్రాణానికి ఇబ్బంది కాకుండా పావురాల సమస్య నుండి బయట పడవచ్చు. అయితే పావురాల బెడదను తప్పించుకునే విషయంలో భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 428, సెక్షన్ 429 ప్రకారం పావురాలకు రక్షణ ఉందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి.

ప్రమాదమే.. కుట్ర లేదు!

- అజిత్ పవార్ మరణంపై శరద్ పవార్

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణంపై ఎన్సీపీ ఎస్పీ అధినేత శరద్ పవార్ స్పందించారు. విమాన ప్రమాదంలో ఎలాంటి కుట్ర లేదని అన్నారు. అజిత్ పవార్ ఈ ప్రమాదంలో మరణించారంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఆయన మరణంతో మహారాష్ట్రకు తీరని నష్టం జరిగిందని శరద్ పవార్ తెలిపారు. ఒక సమర్థవంతమైన నాయకుడు ఈ రోజు మనల్ని విడిచి వెళ్ళిపోయారని చెప్పారు. 'మహారాష్ట్ర ఈ రోజు ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయింది. ఈ నష్టాన్ని ఎప్పటికీ పూడ్చలేం' అని అన్నారు. కాగా, అన్నీ మన చేతుల్లో ఉండవని అజిత్ పవార్ బాబాయ్ అయిన 85 ఏళ్ల శరద్ పవార్ తెలిపారు. తాను నిస్సహాయంగా ఉన్నట్లు చెప్పారు. 'ఏడవడం సిగ్గుగా అనిపించవచ్చు. కొన్ని సంఘటనల వెనుక రాజకీయాలు ఉండవు. ఈ విషయంలో నా వైఖరిని నేను స్పష్టంగా చెప్పా. దీనిలో ఎలాంటి కుట్ర లేదు. ఇది కేవలం ఒక ప్రమాదం మాత్రమే. మహారాష్ట్ర, మనమందరం ఈ బాధను జీవితాంతం భరించాల్సి ఉంటుంది. దయచేసి దీనిలోకి రాజకీయాలను తీసుకురావద్దు, నేను చెప్పదలుచుకున్నది ఇంతే' అని ఆయన అన్నారు.

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై దూకుడు ప్రదర్శిస్తున్నారు. తాజాగా మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. మరిన్ని యుద్ధనౌకలు ఆ దేశం వైపు వెళ్తున్నాయని పేర్కొన్నారు. వీటిని ఉపయోగించే అవసరం రావొద్దని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే అమెరికాకు చెందిన విమాన వాహకనౌక 'USS అబ్రహం లింకన్' పశ్చిమాసియాకు చేరుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ యుద్ధ నౌకల గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్త పరిస్థితులను మరింత పెంచేశాయి. మరో యుద్ధనౌక ఇరాన్‌వైపు వెళ్తోందని.. వారు ఒప్పందం చేసుకుంటారని ఆశిస్తున్నామని ట్రంప్ అన్నారు. ఇప్పటికే వాళ్లు దాన్ని చేసుకోవాల్సి ఉందని.. దీనికి వారు సిద్ధంగా ఉన్నట్లు నాకు తెలుసని అన్నారు. వాళ్లు చాలాసార్లు తనకు ఫోన్ చేసినట్లు చెప్పారు. అదనపు వైమానిక రక్షణ వ్యవస్థలను కూడా ఈ ప్రాంతం వైపు తరలిస్తున్నట్లు మరో అమెరికా అధికారి చెప్పారు. ఇదిలాఉండగా ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వేలాది మంది ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక ప్రజల ప్రాణాలు తీస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే అబ్రహం లింకన్ వాహక నౌకతో పాటు మరికొన్ని యుద్ధ నౌకలను పశ్చిమాసియా మోహరిస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా ఏ క్షణమైన దాడులు చేయవచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి.

ఈయూ డీల్‌లో భారత్ పైచేయి

భారత్ ఐరోపా సమాఖ్యల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం భారత్‌కే ఎక్కువ అనుకూలంగా ఉందని అన్నారు.ఓ ఇంటర్వ్యూలో గ్రీర్ మాట్లాడుతూ.. 'ఈ ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలు నేను పరిశీలించా. దీనిలో భారతదేశం పైచేయిగా నిలుస్తుందని భావిస్తున్నా. ఐరోపా మార్కెట్ లో భారత ఉత్పత్తులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి' అని పేర్కొన్నారు. భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దేశంలోకి దిగుమతయ్యే వస్తువులపై టారిఫ్‌లు విధిస్తుండటంతో.. పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఈయూ.. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

రికార్డులతో సెమీస్ చేరిన జోకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లోకి నోవాక్ జోకోవిచ్ ప్రవేశించాడు. ఈ నేపథ్యంలో ఆ టెన్నిస్ స్టార్ చరిత్ర సృష్టించారు. క్వార్టర్ ఫైనల్‌తో పాటు రౌండ్ 16లోనూ ఒక్క సెట్ కూడా గెలవకుండానే సెమీఫైనల్లోకి ప్రవేశించాడతను. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొత్త రికార్డులు క్రియేట్ చేశాడు. క్వార్టర్స్‌లో ఓటమి అంచు నుంచి బయటపడ్డ అతను.. చాలా లక్కీగా సెమీస్‌కు ఎంట్రీ ఇచ్చాడు. రాడ్ లావెర్ ఎరినా లో ఇవాళ జరిగిన క్వార్టర్స్ మ్యాచ్ నుంచి ఇటలీ ప్లేయర్ లోరెంజో ముసెటి గాయంతో తప్పుకున్నాడు.వాస్తవానికి ఈ మ్యాచ్‌లో ముసెటి పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు.ఇక గెలుపు ఖాయం అనుకున్న దశలో.. తొడ కండరాలు పట్టేయడంతో ముసెటి మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. 64, 63 స్కోరుతో ముసెటి తొలి రెండు సెట్లను కైవసం చేసుకున్నాడు. ఇక మూడవ సెట్‌లోనూ 31 తేడాతో ఆధిపత్యంలో కొనసాగుతున్నాడు. ఆ సమయంలో ముసెటి కుడి తొడలో తీవ్రమైన నొప్పి వచ్చింది. ఆ దశలో అయిదో సీడ్ ముసెటి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు.గాయం వల్ల తప్పుకోవడంతో లక్కీగా జోకోవిచ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. అంతకుముందు రౌండ్ 16లో కూడా జాకబ్ మెన్సిక్ గాయంతో తప్పుకున్నాడు. ఆ మ్యాచ్‌లో జోకోవిచ్‌కు వాకోవర్ లభించింది. దీంతో రెండు మ్యాచుల్లో ఒక్క సెట్ కూడా గెలవకుండా జోకోవిచ్ సెమీస్‌లోకి ఎంటర్‌కావడం విశేషం.ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొత్త రికార్డు క్రియేట్ చేశాడు జోకోవిచ్. ఆ గ్రాండ్‌స్లామ్‌లో 103వ మ్యాచ్ గెలిచాడు. గతంలో రోజర్ ఫెదరర్ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో స్విస్ ప్లేయర్ ఫెదరర్ కూడా వందకు పైగా మ్యాచ్‌ల్లో విజయం సాధించాడు.

ప్రతిపక్షం
Prathipaksham.in

నాలుగో టీ20లో భారత్ ఓటమి

న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో (IND vs NZ) భారత్ 50 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 216 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా.. 18.4 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయింది. శివమ్ దూబె (65; 23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సులు) ఒక్కడే పోరాడగా.. రింకు సింగ్ (39; 30 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), సంజు శాంసన్ (24; 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. అభిషేక్ శర్మ డకౌటవ్వగా.. సూర్యకుమార్ యాదవ్ (8), హార్దిక్ పాండ్య (2) నిరాశపర్చారు. కివీస్ బౌలర్లలో మిచెల్ శాంట్నర్ 3, జాకబ్ డఫీ 2, ఇష్ సోధి 2, మ్యాట్ హెన్రీ, జాక్ ఫౌక్స్ చెరో వికెట్ పడగొట్టారు. సిరీస్‌లో చివరి మ్యాచ్ శనివారం (జనవరి 31) తిరువనంతపురంలో జరగనుంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.లక్ష్యఛేదనకు దిగిన భారత్.. తొలి రెండు ఓవర్లలోనే అభిషేక్, సూర్యకుమార్ వికెట్లను కోల్పోయింది. ఈ దశలో రింకు, శాంసన్ దూకుడుగా ఆడటంతో భారత్ పవర్ ప్లే ముగిసేసరికి 53/2తో నిలిచింది. అయితే, స్వల్ప వ్యవధిలో శాంసన్.. తర్వాత వచ్చిన హార్దిక్ పెవిలియన్ చేరారు. కాసేపటికే రింకు కూడా ఔట్ కావడంతో భారత్ 82/5తో కష్టాల్లో పడింది. ఈ క్రమంలో శివమ్ దూబె ఒక్కసారిగా చెలరేగిపోయాడు. ఇష్ సోధి వేసిన 12 ఓవర్‌లో మూడు సిక్సులు, రెండు ఫోర్లు బాదేశాడు. తర్వాత రెండు సిక్సులు కొట్టి 15 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. హెన్రీ వేసిన 15 ఓవర్‌లో సిక్స్, ఫోర్ కొట్టిన దూబె.. అదే ఓవర్‌లో చివరి బంతికి రనౌటయ్యాడు. స్ట్రైకింగ్‌లో ఉన్న హర్షిత్ బంతిని బలంగా బాదాడు. బౌలర్ చేతికి తగిలిన బంతి నాన్ స్ట్రైకర్ ఎండ్‌లో స్టంప్స్‌ను తాకింది. అప్పటికే హర్షిత్ క్రీజులోంచి బయటికి రావడంతో దూబె రనౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో భారత్ ఓటమి ఖాయమైపోయింది.టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఓపెనర్లు టిమ్ సిఫెర్ట్ (62; 36 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులు), డెవాన్ కాన్వే (44; 23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) అదరగొట్టారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 100 పరుగులు భాగస్వామ్యం నెలకొల్పింది. డారిల్ మిచెల్ (39*; 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు) చివర్లో దూకుడుగా ఆడాడు. గ్లెన్ ఫిలిప్స్ (24), జాక్ ఫౌక్స్ (13), మిచెల్ శాంట్నర్ (11) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 2, అర్షదీప్ సింగ్ 2, బుమ్రా, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ తీశారు.

టాప్10లోకి సూర్యకుమార్ యాదవ్

భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టీ20 ర్యాంకింగ్స్‌లో తిరిగి టాప్ 10లోకి దూసుకొచ్చాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న సూర్య.. ఐదు స్థానాలు ఎగబాకి 717 రేటింగ్ పాయింట్లతో ఏడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. టీ20 ప్రపంచ కప్ మరికొన్ని రోజుల్లో మొదలుకానున్న తరుణంలో 'స్కై' ఫామ్‌లోకి రావడంతో టీమ్ఇండియా అభిమానులు ఖుషీ అవుతున్నారు. న్యూజిలాండ్‌లో సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో సూర్య 37 బంతుల్లోనే 82 పరుగులు, మూడో టీ20లో 26 బంతుల్లోనే 57 రన్స్ చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కివీస్‌తో మిగిలిన రెండు మ్యాచ్‌లతోపాటు పొట్టి కప్‌లోనూ టీమ్ఇండియా సారథి ఇదే జోరు కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.ఇక, సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్న ఓపెనర్ అభిషేక్ శర్మ (929 రేటింగ్ పాయింట్లు) అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. కివీస్‌తో మూడో టీ20లో అభిషేక్ 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేయగా.. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో 35 బంతుల్లో 84 రన్స్ చేశాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ (849), తిలక్ వర్మ (781) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. టీమ్ఇండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు స్థానాలు మెరుగై 13వ ర్యాంక్‌లో నిలిచాడు. వరుణ్ చక్రవర్తి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్య ఒక స్థానం మెరుగుపర్చుకుని మూడో స్థానంలో నిలవగా.. శివమ్ దూబె ఆరు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్ దక్కించుకున్నాడు. అక్షర్ పటేల్ మూడు స్థానాలు పడిపోయి 13వ ర్యాంక్‌లో ఉన్నాడు.

షుమాకర్ కోలుకుంటున్నాడు..?



పన్నెండేళ్ల కింద ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఫార్ములా 1 దిగ్గజం మైకేల్ షుమాకర్ మంచానికే పరిమితమైన సంగతి తెలిసిందే. ఇన్నేళ్లలో అతడి ఆరోగ్య స్థితి గురించి అధికారికంగా ఎలాంటి సమాచారం రాలేదు. అతడి కుటుంబం గోప్యత పాటించింది. షుమాకర్ స్థితిలో ఎలాంటి మార్పు లేదని అప్పుడప్పుడు మీడియాలో మాత్రం వార్తలొచ్చాయి. కానీ అతడు పురోగతి సాధిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయని తాజాగా ఫాక్స్ స్పోర్ట్స్ వెల్లడించింది. ఇప్పుడు అతడు మంచానికే పరిమితమై లేడని, చక్రాల కుర్చీలో కూర్చోగలుగుతున్నాడని తెలిపింది. షుమాకర్ భార్య కోరినా అతణ్ని జాగ్రత్తగా చూసుకుంటోంది. స్విట్జర్లాండ్‌లో ప్రత్యేక వైద్య బృందం 57 ఏళ్ల షుమాకర్‌కు చికిత్స అందిస్తోంది. ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్ షుమాకర్ 2013లో ఫ్రెంచ్ ఆల్ప్స్‌లో స్కీయింగ్ చేస్తూ ప్రమాదానికి గురయ్యాడు. అతడి తలకు తీవ్ర గాయమైంది.

సెట్స్‌పైకి ప్రభాస్..

రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ సినిమా ఫ్యాన్స్ ని ఇంప్రెస్ చేయడంలో విఫలమైంది. మారుతి ఈ సినిమా కోసం ఎంత కష్టపడినా కూడా రెబల్ ఫ్యాన్స్ ని సాటిస్ఫై చేయలేకపోయాడు. రాజా సాబ్ రిలీజ్ తర్వాత ప్రభాస్ తన పూర్తి ఫోకస్ నెక్స్ట్ సినిమాల మీద పెడుతున్నాడు. ప్రస్తుతం సెట్స్ మీద ప్రభాస్ ఫౌజీ, స్పిరిట్ సినిమాలు ఉన్నాయి. ఫౌజీ ఆల్రెడీ సగానికి పైగా పూర్తైంది. ఐతే ఈ సినిమాతో పాటు సందీప్ వంగ స్పిరిట్ సినిమా కూడా చేస్తున్నాడు ప్రభాస్.ఐతే ఈ రెండిటితో పాటు కల్కి 2 కి కూడా ప్రభాస్ డేట్స్ ఇస్తున్నట్టు తెలుస్తుంది. కల్కి 2898 ఏడి వచ్చి రెండేళ్లు అవుతుంది. ఆ సినిమా పార్ట్ 2 మీద నాగ్ అశ్విన్ ఇప్పటివరకు వర్క్ చేశాడు. ప్రభాస్ డేట్స్ ఇస్తే సెట్స్ మీదకు వెళ్లడమే అన్నట్టు ఉన్నాడు. ఐతే ఫౌజీ మరో 3 నెలల్లో పూర్తి చేసే ప్లానింగ్ లో ఉన్న ప్రభాస్ ఫౌజీతో పాటు స్పిరిట్ చేస్తూ కల్కి 2 కి కూడా డేట్స్ అడ్జెస్ట్ చేస్తున్నాడట. ఫిబ్రవరి లోనే కల్కి 2 షూటింగ్ మొదలు పెట్టే ఆలోచనలో ఉన్నాడట నాగ్ అశ్విన్.\సో కల్కి 2 కూడా 2027 రిలీజ్ రేసులో ఉండే ఛాన్స్ ఉంటుంది. అంతేకాదు ప్రభాస్ సందీప్ వంగ కాంబోలో వస్తున్న స్పిరిట్ ని 2027 మార్చి రిలీజ్ ప్లానింగ్ లో ఉన్నారు. సో ఈ సినిమాలతో ప్రభాస్ మరోసారి తన ఫ్యాన్స్ కి మాస్ ఫీస్ట్ అందిచేలా ఉన్నాడు. రాజా సాబ్ కోసం తన ఎఫర్ట్ తాను పెట్టినా రిజల్ట్ ఎక్స్ పెక్ట్ చేసినట్టుగా రాలేదు. అందుకే ప్రభాస్ ఫౌజీ, స్పిరిట్, కల్కి 2 విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోకుండా చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారట.ఈ 3 సినిమాలతో పాటు ప్రశాంత్ నీల్ ఫ్రీ అయితే సలార్ 2 ని కూడా లైన్ లో పెట్టాలని చూస్తున్నాడు ప్రభాస్. 2027 లో సలార్ 2 సెట్స్ మీదకు వెళ్లినా 2028 లేదా 2029లో ఆ మూవీ రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. రెబల్ స్టార్ ఫ్యాన్స్ కి ఈ నాలుగు సినిమాలు ఆయన మాస్ స్టామినా ఏంటో చూపిస్తాయని చెప్పొచ్చు.ఫౌజీ, స్పిరిట్ కన్నా కల్కి 2 భారీ బడ్జెట్ తో కొత్త ప్రపంచంలో సినిమా ఉండబోతుంది. అందుకే ఆ సీక్వెల్ మీద రెబల్ ఫ్యాన్స్ ఎక్కువ ఆసక్తిగా ఉన్నారు. అక్కడ ఉంది నాగ్ అశ్విన్ కాబట్టి తప్పకుండా రెబల్ ఫ్యాన్స్ ని సంతృప్తి పరచేలా చేస్తాడని చెప్పడంలో సందేహం లేదు.

నాగబంధం కోసం రూ.100 కోట్లా?

టాలీవుడ్‌లో ప్రస్తుతం మైథలాజికల్ ట్రెండ్ నడుస్తోంది. పురాణాలు, దైవశక్తి, పురాతన ఆలయాల చుట్టూ అల్లిన కథలను చూడటానికి ఆడియన్స్ తెగ ఆసక్తి చూపిస్తున్నారు. 'కార్తికేయ 2', 'హనుమాన్' లాంటి సినిమాల సక్సెస్ తర్వాత ఇప్పుడు అదే జోనర్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ విజువల్ వండర్ పక్కా నిగూఢ రహస్యాల నేపథ్యంలో సాగబోతోంది. టెక్నికల్ గా హై స్టాండర్డ్స్ మెయింటైన్ చేస్తూ భారీ కాన్వాస్ పై ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ ఇది వరకే క్లారిటీ ఇచ్చారు.విరాట్ కర్ణ హీరోగా, అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మైథలాజికల్ యాక్షన్ డ్రామాకు 'నాగబంధం: ద సీక్రెట్ ట్రెజర్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ఫిక్స్ చేశారు. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ ఇప్పటికే ఆడియన్స్ లో క్యూరియాసిటీ పెంచేసింది. కేవలం పోస్టర్లతోనే కాకుండా, ఇందులో ఉండే మిస్టరీ ఎలిమెంట్స్ నేటి జనరేషన్ ఆడియన్స్ కు ఒక కొత్త థ్రిల్ ఇచ్చేలా ఉంటాయని చిత్ర యూనిట్ ధీమాగా ఉంది.ఇక ఈ సినిమాను ఏకంగా 100 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మిస్తున్నారట. తిరువనంతపురం అనంత పద్మనాభ స్వామి ఆలయంలోని నిగూఢ నిక్షేపాల నేపథ్యంలో ఈ కథ సాగుతుందని చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఆ నిధి వెనుక ఉన్న రహస్యాలు ఏంటి? నాగబంధం అనే పేరుకు కథకు ఉన్న లింక్ ఏంటి? అనే అంశాలను చాలా ఇంటెన్సిటీతో చూపించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఒక ఎపిసోడ్ కోసం ఏకంగా 10 కోట్లు ఖర్చు చేసినట్లు కూడా ఇది వరకే హింట్ ఇచ్చారు.క్లైమాక్స్ కోసం వేసిన భారీ సెట్స్ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానున్నాయట. పురాతన విష్ణు దేవాలయాల చరిత్రను, ఆధునిక యాక్షన్ కు జోడించి మేకర్స్ ఈ సినిమాను ప్లాన్ చేశారు. జగపతి బాబు, మురళీ శర్మ లాంటి సీనియర్ నటులు కీలక పాత్రలు పోషిస్తుండటంతో సినిమాపై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. మేకింగ్ వాల్యూస్ లో ఎక్కడా తగ్గకుండా అభిషేక్ పిక్చర్స్ ఈ పాన్ ఇండియా ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.ఇక ఈ చిత్రాన్ని 2026 వేసవిలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. సమ్మర్ హాలిడేస్ ను క్యాష్ చేసుకునేలా ఈ భారీ బడ్జెట్ సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ చూస్తుంటే.. అడ్వెంచరస్ థ్రిల్లర్ ను ఇష్టపడే వారికి ఈ సినిమా ఒక క్యూరియసిటీని క్రియేట్ చేస్తోంది . నిధి వేట చుట్టూ సాగే సినిమాలకు ఎప్పుడూ ఉండే క్రేజ్ ఈ సినిమాకు కూడా ప్లస్ అయ్యేలా ఉంది. 'నాగబంధం' బాక్సాఫీస్ దగ్గర తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రెడీ అవుతోంది. భారీ బడ్జెట్ కు తగ్గట్టుగా కంటెంట్ లో కూడా దమ్ము ఉంటే మరో సెన్సేషనల్ హిట్ టాలీవుడ్ ఖాతాలో చేరడం ఖాయం. ఆ పద్మనాభ స్వామి ఆలయ రహస్యాలు వెండితెరపై ఎలా హైలెట్ అవుతాయో చూడాలి.

ఈసారి అనుదీప్‌ని నమ్ముతారా?

టాలీవుడ్‌లో వెరైటీ కామెడీతో తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకున్నాడు దర్శకుడు అనుదీప్ కేవీ. 'జాతి రత్నాలు' సినిమాతో ఓవర్ నైట్ సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ దర్శకుడికి ఒక సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ముఖ్యంగా సినిమా కంటే ముందు వచ్చే ఇంటర్వ్యూలు, అందులో పేలే పంచులు ప్రేక్షకులకు భలే ఫన్ ఇస్తాయి. ఇప్పుడు విశ్వక్ సేన్ హీరోగా రాబోతున్న 'ఫంకీ' సినిమా విషయంలో కూడా దర్శకుడు తన మార్క్ ప్రమోషన్లతో నెట్టింట సందడి చేస్తున్నారు.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో వస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 13న రిలీజ్‌కు సిద్ధమవుతోంది. సాధారణంగా ఈ బ్యానర్ నుంచి వచ్చే సినిమాలకు ఉండే ప్రమోషనల్ హైప్ ఈసారి ఎందుకో తక్కువగానే కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ కూడా ఆడియన్స్‌లో పెద్దగా బజ్ క్రియేట్ చేయలేకపోయింది. రొటీన్ కామెడీ సీన్లతో సాగిపోయిన ఆ టీజర్ చూసిన తర్వాత కథలో కొత్తదనం ఏమైనా ఉంటుందా అనే సందేహాలు మొదలయ్యాయి.

అసలు పాయింట్ ఏంటంటే.. కేవలం దర్శకుడి ఇంటర్వ్యూలను నమ్ముకుని జనం థియేటర్లకు వస్తారా అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గతంలో 'ప్రిన్స్' సినిమా సమయంలో కూడా అనుదీప్ ఇలాగే ఇంటర్వ్యూలతో తెగ నవ్వించారు. కానీ థియేటర్లో కంటెంట్ రొటీన్‌గా ఉండటంతో రిజల్ట్ తారుమారైంది. ఇప్పుడు 'ఫంకీ' విషయంలో కూడా ప్రమోషన్ల బాధ్యత మొత్తం దర్శకుడు తన భుజాలపై వేసుకున్నట్లు అనిపిస్తోంది.

ఈ మధ్యే సుమతో కలిసి చేసిన ఇంటర్వ్యూ బిట్స్ వైరల్ అవుతున్నా, అది వసూళ్లపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో చూడాలి.మరోవైపు మ్యూజిక్ పరంగా కూడా ఈ సినిమాకు పెద్దగా కలిసి రావడం లేదనే చెప్పాలి. ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్న భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నా, ఆడియన్స్‌ను ఊపేసే ఒక్క పాట కూడా ఇప్పటివరకు రాలేదు. ఒక సాంగ్ రిలీజ్ చేసినా అది పెద్దగా క్లిక్ కాలేదు.

ఒక మాస్ హీరో, క్రేజీ మ్యూజిక్ డైరెక్టర్ ఉన్నప్పుడు ఉండాల్సిన సౌండ్ సోషల్ మీడియాలో ఎక్కడా వినిపించడం లేదు. కేవలం అనుదీప్ మేనరిజమ్స్ మీదనే ఈ సినిమా బిజినెస్ అంతా ఆధారపడి ఉన్నట్లు కనిపిస్తోంది. విశ్వక్ సేన్ లాంటి ఎనర్జిటిక్ హీరో ఉన్నప్పుడు ప్రమోషన్లు మరింత స్పీడ్‌గా ఉండాలి. కానీ సితార టీమ్ ఈసారి ఎందుకో సైలెంట్‌గా ఉంది. బాక్సాఫీస్ దగ్గర నిలబడాలంటే కేవలం నవ్వులే సరిపోవు, కథలో కూడా బలం ఉండాలి.

అనుదీప్ తన పాత ఫార్ములానే మళ్ళీ వాడారా లేక ఏమైనా కొత్తగా ట్రై చేశారా అనేది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది. పక్కా కంటెంట్ ఉంటే తప్ప నేటి జనరేషన్ ఆడియన్స్‌ను మెప్పించడం అంత ఈజీ కాదు. మొత్తానికి 'ఫంకీ' ఫలితం పూర్తిగా అనుదీప్ క్రియేట్ చేసే ఫన్ మీదే ఆధారపడి ఉంది. ఫిబ్రవరి 13న థియేటర్లకు వచ్చే ఈ సినిమా పోయిన నమ్మకాన్ని మళ్ళీ తెచ్చిపెడుతుందో లేదో చూడాలి.

కోలీవుడ్‌కి మృణాల్!



'సీతారామం, ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ సుపరిచితురాలే. అయితే మృణాల్ ఠాకూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వచ్చిందట. శింబు హీరోగా తమిళంలో 'ఓ మై కడవులే, డ్రాగన్ (తెలుగులో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ 'గా విడుదలైంది)' వంటి సక్సెస్‌ఫుల్ సినిమాలకు దర్శకత్వం వహించిన అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఏజీఎస్ ఎంటర్‌టైన్ మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు మృణాల్ ఠాకూర్‌ను ఎంపిక చేసుకున్నారట చిత్రం యూనిట్. మృణాల్‌కు ఆల్రెడీ మేకర్స్ ఈ సినిమా కథ వినిపించారని, ఆమె ఈ సినిమాలో నటించేందుకు ఆల్మోస్ట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది.ఒకవేళ ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ నటించనున్న విషయం అధికారికంగా వెల్లడైతే, మృణాళ్‌కు తమిళ్‌లో ఇదే తొలి చిత్రం అవుతుంది. మరి..ఈ సినిమాతోనే మృణాల్ కోలీవుడ్ ఎంట్రీ జరుగుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న సినిమా, అడవి శేష్ హీరోగా చేస్తున్న 'డెకాయిట్' చిత్రాలతో మృణాల్ ఠాకూర్ బిజీగా ఉన్నారు. అలాగే ఆమె హిందీలో నటించిన 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఈ ఫిబ్రవరి 20న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ చిత్రాలే కాదు..మరికొన్ని హిందీ చిత్రాల్లోనూ ఆమె నటిస్తున్నారు.బాలీవుడ్ సక్సెస్‌ఫుల్ టాప్ హీరోయిన్ ప్రియాంకా లైఫ్ జర్నీ అంటే తనకు ఎంతో ఇష్టమని చెబుతున్నారు మృణాల్ ఠాకూర్. ఈ అంశంపై ఇటీవల ఆమె ఇంటర్వ్యూలో స్పందించారు. "సినీ ఇండస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండ సినిమాల్లోకి వచ్చారు ప్రియాంకా చోప్రా ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని, కష్టపడి గ్లోబల్ రేంజ్ హీరోయిన్ గా రాణిస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200